
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 2

శనివారం 25-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'లీక్ కేసు'లో సాక్షిగా శంకరలక్ష్మి

పేపర్ లీకేజీ కేసులో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగిని శంకరలక్ష్మి సాక్షిగా మారారు. - 3లో



అండర్ వాటర్ అణు డ్రోన్ పరీక్ష

అణుసామర్థ్యం గల అండర్ వాటర్ డ్రోన్‌ను ఉత్తర కొరియా పరీక్షించింది. - 6లో

అది దొంగల రాజ్యం

- చంద్రబాబు మరో భారీ దోపిడీ ఆధారాలతో సహా బట్టబయలు
- శాసనసభలో వివరించిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అమరావతి నిర్మాణాల్లో యథేచ్ఛగా అవినీతి.. కాంట్రాక్టు కంపెనీలను బెదిరించి భారీ వసూళ్లు
- చంద్రబాబు పీఏ, రామోజీ కుమారుడి వియ్యంకుడే పాత్రధారులు
- అవినీతి దందా సూత్రధారి చంద్రబాబే
- ఐటీ అధికారులకు నిర్మాణ కంపెనీల ప్రతినిధుల వాంగ్మూలం
- అందుకే చంద్రబాబుకు ఐటీ నోటీసులు - వివరాలు 10లో

"బోగస్ కంపెనీలను సృష్టించడం.. డబ్బులు తీసుకోవడం.. వాటిని చంద్రబాబుకు చేర్చడం.. వీటన్నింటిపై ఆధారాలతో సహా ఐటీ శాఖ అధికారులకు దొరికిపోయారు. ఇంత దారుణంగా ప్రజల డబ్బును బాబు దోచేశారు. ఈ అవినీతిలో ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్‌వీఆర్ రఘు పాత్రధారి. ఒక పద్ధతి ప్రకారం ఈ దొంగల ముఠా దోచుకో.. పంచుకో.. తినుకో.. అనే దోపిడీలో భాగస్వాములయ్యారని ఆధారాలతో వెల్లడైంది. ఇవన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉంది కాబట్టే ఈ సభ ద్వారా చెబుతున్నాం. - సీఎం వైఎస్ జగన్



ఏపీ: క్రాస్ ఓటింగ్‌పై యాక్షన్

ఆ నలుగురు.. ఔట్

- వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి, ఆనం, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి సస్పెన్షన్
- ఒక్కొక్కరికి రూ. 10–15 కోట్ల ఆశ చూపిన బాబు: సజ్జల 12లో

రాహుల్‌పై వేటుపై కేసీఆర్ రియాక్షన్

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజు



- రాహుల్‌పై అనర్హత వేటు నియంతృత్వానికి పరాకాష్ట
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు చేటుకాలం
- మోదీ తన పతనాన్ని కొని తెచ్చుకుంటున్నారు: కేసీఆర్ - 2లో

రాహుల్‌పై అనర్హత వేటు

కాంగ్రెస్ అగ్రనేత లోక్‌సభ సభ్యత్వం రద్దు



పార్లమెంట్ సెక్రటేరియట్ నిర్ణయం

- పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలుశిక్ష పడ్డందుకే..
- ఖాళీ అయిన 'వయనాడ్' స్థానం
- అనర్హత వేటుపై చట్టపరంగా, రాజకీయంగా పోరాడుతామన్న కాంగ్రెస్... దేశవ్యాప్తంగా 'జనాందోళన్'కు పిలుపు
- రాహుల్‌కు విపక్షాల మద్దతు
- రాహుల్‌కు జైలు శిక్ష గురించి తెలిసింది: ఐరాస

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో సంచలనం. పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలుశిక్ష ఖరారైన కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది! ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం నుంచే అనర్హత వేటు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. జైలుశిక్షపై హైకోర్టులో అప్పీల్ చేసుకోవడానికి వీలుగా శిక్ష అమలును నెల రోజుల పాటు నిలిపేస్తున్నట్టు సూరత్ కోర్టు ప్రకటించినప్పటికీ లోక్‌సభ సెక్రటేరియట్ మాత్రం 24 గంటల్లోపే ఎంపీగా రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటించింది. దీనిని కాంగ్రెస్ తీవ్రంగా నిరసించగా, విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. ఆయనకు బాసటగా నిలిచాయి. అనర్హత వేటుకు వ్యతిరేకంగా 'జనాందోళన్' పేరిట దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

- వివరాలు 6లో

అనర్హతపై మంటలు!

- ప్రజాస్వామ్య, పార్లమెంటరీ ప్రక్రియలకు ఇది చీకటి రోజు: మాణిక్‌రావ్ ఠాక్రే - 2లో
- మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారు: రేవంత్‌రెడ్డి
- గాంధీభవన్ వద్ద మోదీ దిష్టిబొమ్మ దహనం

రాహుల్ ముందు 2 మార్గాలు

6లో

ప్రమాదంలో ప్రజాస్వామ్యం విపక్షాల నిరసన	రాహుల్ నోరు నొక్కేందుకే..: కాంగ్రెస్ అగ్రనేతల అత్యవసర భేటీ
వేటు రాజ్యాంగబద్ధమేనా?	నేతల స్పందనలు

క్లుప్తంగా...

31న రాష్ట్రానికి నడ్డా



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా ఈ నెల 31న రాష్ట్రానికి రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా నడ్డా సంగారెడ్డిలో బీజేపీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీవర్గాలు వెల్లడించాయి. అదేరోజు తెలంగాణలోని జనగామ, వరంగల్, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఏపీలోని మరో రెండు జిల్లాల కార్యాలయాలను ఆయన వర్చువల్‌గా ప్రారంభిస్తారు. సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభలో నడ్డా ప్రసంగిస్తారు. ఆ తర్వాత రాష్ట్ర పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన విడిగా సమావేశం కానున్నట్టు సమాచారం. అనంతరం శంషాబాద్ నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని పార్టీవర్గాలు తెలిపాయి.

మహిళా రిజర్వేషన్ ఉద్యమం ఉధృతం: కవిత

ఉద్యమ కార్యాచరణ పోస్టర్ విడుదల



సాక్షి, హైదరాబాద్: చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. 'మహిళలకు, దేశానికి సాధికారిత కల్పిద్దాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వండి. ఈ బిల్లు ఎందుకు ప్రాధాన్యం కాకూడదు'అంటూ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం ఆమె విడుదల చేశారు. మిస్డ్‌కాల్ కార్యక్రమంతో పా టు వచ్చే నెలలో యూనివర్సిటీలు, కాలేజీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చా గోష్టిలు నిర్వహించాలని నిర్ణయించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు కోరుతూ దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, మేధావులకు పోస్టు కార్డులు రాయాలని కవిత నిర్ణయించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టాలనే డిమాండ్‌తో ఇప్పటికే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కవిత నిరాహార దీక్ష చేశారు. 18 రాజకీయ పార్టీలతో పాటు మహిళా సంఘాలతో భారత్ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశాన్ని కూడా నిర్వహించిన విషయం తెలిసిందే.

నిందితులను రక్షించడానికే సిట్: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



బిజినేపల్లి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితులను పట్టుకోవడానికి కాకుండా..అసలు నిందితులను రక్షించడానికే పనిచేస్తుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. పేపర్ లీక్ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీ బోర్డుకు, ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధాలున్నాయనే ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డు సభ్యుడు లింగారెడ్డి పీఏకు గ్రూప్–1లో 127 మార్కులు ఎలా వచ్చాయని, ముఖ్యమంత్రికి ఓఎస్‌డీగా పనిచేసే రాజశేఖర్‌రెడ్డికి లింగారెడ్డి స్వయంగా మేనబావని తెలిపారు. రాజ్యాధికార యాత్రలో భాగంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో ప్రవీణ్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిట్ ఈ కేసులో అసలు దోషులను వదిలేసి, కిందిస్థాయిలో 12 మందిని అరెస్టు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 2009 బ్యాచ్‌కు చెందిన 200 మంది ఎస్సైల పదోన్నతుల ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టారని, అలాంటి ఫైల్స్ చూడని హోంమంత్రిపై త్వర లోనే మిస్సింగ్ కంప్లైంట్ చేస్తామన్నారు. ప్రభుత్వానికి పనిచేయాల్సిన అడ్వొకేట్ జనరల్ కవిత లిక్కర్ స్కాం కేసు కోసం ఈడీ ముందు ఎలా హాజరవుతారని ప్రశ్నించారు.

విశ్వసనీయతే 'సాక్షి' పునాది..

వై.ఎస్. భారతీరెడ్డి
- జనహితంగా కథనాలు ఉండాలి
- పాత్రికేయ ప్రమాణాలు పాటించాలి
- ఘనంగా 'సాక్షి' 15వ వార్షిక వేడుకలు

సాక్షి, హైదరాబాద్: నాణేనికి మరో కోణాన్ని చూపించి, 'సత్యమేవ జయతే' నానుడిని సాకారం చేయాలనే లక్ష్యంతో విశ్వసనీయత పునాదిగా పుట్టిన 'సాక్షి'.. అదే బాటలో తన ప్రస్థానం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతీరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో సాక్షి దినపత్రిక 15వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా భారతీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతాన్ని విశ్లేషించుకోవడానికి, భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి వార్షికోత్సవాలు వేదిక కావాలన్నారు. కచ్చితత్వంతో కూడిన సమాచారం ఆధారంగా కథనాలు అందించేటప్పుడు తప్పనిసరిగా అవతలి వ్యక్తుల వివరణ తీసుకోవడం వంటి స్వచ్ఛతతో కూడిన పాత్రికేయ ప్రమాణాలు పాటించాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వెనుకంజ వేయనవసరం లేదన్నారు. పాఠకులకు సులభంగా చేరేలా, జనహితంగా కథనాలు సాగాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ వర్ధెల్లి మురళి, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీఈఓ అనురాగ్ అగర్వాల్, డైరెక్టర్లు రాణిరెడ్డి, వైఈపీ రెడ్డి, కేఆర్‌పీ రెడ్డి, ఏఎల్‌ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేన్సర్ బాధిత చిన్నారితో మాట్లాడుతున్న భారతీరెడ్డి

కేన్సర్ బాధిత చిన్నారులతో..

'సాక్షి' వార్షిక వేడుకల్లో భాగంగా వై.ఎస్.భారతీరెడ్డి కేన్సర్ బాధిత చిన్నారులను కలసి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా తమ బాధలను మరచిపోయిన చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని సెయింట్ జ్యూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్ ద్వారా కేన్సర్‌కు ఉచితంగా చికిత్స పొందుతున్న చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



సాక్షి 15వ వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న వైఎస్ భారతీరెడ్డి. చిత్రంలో ఎడిటర్ వర్ధెల్లి మురళి, సీఈఓ అనురాగ్ అగర్వాల్, డైరెక్టర్లు కేఆర్‌పీ రెడ్డి, ఏఎల్‌ఎన్ రెడ్డి, రాణిరెడ్డి, వైఈపీ రెడ్డి

హైవే 'కన్ను'కు జబ్బు!



మహబూబ్‌నగర్ జిల్లా ఆమన్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ రైతు శ్రీశైలం హైవే సమీపంలోని తన పొలానికి నీళ్లు పెడదామని అర్ధరాత్రి 1.30 గంటలకు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో హైవే మీద వెనక నుంచి 130–140 కి.మీ వేగంతో వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీ కొట్టింది. దూరంగా ఎగిరిపడిన రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొట్టిన వాహనం డ్రైవర్ హైవేలోనే ముందుకు వెళితే సీసీటీవీ కెమెరాలో రికార్డై పోలీసులకు దొరికిపోతానని ఊహించాడు. కడ్తాల్ టోల్‌గేట్ లైన్‌లో కాకుండా సర్వీస్ రోడ్డు గుండా పరారయ్యాడు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే సీసీటీవీ కెమెరా ఉన్నా.. అది పని చేయకపోవటంతో కేసు దర్యాప్తు నత్తనడకన సాగుతోంది. సీసీటీవీ కెమెరాల పరిస్థితికి ఆమన్‌గల్ ఘటన అద్దం పడుతుంది. కేసు దర్యాప్తులో కీలకంగా నిలిచే కెమెరాలు పని చేయకపోవటం, పని చేసినా రాత్రి సమయాల్లో రికార్డయ్యే ఆధునిక కెమెరాలు కాకపోవటంతో హిట్ అండ్ రన్ కేసుల దర్యాప్తులో పోలీసులు సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది.

జాతీయ రహదారులపైన పనిచేయని సీసీ కెమెరాలు	పనిచేస్తున్నా, రాత్రివేళ రికార్డింగుల్లో స్పష్టత కరువు	కాంతిని వెదజల్లే వాహనాలు, వీధి లైట్లే కారణం	రోడ్డు ప్రమాదాల కేసులవిచారణలో పోలీసులకు సవాళ్లు	రాష్ట్రంలోని 10 లక్షల కెమెరాల్లో పనిచేసేది 60 శాతమే..

నిధుల్లేవు.. నిర్వహణ లేదు

➤ సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రత్యేక వ్యవస్థా లేదు. అందువల్ల ప్రత్యేకంగా నిధుల కేటాయింపూ లేదు. హైవేలతో పాటు నగరాలు, పట్టణాల్లోని రోడ్లపై వీటిని ఏర్పాటు చేస్తున్న పోలీసు శాఖ కూడా సొంత నిధులు వినియోగించడం లేదు. సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, ఇతర సంఘాలు, సంస్థలు ఇచ్చే నిధులతో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన కెమెరాలు 10 లక్షలకు పైగా ఉన్నాయి. ఇందులో 40% పని చేయడం లేదని వెల్లడైంది. కెమెరాల ఏర్పాటే కష్టసాధ్యంగా ఉన్న పరిస్థితుల్లో, ఏర్పాటైన కెమెరాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోంది.

హైవేలలో ఉదయం పూట జరిగే రోడ్డు ప్రమాదాలు ఆయా ప్రాంతాల్లో పని చేస్తున్న సీసీటీవీ కెమెరాల్లో బాగానే రికార్డవుతున్నాయి. అయితే రాత్రి పూట

రాత్రివేళ కష్టమే.. స్పీడ్ కూడా సమస్యే

జరిగే ప్రమాదాలు మాత్రం సరిగా రికార్డు కావటం లేదు. వాహనాల లైట్ల కాంతి ఎక్కువగా ఉండటం, వీధి లైట్ల వెలుతురూ కెమెరాల మీద పడుతుండటంతో రాత్రివేళ దృశ్యాలు సరిగా రికార్డు కావటం లేదని శంషాబాద్ జోన్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అలాగే జాతీయ రహదారులలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవటంతో వాహనాలు 100–130 కి.మీ వేగంతో దూసుకెళ్తుంటాయి. అంత స్పీడ్‌లో వెళ్లే వాహనాల నంబర్లను ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలు గుర్తించలేక పోతున్నాయని ఆయన పేర్కొన్నారు.

సీసీటీవీ ఫుటేజీలే ప్రధాన ఆధారం..

ప్రధాన నగరాల్లో జరిగే రోడ్డు ప్రమాదాలు, చైన్ స్నాచింగ్‌లు, దాడులు, హత్యోదంతాలు ఇతరత్రా కేసుల్లో నేరస్తులను చాలావరకు.. ఆయా ఘటనలకు సంబంధించిన సీసీటీవీ కెమెరాల రికార్డింగుల ఆధారంగానే పోలీసులు గుర్తిస్తున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో కెమెరాలు పనిచేయనప్పుడు మాత్రం ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఆధునిక కెమెరాలైతేనే బెటర్..

రాష్ట్రంలో ప్రస్తుతం బుల్లెట్, ఏఎన్‌పీఆర్ కెమెరాలున్నాయి. ఆధునిక ఫీచర్లు తక్కువగా ఉండే ఏఎన్‌పీఆర్ కెమెరాల్లో 10–20మీటర్లకు మించి జూమ్ చేయలేం. అదే ఫేస్ రికగ్నిషన్, పాన్ టిల్ట్ జూమ్ (పీటీజెడ్)వంటి ఆధునిక కెమెరాలు అయితే 1కి.మీ. దూరం వరకూ జూమ్ చేయవచ్చు. 360 డిగ్రీల కోణంలో తిరుగుతూ ఉంటాయి. వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి, నంబరు ప్లేట్లను రీడింగ్ చేసే సామర్థ్యం ఉన్న ఈ తరహా కెమెరాలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

– సాక్షి, హైదరాబాద్

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజు

రాహుల్‌పై అనర్హతవేటు నియంతృత్వానికి పరాకాష్ట: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత, ఎంపీ రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రధాని నరేంద్ర మోదీ దురహంకారం, నియంతృత్వానికి పరాకాష్ట అని భారత్ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. ఇది భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటిరోజు అని అభివర్ణించారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేయడంతోపాటు అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక పార్లమెంటును కూడా తమ హేయమైన రాజకీయాల కోసం మోదీ ప్రభుత్వం ఉపయోగించుకోవడం గర్హనీయమన్నారు. 'ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు చేటుకాలం దాపురించింది. మోదీ పాలన ఎమర్జెన్సీని మించిపోతున్నది. ప్రతిపక్ష నేతలను వేధించడం పరిపాటిగా మారిపోయింది. నేరస్తులు, దగాకోరుల కోసం ప్రతిపక్ష నాయకులపై అనర్హత వేటు వేసి మోదీ తన పతనాన్ని కొనితెచ్చుకుంటున్నారు'అని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. 'పార్టీల మధ్య వుండే వైరుధ్యాలకు ఇది సందర్భం కాదు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు బీజేపీ ప్రభుత్వ దుశ్చర్యను ప్రజాస్వామ్యవాదులందరూ ముక్తకంఠంతో ఖండించాలి. బీజేపీ దుర్మార్గ విధానాలను ప్రతిఘటించాలి'అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

రాహుల్‌పై వేటు అప్రజాస్వామికం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాహుల్‌పై అనర్హత వేటువేయడం రాజ్యాంగానికి పూర్తిగా వక్రభాష్యం చెప్పడమేనని, దీనిని ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. 'వారు తొలుత కమ్యూనిస్టుల కోసం వచ్చారు. నేను కమ్యూనిస్టును కాదు కాబట్టి స్పందించలేదు. ఆ తర్వాత సోషలిస్టుల కోసం వచ్చారు.. నేను సోషలిస్టును కాదు కాబట్టి మాట్లాడలేదు. వారు ట్రేడి యూనియనిస్టుల కోసం వచ్చారు. నేను ట్రేడ్ యూనియనిస్టును కాదు కాబట్టి మాట్లాడలేదు. వాళ్లు ఆ తర్వాత యూదుల కోసం వచ్చారు. నేను యూదుడిని కాదు కాబట్టి మాట్లాడలేదు. వాళ్లు నా కోసం వచ్చారు.. ఇప్పుడు నా తరఫున మాట్లాడేందుకు ఎవరూ మిగల్లేదు'అనే మార్టిన్ నీమోలర్ వ్యాఖ్యలను కేటీఆర్ ఉటంకించారు. 'రాహుల్‌ను అనర్హుడిగా ప్రకటించడం బీజేపీ నియంతృత్వానికి అద్దం పడుతోంది. ప్రజాస్వామ్య హక్కులు ప్రమాదంలో పడ్డాయి'అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్ కూడా రాహుల్‌పై అనర్హత వేటు విషయంలో మోదీ ప్రభుత్వతీరును తప్పుపట్టారు.

అటు నినాదాలు.. ఇటు అరెస్టులు



ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు



రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ విద్యార్థి సంఘం నేతలు



ఓయూ గేట్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

- ఓయూలో ఐక్య విద్యార్థి సంఘాల మహానిరసన దీక్ష భగ్నం
- సంఘీభావం తెలపాలనుకున్న పలు పార్టీల నేతల గృహనిర్బంధం
- అయినా ఆర్ట్స్ కాలేజీ వద్ద మెరుపు దీక్ష చేపట్టిన విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ/సాక్షి హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ ఘటనను నిరసిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన 48 గంటల మహానిరసన దీక్షను పోలీసులు శుక్రవారం భగ్నం చేశారు. ఓయూ నుంచి గన్‌పార్క్ వరకు నిరుద్యోగులు చేపట్టాలనుకున్న మార్చ్‌ను అడ్డుకొని నలుగురు విద్యార్థి నేతలను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో విద్యార్థుల నినాదాలు, పోలీసులతో వాగ్వాదంతో క్యాంపస్ అట్టుడికింది. దీక్షలో పాల్గొనేందుకు వచ్చిన తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్‌ను ఎన్‌సీసీ గేటు వద్ద అరెస్ట్ చేశారు. బయటి వ్యక్తులు, విద్యార్థులెవరూ క్యాంపస్‌లోకి ప్రవేశించకుండా ప్రధాన ప్రవేశద్వారాలను మూసేశారు. మరోవైపు ఓయూకు వెళ్లేందుకు సిద్ధమైన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం, బీఎస్పీ చీఫ్ ప్రవీణ్‌కుమార్, ఇతర నాయకులు, ప్రజాసంఘాల నేతలను గృహనిర్బంధం చేశారు.

ఆర్ట్స్ కాలేజీ వద్ద మెరుపు దీక్ష..

పోలీసులు కట్టడి చేసినా ఐక్య విద్యార్థి సంఘాల నేతలు శుక్రవారం మధ్యాహ్నం ఆర్ట్స్ కాలేజీ వద్దకు చేరుకొని మెరుపు దీక్ష చేపట్టారు. మరోవైపు వారికి పోటీగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు అక్కడకు చేరుకొని రేవంత్ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగకుండా 50 మంది విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి పలు పీఎస్‌లకు తరలించారు. టీఎస్‌పీఎస్సీ విచారణ పారదర్శకంగా జరగాలంటే మంత్రివర్గం నుంచి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు.

ఓయూలో చర్చకు రావాలి: రేవంత్

'పోలీసులను పంపి నన్ను గృహనిర్బంధం చేయడం కాదు. కేసీఆర్, కేటీఆర్‌లకు దమ్ముంటే ప్రశ్నపత్రాల స్కాంపై ఓయూ విద్యార్థుల సమక్షంలో చర్చకు రావాలి. మీరు సచ్ఛీలురైతే... స్కాంలో మీ పాత్ర లేకపోతే... నా సవాల్‌ను స్వీకరించాలి' అని శుక్రవారం రేవంత్ ట్వీట్ చేశారు.

అనర్హతపై మంటలు!

- రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై వేటు వేయడాన్ని ఖండించిన రాష్ట్ర కాంగ్రెస్
- గాంధీభవన్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



గాంధీభవన్ వద్ద మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై వేటు వేయడం పట్ల రాష్ట్ర కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందునే రాహుల్‌ను ప్రధాని మోదీ టార్గెట్ చేశారని, రాజకీయ కుట్రతోనే వేటు వేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ రాజకీయ కక్ష సాధింపు చర్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని స్పష్టం చేసింది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దును నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీభవన్ వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఇదే సమయంలో టీపీసీసీ కిసాన్ సెల్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. మోదీ, అమిత్‌షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

దేశంలో నియంత పాలన: మాణిక్‌రావ్ ఠాక్రే

దేశంలో తీవ్ర నిర్బంధం, నియంత పాలన సాగుతున్నాయని.. రాహుల్‌పై చర్య ప్రజాస్వామ్య, పార్లమెంటరీ ప్రక్రియలకు చీకటి రోజు అని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర తర్వాత దేశ ప్రజల్లో రాహుల్‌గాంధీ పట్ల విశ్వాసం పెరుగుతోందన్నారు. రాహుల్‌ను చూసి మోదీ, బీజేపీ నేతలు భయపడుతున్నారని, అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి వాటికి కాంగ్రెస్ భయపడబోదని, తమకు ప్రజల సంపూర్ణ మద్దతు ఉందని.. న్యాయ, చట్టపరంగా కేంద్రంతో కొట్లాడుతామని చెప్పారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ..

రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు దుర్మార్గమని.. భారత్ జోడో యాత్ర తర్వాత రాహుల్‌పై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని టీపీసీసీ చీఫ్ రేవంత్ మండిపడ్డారు. ప్రధాని మోదీ నియంతలా, మధ్య యుగాల కాలపు నాటి రాజులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందన్నారు. రాహుల్‌పై అనర్హత వేటు ముమ్మాటికీ రాజకీయ కుట్ర అని.. ఇది దేశంలో ప్రజాస్వామ్య, పార్లమెంటరీ సాంప్రదాయానికి చీకటి రోజు అని సీనియర్ నేతలు జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, మధుయాష్కీగౌడ్, కోదండరెడ్డి, మల్లురవి, పొన్నం ప్రభాకర్ తదితరులు వ్యాఖ్యానించారు. రాహుల్‌పై ఆగమేఘాల మీద అనర్హత వేటు వేయడం దేశంలో ప్రతిపక్షాలు లేకుండా చేసే పన్నాగంలో భాగమేనని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తామన్నారు.



అక్కడ ఓటర్లను ఎలాగూ మార్చలేం... అందుకే మిమ్మల్ని మారుస్తున్నాం... కంగ్రాట్స్

మంచి చేస్తే ఆత్మహత్యలెందుకు?

సీఎంపై బండి సంజయ్ ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రైతుల పాలిట రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శనిలా తయారయ్యారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన ఫ్రీ యూరియా, రుణమాఫీ హామీలను ఇప్పటికీ అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణలో 8 ఏళ్లుగా రైతులకు నయా పైసా సాయం చేయని కేసీఆర్.. కేంద్రం పైసా ఇవ్వడం లేదని నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రైతులకు కేసీఆర్ మంచి చేస్తే వడ్ల కుప్పలపై రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారు? అని ప్రశ్నించారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై నిందలు మోపి తిట్టడం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్‌లకు అలవాటైపోయిందన్నారు.

పాత లెక్కలు అడుగుతుందనే భయం...

2016–17లో తెలంగాణలో నష్టపోయిన రైతులకు సాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం రూ.916 కోట్లు మంజూరు చేస్తే... అందులో రూ.700 కోట్లు కూడా ఖర్చు చేయకుండా గండి కొట్టి రైతులను మోసం చేసిన దుర్మార్గుడు కేసీఆర్ అని మండిపడ్డారు. ఇప్పుడు వడగండ్ల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకొనేందుకు సాయం అడిగితే, కేంద్రం పాత లెక్కలు అడుగుతుందన్న భయంతో సీఎం కేసీఆర్ కేంద్రానికి నివేదికలు పంపట్లేదని సంజయ్ ఆరోపించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఎస్డీఆర్‌ఎఫ్ నిధులతోనే రైతులకు సాయం చేస్తున్నట్లు చెప్పారని... మరి ఆ నిధుల్లో 75 శాతం వాటా కేంద్రానిదే అన్న మాట ఎందుకు చెప్పట్లేదు? అని నిలదీశారు.

మోదీతో పాటు బీసీలను అవమానించారు

కాగా మోదీ ఇంటిపేరున్న వాళ్లంతా దొంగలేనంటూ రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాకుండా మొత్తం ఓబీసీ సమాజాన్ని అవమానించారని సంజయ్ అన్నారు. తక్షణమే రాహుల్ ఓబీసీ సమాజానికి, నరేంద్రమోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఇందిరాగాంధీ నుంచి రాహుల్ గాంధీ వరకు న్యాయ వ్యవస్థను అగౌరవపరుస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు.

దురహంకారానికి నిదర్శనం

మంత్రులు గంగుల, శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ప్రశ్నించే గొంతుకలను అడ్డుకొని రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు.ఈడీ, సీబీఐ వంటి జేబు సంస్థల అండతో దురహంకారంగా ప్రవర్తిస్తూ దేశంలో ప్రతిపక్షాల గొంతునొక్కుతోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీపై మోదీ ప్రభుత్వం వేసిన అనర్హత వేటు వారి దురహంకారానికి నిదర్శనమని శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రులు పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తన గోతిని తనే తొవ్వుకుంటోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది చీకటి రోజు అని అన్నారు. ప్రజాస్వామ్య విలువల్ని కాలరాస్తూ, అధికారాన్ని అడ్డంపెట్టుకొని మోదీ ప్రభుత్వం నియంతృత్వ విధానాల్ని అవలంబిస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు.

సిట్ విచారణపై విశ్వాసం లేదు

- తాను హాజరుకాలేనంటూ సిట్‌కు బండి సంజయ్ లేఖ
- ఒక ఎంపీగా పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాల్సి ఉంది
- లీకేజీ కేసులో సిట్టింగ్ జడ్జి విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ఒక లోక్‌సభ సభ్యుడిగా పార్లమెంట్ సమావేశాలకు హాజరుకావాల్సి ఉందని.. అందువల్ల తాను టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో శుక్రవారం విచారణకు రాలేనని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సిట్‌కు లేఖ రాశారు. వాస్తవానికి తనకు సిట్ ఆఫీస్ నుంచి నేరుగా ఎలాంటి నోటీసులు అందలేదని, వాటిలో ఏముందో కూడా తనకు తెలియదని పేర్కొన్నారు. సిట్ నోటీసులు జారీ చేసినట్టు మీడియా వార్తల ద్వారా తన దృష్టికి రావడంతో లేఖ రూపంలో స్పందిస్తున్నట్టు వివరించారు. ''టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని సిట్ జరుపుతున్న విచారణపై మాకు నమ్మకం లేదని పేపర్ లీకేజీ స్కాం బయటపడిన నాటి నుంచీ చెప్తున్నాం. అధికార పీఠానికి దగ్గరగా ఉన్న వారి అండదండలు లేకుండా ఇలాంటివి జరిగే అవకాశం లేదని మేం నమ్ముతున్నాం. ఈ కేసులో హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మేం గట్టిగా నమ్ముతున్నందున.. సిట్ ఏర్పాటే సరైంది కాదని భావిస్తున్నాం. సిట్‌పై ఎలాంటి విశ్వాసం, నమ్మకం లేనప్పుడు పేపర్ లీకేజీకి సంబంధించి మా వద్ద ఉన్న సమాచారాన్ని పంచుకునే విషయమే ఉత్పన్నం కాదు. అందువల్ల నమ్మకమున్న విచారణ లేదా దర్యాప్తు సంస్థలకే సమాచారాన్ని చేరవేసే మా హక్కును ఉపయోగించుకోవాలని భావిస్తున్నాం..''అని సిట్‌కు రాసిన లేఖలో సంజయ్ పేర్కొన్నారు.

రావాలంటే.. హాజరవుతా..

ఈ అంశంలో తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని బండి సంజయ్ లేఖలో పేర్కొన్నారు. అయినప్పటికీ తాను సిట్ అధికారుల ఎదుట హాజరుకావాలని విచారణ సంస్థ భావిస్తే.. వచ్చేందుకు సుముఖంగానే ఉన్నానని పేర్కొన్నారు. అయితే పార్లమెంట్ సమావేశాల తేదీలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ తేదీని తెలియజేయాలని కోరారు.

క్లుప్తంగా...

రైతుల పాలిట వైఎస్సార్ వరమైతే కేసీఆర్ శాపం

10 వేల సాయం ఏ మూలకు?: షర్మిల



సాక్షి, హైదరాబాద్: రైతుల పాలిట మహానేత వైఎస్సార్ వరమైతే కేసీఆర్ శాపమయ్యారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పేర్కొన్నారు. తొమ్మిదేండ్లుగా జరిగిన పంట నష్టాన్ని కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికలు ఉంటేనే కేసీఆర్ గడీ దాటుతాడని మరోసారి రుజువైందనీ సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడే సరికి ఉన్నట్లుండి రైతులు గుర్తుకొచ్చారని దుయ్యబట్టారు. అదే వైఎస్సార్ ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రుణమాఫీ చేయడమే కాకుండా వర్షాలకు పంట నష్టపోతే పూర్తి స్థాయిలో పరిహారం అందించి రైతు బాంధవుడిగా నిలిచారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో పంట పరిహారం దేవుడెరుగు కనీసం పంట బీమాకు సైతం దిక్కు లేదని నిందించారు. పంట నష్టం కింద మీరిచ్చే రూ.10 వేలు రైతును నిలబెడతాయా..? ఎకరాకు రూ.50వేలు పెట్టుబడి పెట్టినం అని మీకే చెప్పిన రైతుకు మీరిచ్చే రూ.10 వేలు ఏ మూలకు సరిపోతాయని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. కనీసం ఇచ్చిన రూ.10 వేల హామీ అయినా నెరవేరుస్తావా? లేక వరద బాధితులను మోసం చేసినట్లు చేస్తావా అని నిలదీశారు.

భారతీయ వైమానిక దళంలో ఉద్యోగాలు

దరఖాస్తుకు మార్చి 31 చివరి తేదీ

సాక్షి, హైదరాబాద్: భారతీయ వైమానిక దళంలో అగ్నివీర్ వాయులు ఉద్యోగాల్లో చేరడానికి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 2002, డిసెంబర్ 26 నుంచి 2006, జూన్ 26 మధ్య జన్మించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులని పేర్కొంది. అభ్యర్థులు ఇంటర్మీడియట్/10+2/తత్సమానం ఉత్తీర్ణులై ఉండి, కేంద్రం/రాష్ట్రం ఆమోదించిన విద్యా బోర్డుల నుంచి ఏదైనా స్ట్రీమ్/సబ్జెక్ట్ పరీక్షల్లో కనీసం 50 శాతం మార్కులు, ఆంగ్లంలో 50 శాతం మార్కులు సాధించాలని తెలిపింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన మూడేళ్ల పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ డిప్లొమా కోర్సులు ఉత్తీర్ణులైన వారు, రెండేళ్ల ఒకేషనల్ కోర్సు రాష్ట్ర ఎడ్యుకేషన్ బోర్డులు/కౌన్సిల్‌లు గుర్తింపు పొందిన కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31 చివరి తేదీ అని పేర్కొంది. మరిన్ని వివరాలకు https:// agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

31 నుంచి గీతం పరీక్ష

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సహా విశాఖ, బెంగళూరు ప్రాంతాల్లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 2023–24లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 3 వరకూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (గాట్–2023) నిర్వహిస్తున్నట్టు గీతం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీఎస్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెట్ వివరాలను వెల్లడించారు. గీతం ప్రవేశ పరీక్ష రాయాలనుకునే వారు రూ.1200 చెల్లించి www.gta.gitam.edu వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెట్ పూర్తి వివరాల కోసం 9542424256, 8880884000 నెంబర్లకు కాల్ చేయవచ్చని, లేదా gat@gitam.edu మెయిల్ చేసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

పాలమూరులో సిట్ జల్లెడ

- ప్రశ్నపత్రాల లీక్‌లో 9 మంది నిందితులు ఇక్కడివారే
- రూ.7.50 లక్షలు పెట్టి ఏఈ పేపర్ కొన్నట్లు వెలుగులోకి..!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/నవాబుపేట: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తొలుత పట్టుబడిన తొమ్మిది మంది నిందితుల్లో ఆరుగురు ఉమ్మడి పాలమూరుకు చెందిన వారే ఉండడంతో సిట్ బృందం ఇక్కడ జల్లెడ పడుతోంది. నిందితుల విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా.. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని నవాబుపేటలో ఈజీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ప్రశాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించింది. ప్రశాంత్ ఇటీవల జరిగిన ఏఈ (సివిల్) పరీక్షతో పాటు గ్రూప్–1 ప్రిలిమ్స్ కూడా రాసినట్లు సమాచారం. ఏఈ పరీక్షకు సంబంధించి ఇతను అక్రమాలకు పాల్పడినట్లు సిట్ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. లీక్ అయిన పేపర్‌ను అతడు రూ.7.50 లక్షలు పెట్టి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆర్‌టీజీఎస్, ఫోన్‌పే, గూగుల్ పే తదితరాల ద్వారా ఇప్పటికే అదుపులో ఉన్న ఓ నిందితుడికి డబ్బులు పంపినట్లు గుర్తించారు.

ఏఈ పరీక్ష రాసిన మరో ముగ్గురు

పాలమూరు పరిధిలోని షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి, మరో ఇద్దరు కూడా ఏఈ పరీక్ష రాసినట్లు తెలిసింది. మొత్తం రూ.30 లక్షల వరకు చేతులు మారినట్లు తెలుస్తోంది. దీనిపై నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 11 గంటల వరకు విచారణ కొనసాగింది. ప్రశాంత్‌రెడ్డి ఇంకా ఎవరికైనా పేపర్‌ను విక్రయించాడా అనే కోణంలో సిట్ ఆరాతీస్తోంది.



2022లో గ్రామాల్లో 40% పెరిగిన వినియోగం

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలు కలిపి మహిళల ఇంటర్నెట్ వినియోగం 35 శాతం వృద్ధి
- దేశంలో 72 కోట్లకు చేరుకున్న యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య
- వారిలో గ్రామాల్లో 42.5 కోట్లు, పట్టణాల్లో 29.5 కోట్ల మంది నెట్ వాడకం
- నీల్సన్ 'ఇండియా ఇంటర్నెట్ రిపోర్ట్–2023'లో వెల్లడి

నెట్ ఇంట పల్లెలు

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ భారతంలో 'ఇంటర్నెట్' వేగంగా విస్తరిస్తోంది. 2022 సంవత్సరంలో దేశవ్యాప్తంగా గ్రామాల్లో 40 శాతం ఇంటర్నెట్ వినియోగం పెరిగినట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. దేశంలో ప్రస్తుతం 72 కోట్ల క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని తేల్చిన సర్వే... వారిలో గ్రామాల్లో 42.5 కోట్ల మంది, పట్టణాల్లో 29.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రముఖ పరిశోధన సంస్థ నీల్సన్ 'ఇండియా ఇంటర్నెట్ రిపోర్ట్–2023'ని విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 30 వేల మందిపై సర్వే చేపట్టి ఈ వివరాలు వెల్లడించింది. దేశవ్యాప్తంగా చూస్తే 12 ఏళ్లకు పైబడిన 45 కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు వీడియో కంటెంట్ల వీక్షణ, కాలింగ్‌లో నిమగ్నమవుతున్నట్లు అధ్యయనంలో స్పష్టమైంది. మొత్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి చూస్తే మహిళల ఇంటర్నెట్ వినియోగంలో 35 శాతం వృద్ధి నమోదైనట్లు నివేదిక తెలిపింది.

నివేదికలో ఏముందంటే...

- మహిళలు, గ్రామీణ భారతం, అల్పఆదాయవర్గాల ఇళ్లలో ఇంటర్నెట్ యూజర్లు వేగంగా పెరుగుతున్నారు. సగం గ్రామీణ భారతం ఆన్‌లైన్ సేవల వినియోగంలో 2021తో పోలిస్తే 2022లో నెట్ వాడకం 40 % పెరిగింది.
- అదే కాలానికి మహిళల నెట్ వినియోగం 35%, విద్య, ఆదాయపరంగా చివరగా ఉన్న వర్గాల్లో 30% పెరిగింది.
- స్మార్ట్‌ఫోన్ల ద్వారా సమాచారం, వీడియోల షేరింగ్ అధికంగా కొనసాగుతోంది.
- 2021తో పోలిస్తే 43% డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి
- ప్రాంతీయ భాషల ప్లాట్‌ఫామ్‌ల పెరుగుదలతో వీడియోల వీక్షణ పెరిగింది.
- షార్ట్ వీడియోలు, మ్యూజిక్‌ల వ్యాప్తిలో వృద్ధి నమోదైంది.
- మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో 90% రోజువారీ ఉపయోగిస్తున్నవారే.
- ప్రతి ముగ్గురిలో ఒకరు బ్యాంకింగ్, ఇతర చెల్లింపుల కోసం నెట్‌ను వాడుతున్నారు.
- గ్రామీణ భారతంలో 8.5 కోట్ల మంది షేరింగ్ ద్వారా ఇతరులతో కలిసి వీడియోలు వీక్షించడంతోపాటు ఆన్‌లైన్ క్లాసులకు హాజరవుతున్నారు.
- తక్కువ ధర హ్యాండ్‌సెట్ల ద్వారా అత్యధికంగా స్మార్ట్‌ఫోన్ షేరింగ్ అవుతోంది.
- కామ్‌స్కోర్ డేటా ప్రకారం యూట్యూబ్‌కు 46.3 కోట్ల మంది యునిక్ విజిటర్స్ ఉన్నారు.
- మెటా (ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్ కలిపి)కు 30 కోట్ల నుంచి 50 కోట్ల మంది యూజర్లు ఉండగా ఆయా యాప్‌ల వినియోగాన్ని బట్టి యూజర్లు పెరుగుతున్నారు.

తప్పిన 'ట్రూ అప్' షాక్!

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపు కూడా లేనట్టే
- 2023–24 వార్షిక రిటైల్ టారిఫ్ ఆర్డర్‌ను ప్రకటించిన ఈఆర్సీ



శ్రీరంగారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు భారీ ఉపశమనం లభించింది. రూ.12,718.4 కోట్ల ట్రూఅప్ చార్జీల భారం తప్పింది. ఇదే సమయంలో సాధారణ విద్యుత్ చార్జీల పెంపు కూడా ఉండబోదని స్పష్టమైంది. ట్రూఅప్ చార్జీల మొత్తంతోపాటు రూ.9,124.82 కోట్ల సబ్సిడీ సొమ్మును రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. దీనితో వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే 2023–24 ఆర్థిక ఏడాదిలో రాష్ట్రంలో ఎలాంటి విద్యుత్ చార్జీల పెంపు ఉండదని, ప్రస్తుత చార్జీలు (టారిఫ్) యథాతథంగా కొనసాగుతాయని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ ఈఆర్సీ) శుక్రవారం ప్రకటించింది.

ఐదేళ్లలో చెల్లిస్తామనడంతో..

2023–24లో ప్రస్తుత విద్యుత్ రిటైల్ సప్లై టారిఫ్‌ను యథాతథంగా కొనసాగించాలని.. గత కొన్నేళ్లకు సంబంధించి వినియోగదారుల నుంచి ట్రూఅప్ చార్జీలను వసూలు చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ డిస్కంలు ఇంతకుముందే ఈఆర్సీకి ప్రతిపాదనలు సమర్పించాయి. ఇలా వసూలు చేయాల్సిన చార్జీల మొత్తాన్ని రూ.12,718.4 కోట్లుగా ఈఆర్సీ తేల్చింది. ఈ మొత్తాన్ని విద్యుత్ వినియోగదారుల నుంచే వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని వచ్చే ఐదేళ్లలో వడ్డీతో కలిపి చెల్లించడానికి ముందుకు వచ్చింది. దీనితో విద్యుత్ చార్జీలను పెంచాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ మేరకు టీఎస్‌ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య శుక్రవారం తమ కార్యాలయంలో ఈ వివరాలను వెల్లడించారు.

ప్రార్థనా స్థలాలకు చార్జీల తగ్గింపు

డిస్కంల విజ్ఞప్తి మేరకు ఈఆర్సీ ప్రార్థన స్థలాలకు విద్యుత్ చార్జీలను యూనిట్‌కు రూ.5కి తగ్గించింది. ప్రస్తుతం ఎల్టీ–7(బీ) కేటగిరీలో 2 కిలోవాట్లలోపు లోడ్ కలిగిన ప్రార్థన స్థలాలకు యూనిట్‌కు రూ.6.4.. ఆపై లోడ్ కలిగిన ప్రార్థన స్థలాలకు యూనిట్‌కు రూ.7 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై అన్ని ప్రార్థన స్థలాలకు యూనిట్ రూ.5కి తగ్గనుంది. హెచ్‌టీ–2 (బీ) కేటగిరీలోని ప్రార్థన స్థలాలకు అదనంగా రూ.260 ఫిక్స్‌డ్ చార్జీలను వసూలు చేస్తారు.

సంప్రదింపులతో తప్పిన భారం!

ఏదైనా నిర్దిష్ట కాలానికి సంబంధించి విద్యుత్ కొనుగోళ్లు, పంపిణీ కోసం ఈఆర్సీ ఆమోదించిన అంచనా వ్యయం కంటే.. జరిగిన వాస్తవ వ్యయం ఎక్కువగా ఉన్నప్పుడు.. ఈ వ్యత్యాసాన్ని ట్రూఅప్ చార్జీల రూపంలో వసూలు చేస్తారు. 2016–17 నుంచి 2022–23 మధ్య కాలానికి సంబంధించి రూ.12,015 కోట్ల విద్యుత్ కొనుగోలు ట్రూఅప్ వ్యయం, 2006–07 నుంచి 2020–21 మధ్యకాలానికి రూ.4,092 కోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రూఅప్ వ్యయం కలిపి.. మొత్తం రూ.16,107 కోట్లను ట్రూఅప్ చార్జీలుగా వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ఇటీవల ఈఆర్సీకి విజ్ఞప్తి చేశాయి. ఈ లెక్కలపై పరిశీలన జరిపిన ఈఆర్సీ రూ.12,718.4 కోట్ల ట్రూఅప్ చార్జీలకు ఆమోదం తెలపగా.. ఈ మేరకు బిల్లుల్లో వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు కోరాయి. కానీ ఈఆర్సీ ఈ స్థాయిలో భారం వేస్తే వినియోగదారులు ఇబ్బందిపడతారంటూ సీఎం కార్యాలయంతో సంప్రదింపులు జరిపింది. దీంతో ఈ భారాన్ని భరించేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించడంతో వినియోగదారులకు ఉపశమనం లభించింది.

2023-24లో విద్యుత్ అవసరాలు, ఆదాయ వ్యయాల అంచనా

రాష్ట్ర మొత్తం విద్యుత్ అవసరం:	74,954.81 మిలియన్ యూనిట్లు
ఈ విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు:	రూ.37,401.64 కోట్లు
పంపిణీకి అయ్యే వ్యయం:	రూ.9,311.76 కోట్లు
పలు ఇతర ఖర్చులు కలిపి మొత్తం వ్యయం:	రూ.52,537.57 కోట్లు (అవసరమైన ఆదాయం)
ప్రస్తుత చార్జీలతో వచ్చే ఆదాయం:	రూ.43,221.96 కోట్లు
డిస్కంలకు ఆదాయ లోటు:	రూ.9,124.82 కోట్లు

(ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా భరించనుంది)

బీజేపీ మహాధర్నాకు హైకోర్టు అనుమతి

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులతో కలసి నేడు(శనివారం) ధర్నాచౌక్ వద్ద బీజేపీ నిర్వహించనున్న మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇస్తూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. 500 మంది కంటే ఎక్కువ మంది పాల్గొనరాదని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని ఆ పార్టీకి షరతులు విధించింది. షరతులను ఉల్లంఘిస్తే పోలీసులు చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధర్నా నిర్వహించుకోవచ్చని పేర్కొంది. ధర్నాలో పాల్గొనే కేంద్రమంత్రులు, బీజేపీ జాతీయ నేతల జాబితాను శుక్రవారంరాత్రి 9 గంటల వరకు పోలీసులకు అందజేయాలని పిటిషనర్‌ను కోర్టు ఆదేశించింది. ఆ మేరకు పోలీసులు భద్రతాఏర్పాట్లు చేయాలని సూచించింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు లీక్ వ్యవహారంలో ప్రభుత్వతీరును నిరసిస్తూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద నిరుద్యోగులతో కలసి మహాధర్నా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ధర్నాకు అనుమతి కోరుతూ పోలీసులకు బీజేపీ నేతలు దరఖాస్తు చేసినా ఎటూ తేల్చకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. 'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై రాజకీయ పార్టీలు నిరసనలు తెలపకూడదని లేదు కదా. ధర్నాచౌక్ ఉన్నది సమస్యలపై నిరసన నిర్వహించేందుకే.. ధర్నా చౌక్‌లో అనుమతి ఇవ్వకుంటే ప్రజలు ఎక్కడ ధర్నా చేసుకుంటారు? నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంది'అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

తెలంగాణకు ఎన్టీపీసీ వెలుగులు

తెలంగాణ ప్రాజెక్టులో 104.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి



జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుతో రాష్ట్రానికి వెలుగులు ప్రసరించబోతున్నాయి. 2X800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు శుక్రవారం తెల్లవారుజామున ఉత్పత్తి దశలోకి చేరుకుంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు ఎన్టీపీసీ 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున తెలంగాణ ప్రాజెక్టులోని స్టేజీ–1లో 800 మెగావాట్ల మొదటి యూనిట్ ఉత్పత్తి దశలోకి వచ్చింది. మొదటి రోజున 800 మెగావాట్ల యూనిట్ కేవలం 104.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించింది.

వైద్య విద్యావిభాగంలో 8 కొత్త కొలువులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యావిభాగంలో కొత్తగా ఎనిమిది పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విద్యాసంచాలకులు (డీఎంఈ), వైద్య విద్యాసంచాలకులు(డీఎంఈ) అకడమిక్ పోస్టులను మంజూరు చేసింది. వాటికి పేస్కేల్ రూ.1.49 లక్షల నుంచి రూ. 2.24 లక్షలుగా నిర్ణయించింది. రెండు అదనపు డీఎంఈ పోస్టులు మంజూరు చేసింది. అందులో ఒకటి సాధారణం కాగా, మరోటి పరిపాలనకు కేటాయించింది. జాయింట్ డైరెక్టర్(పరిపాలన), జాయింట్ డైరెక్టర్(మెడికల్), డిప్యూటీ డైరెక్టర్(నర్సింగ్), అసిస్టెంట్ డైరెక్టర్(నర్సింగ్) పోస్టులను మంజూరు చేసింది. వీటి పేస్కేళ్లను కూడా నిర్ణయించింది. ఆయాపోస్టులను సర్వీసు నిబంధనల ప్రకారం నింపాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్ల తర్వాత వైద్య విద్యావిభాగానికి సంచాలకులు, అడిషనల్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ పోస్టులు మంజూరు చేయడం గమనార్హం. ప్రస్తుతం ఆ పోస్టుల్లో ఇన్‌చార్జీలు కొనసాగుతున్నారు. కొత్తగా పోస్టులు మంజూరు చేయడంవల్ల సీనియారిటీ, అర్హత ఆధారంగా వాటిని భర్తీ చేస్తారు. ఈ పోస్టులతో పరిపాలన సులభతరం అవుతుంది. కొత్తగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలు స్థాపిస్తున్న నేపథ్యంలో ఈ ఉత్తర్వులు రావటం శుభసూచకమని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొత్త పోస్టులు మంజూరు చేయడంపట్ల తెలంగాణ టీచింగ్ వైద్యుల సంఘం అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ అన్వర్, డాక్టర్ జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాదల హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయం వల్ల మారుమూల ప్రాంతాల్లో స్పెషాలిటీ వైద్యసేవలు చేరువవుతాయని వారు అభిప్రాయపడ్డారు.

'టీఎస్‌పీఎస్సీ కేసు'లో సాక్షిగా శంకరలక్ష్మి

- రిమాండ్ రిపోర్ట్‌లో పొందుపరిచిన పోలీసులు
- నిందితుల అదనపు కస్టడీ కోరుతూ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ కేసులో కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కస్టోడియన్ బి.శంకరలక్ష్మి కీలక సాక్షిగా మారారు. తొలుత అరెస్టు చేసిన తొమ్మిది మందిలో ప్రవీణ్, రాజశేఖర్, రేణుక, డాక్యాల అదనపు కస్టడీతోపాటు తాజాగా అరెస్టు చేసిన షమీమ్, సురేశ్,రమేశ్‌లను తమ కస్టడీకి అప్పగించాలంటూ సిట్ అధికారులు శుక్రవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా వ్యవహరించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పులిదిండి ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డి ఐదు పరీక్షలకు సంబంధించిన 11 ప్రశ్నపత్రాలను కాన్ఫిడెన్షియల్ సెక్షన్ కస్టోడియన్ అయిన శంకరలక్ష్మి కంప్యూటర్ నుంచే తస్కరించారు. ఈ వ్యవహారంలో ఆమె నిర్లక్ష్యం ఉందని అధికారులు ఇప్పటికే తేల్చడంతో చర్యలు కూడా తీసుకుంటారని ప్రచారం జరిగింది. అయితే ఆమెను ఈ కేసులో రెండో సాక్షిగా పరిగణిస్తున్నట్లు కోర్టు దృష్టికి సిట్ తీసుకువెళ్లింది. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తూ దాఖలు చేసిన రిమాండ్ కేస్ డైరీలో ఈ విషయాలు పొందుపరిచింది. ఈ కేసులో వివరాలు సేకరించి దర్యాప్తు పూర్తి చేయడంతోపాటు అభియోగపత్రాలు దాఖలు చేయడానికి నిందితుల కస్టడీ అవసరమని పేర్కొంది.

రాజశేఖర్ బంధువుకు నోటీసులు!

న్యూజిలాండ్‌లో నివసిస్తూ గతేడాది గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు హైదరాబాద్ వచ్చి వెళ్లిన కమిషన్ నెట్‌వర్క్ అడ్మిన్ రాజశేఖర్‌రెడ్డి సమీప బంధువు ప్రశాంత్‌ను ప్రశ్నించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం అతనికి వాట్సాప్ ద్వారా నోటీసులు పంపిస్తున్నారు. అతడు విచారణకు రాకుంటే లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ చేయనున్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష లీకేజీ కేసులో 100 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన 121 మందిలో శుక్రవారం నాటికి 40 మంది విచారణ పూర్తయింది. ఏఈ పరీక్ష ప్రశ్న పత్రం విషయంలోనే క్రయవిక్రయాలు జరిగాయని, గ్రూప్– 1లో ఇలాంటివి జరిగినట్లు ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని సిట్ అధికారులు చెబుతున్నారు.

బండి సంజయ్ గైర్హాజరు...

పరీక్ష పత్రాల లీకేజీ కేసుల్లో ఆరోపణలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అందుకుతగ్గ ఆధారాలను శుక్రవారం తమ కార్యాలయానికి వచ్చి సమర్పించాలంటూ సిట్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ బండి సంజయ్ హాజరుకాలేదు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి సైతం సిట్ నోటీసులు ఇవ్వగా ఆయన గురువారం సిట్ కార్యాలయానికి హాజరైన సంగతి తెలిసిందే.

టీఎస్‌పీఎస్సీ ఘటనపై | సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేస్తాం

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- 27న జిల్లా కేంద్రాల్లో నిరసనలు



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ ఘటనపై ఢిల్లీకి వెళ్లి సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కేసు విచారణను సిట్‌కు బదిలీ చేయడం వెనుక ప్రభుత్వ పెద్దల గూడుపుఠాణీ ఉందని, కేసును నీరుగార్చేందుకే సిట్‌కు అప్పగించారని ఆరోపించారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ ఘటనలో పెద్దల పాత్రను కప్పిపుచ్చుకునేందుకే తమను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తనను గృహ నిర్బంధం చేయడం ఆటవిక చర్య అని మండిపడ్డారు. అనర్హులను టీఎస్‌పీఎస్సీ సభ్యులుగా నియమించారని, దీనిపై హైకోర్టు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసి కౌంటర్ దాఖలు చేయాలని సూచించినా ప్రభుత్వం దాఖలు చేయకుండా వాయిదాలు కోరిందన్నారు. అనర్హులను అందలం ఎక్కించడం వల్లనే ఈ అనర్థం జరిగిందని చెప్పారు. లీకేజీ కేసులో మొదట విచారించాల్సింది సెక్షన్ ఆఫీసర్ శంకరలక్ష్మినని, ఏ1 ప్రవీణ్‌కుమార్‌పై ఏసీబీ సెక్షన్ల కింద కేసు పెట్టి ఉంటే విచారణ త్వరగా జరిగేదని, ప్రభుత్వం వ్యూహాత్మకంగానే ఆ పని చేయలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులను కూడా సిట్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. లీకేజీలో మంత్రి కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధం ఉందన్నది తమ నిర్దుష్ట ఆరోపణ అని, దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో పెద్ద తలల్ని సిట్ విచారిస్తేనే నిజాలు బయటకు వస్తాయన్నారు.

పాదయాత్ర ఏప్రిల్ 6 వరకు వాయిదా

టీఎస్‌పీఎస్సీ లీకేజీ ఘటనపై న్యాయం కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున తన పాదయాత్రను ఏప్రిల్ ఆరో తేదీ వరకు వాయిదా వేస్తున్నట్టు రేవంత్ వెల్లడించారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా, 24, 25 తేదీల్లో నిరసన తెలపాలని అనుకున్నా ప్రభుత్వం నియంతృత్వ పోకడతో తమను నిర్బంధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే టీఎస్‌పీఎస్సీ లీకేజీ ఘటనపై ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఏప్రిల్1 నుంచి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వెళ్లి విద్యార్థులను కలుస్తామని, ఏప్రిల్ రెండో వారంలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని రేవంత్ వెల్లడించారు.

> ఏ ప్రాణినీ ద్వేషించనివాడు, అహంకార మమకారాలు లేనివాడు, సుఖదుఃఖాలలో సమంగా వ్యవహరించేవాడు, క్షమాగుణం కలవాడు, నాకు ప్రియుడు.
> – భగవద్గీత

సాక్షి

శనివారం, మార్చి, 25

అనర్హత వేటు లేవనెత్తిన ప్రశ్నలు

చట్టం వేరు...ధర్మం వేరు. చట్టబద్ధమైన చర్యలన్నీ ధర్మబద్ధం కాకపోవచ్చు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడటానికి దారితీసిన సూరత్ కోర్టు తీర్పు, అంతక్రితం రెండు వారాలుగా అధికార, విపక్షాలు సాగిస్తున్న ఆందోళనల పర్యవసానంగా పార్లమెంటు స్తంభించి పోవటం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య ప్రియులను కలవరపరుస్తాయి. పౌరులు ఎలా మెలగాలో, పాటించాల్సిన స్వీయ నియంత్రణలేమిటో చట్టాలు చెబుతాయి. అధికారానికుండే పరిమితులేమిటో కూడా తేటతెల్లం చేస్తాయి. కానీ వాటి ఆచరణ సక్రమంగా లేని చోట ఆ చట్టాలు కొందరికి చుట్టాలవుతాయి. మరికొందరికి అవరోధాలవుతాయి. కర్ణాటకలోని కోలార్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాట్లాడిన రాహుల్ అవినీతికి, అక్రమాలకు పాల్పడి విదేశాలకు పరారైన నీరవ్ మోదీ, లలిత్ మోదీల పేర్లకు ప్రధాని నరేంద్ర మోదీ పేరు జత చేసి 'దొంగలందరి ఇంటిపేరు మోదీ అని ఎందుకుంటుంది?' అంటూ వ్యంగ్య వ్యాఖ్య చేశారు. రాహుల్ వ్యాఖ్య ఆ ఇంటి పేరుగల సామాజిక వర్గానికి ఇబ్బందికరంగా మారిందంటూ గుజరాత్ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్‌పై కోర్టు తీర్పునిచ్చింది. రాహుల్ వ్యాఖ్యతో చాలామందికి ఏకీభావం లేకపోవచ్చు. ప్రత్యర్థులనుసరించే విధానాలను విమర్శించటంకాక వారిపై దూషణలకు దిగటం చాన్నాళ్లుగా రివాజుగా మారింది. ఇక భౌతికంగా నిర్మూలిస్తామని బెదిరింపులకు దిగటం, దౌర్జన్యాలకు పూనుకోవటం వంటివి చెప్పనవసరమే లేదు. అయితే ఈ ధోరణులను వ్యతిరేకించేవారు సైతం రాహుల్‌కు విధించిన రెండేళ్ల జైలు శిక్షను, దాని ఆధారంగా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయటం సమర్థించలేకపోతున్నారు. గతంలో రాఫెల్ ఒప్పందంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినప్పుడు రాహుల్ 'చౌకీదార్ చోర్ హై' అని వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్నారు. ప్రధానినుద్దేశించి వ్యాఖ్య చేయబోయి సుప్రీంకోర్టును తప్పుబట్టేలా మాట్లాడటంతో సమస్య ఏర్పడింది. ఆ కేసులో రాహుల్ బేషరతు క్షమాపణ చెప్పడాన్ని అంగీకరించి సర్వోన్నత న్యాయస్థానం 2019లో కేసు మూసివేసింది. అయితే రాహుల్ వంటి నేతలు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికింది. సూరత్ కోర్టు దాన్నే గుర్తుచేసింది.

ఈ తీర్పుపైనా, అనర్హత వేటుపైనా ఎటూ కాంగ్రెస్ అప్పీల్‌కి వెళ్తుంది. అక్కడ ఏమవుతుందన్న సంగతి అటుంచి, సూరత్ కోర్టు తీర్పు లేవనెత్తిన అంశాలు ప్రధానమైనవి. పరువు నష్టం కలిగించటాన్ని నేరపూరిత చర్యగా పరిగణించి గరిష్ఠంగా రెండేళ్ల జైలు, జరిమానాకు వీలుకల్పించే భారత శిక్షాస్మృతి(ఐపీసీ)లోని 499, 500 సెక్షన్ల సహేతుకతపై ఎప్పటినుంచో అభ్యంతరాలున్నాయి. ఒకపక్క పరువునష్టంలో సివిల్ దావాకు వీలున్నప్పుడు జైలుశిక్ష, జరిమానాలెందుకని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. బ్రిటిష్ వలస పాలన కాలంలో చేసిన ఈ చట్టం ఇప్పుడు బ్రిటన్‌లోనూ, ఇతర పాశ్చాత్య దేశాల్లోనూ ఉనికిలో లేదు. ఇది దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉన్నది గనుక, భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగిస్తుంది గనుక రద్దు చేయాలని గతంలో సుప్రీంకోర్టుకెక్కిన వారున్నారు. అయితే పేరుప్రతిష్ఠలు కలిగివుండే హక్కు జీవించే హక్కులో భాగమని, దానికి భంగం కలిగించినవారు తగిన శిక్ష అనుభవించక తప్పదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అదే సందర్భంలో ఈ అంశంలో తీర్పులు వెలువరించేటపుడు జాగురూకత వహించాలని కింది కోర్టులకు సలహా ఇచ్చింది. అయితే ఈ సలహాను కింది కోర్టులు పాటిస్తున్నాయా అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక రచనపై వచ్చిన విమర్శను తట్టుకోలేకనో, ఒక నాటకాన్నీ లేదా సినిమాను అడ్డుకోవటానికో ఈ సెక్షన్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. తమిళనాడులో జయలలిత పాలనాకాలంలో ఆమె పార్టీకి చెందిన కార్యకర్తలు వందల సంఖ్యలో పరువునష్టం దావాలు వేసిన సంగతి ఎవరూ మరువలేరు. కోర్టులు సైతం యాంత్రికంగా వ్యవహరిస్తున్నాయి. అందుకే సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు కింది కోర్టులను తప్పుబట్టవలసి వచ్చింది.

నీరవ్ మోదీ, లలిత్ మోదీ తదితరులకు ప్రభుత్వ ప్రాపకం లభించిందని ఆరోపిస్తే రాహుల్‌కు బహుశా ఈ కేసు బెడద ఉండేదికాదు. తగిన ఆధారాలతో అటువంటి విమర్శలు చేస్తే దానివల్ల ప్రజలకు ఏదో మేరకు ప్రయోజనం కూడా కలుగుతుంది. రాహుల్ తన వ్యాఖ్యలద్వారా ఒక వెనుకబడిన వర్గాన్ని కించపరిచారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇలా రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగా ఎదుర్కొనటం తప్పేమీ కాదు. అందుకు భిన్నంగా న్యాయస్థానాలను ఆశ్రయించటం ఎంతవరకూ సబబో, చట్టానికి అనుగుణంగానే అయినా ఆదరాబాదరాగా అనర్హత వేటువంటి నిర్ణయాలు తీసుకోవటం ఏమేరకు ధర్మమో ఆలోచించుకోవాలి. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, ఆజంఖాన్ తదితరుల కేసుల్లో వెనువెంటనే చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. అయితే ఈ ప్రక్రియ సందేహాస్పదం కారాదు. మెజారిటీ ఉంది కదా అని కక్షపూరితంగా చేశారన్న అపఖ్యాతి తెచ్చుకోకూడదు. దేశద్రోహులను కాల్చిపారేయాలని పిలుపునిచ్చిన వారు నిక్షేపంలా కేంద్రమంత్రులుగా కొనసాగుతుంటే విపక్ష నేత నోరుజారటం మాత్రం మహాపరాధం కావటం సాధారణ పౌరులకు కొరుకుడుపడని అంశం. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రధాన లక్ష్యం రాహులేనని పార్లమెంటులోని పరిణామాలైనా, తాజా చర్య అయినా తేటతెల్లం చేస్తున్నాయి. రాజకీయ పక్షాలూ, వాటి వ్యూహాల మాటెలా వున్నా దేశంలో చట్టబద్ధ పాలనకూ, సమన్యాయానికీ విఘాతం కలగనీయకుండా చూడాలని సాధారణ పౌరులు కోరుకోవటం అత్యాశేమీ కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.చవితి రా.7.07 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: భరణి ప.3.56 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: తె.4.14 నుండి 5.54 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.04 నుండి 7.41 వరకు, అమృతఘడియలు: ఉ.11.05 నుండి 12.42 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బ్యాంకింగ్ సంక్షోభం నేర్పే పాఠాలు

విశ్లేషణ



మదన్ సబ్నవీస్

ప్రధానంగా అమెరికా కేంద్రంగా పనిచేసే కొన్ని బ్యాంకుల సంక్షోభం పత్రికల పతాక శీర్షికలకు ఎక్కింది. దీంతో జరగాల్సిన నష్టమంతా జరిగిపోయిందా? ఇలా కుప్పకూలిపోయే బ్యాంకులు మరిన్ని ఉన్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. ఆ బ్యాంకుల సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు దేనికవే వేర్వేరు కావడం గమనార్హం. ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో తగినన్ని ఏర్పాట్లు ఉన్నా రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ ప్రాక్టీసుల విషయంలో సమీక్ష జరగాల్సిన అవసరం ఉంది. కేవలం పెట్టుబడులపై మాత్రమే కాకుండా, అప్పులపై కూడా దృష్టి పెట్టాలన్నది ఈ సంక్షోభం చెబుతున్న ఒక పాఠం. పెట్టుబడుల జాబితా మరీ కొండవీటి చాంతాడంత ఉండటమూ సరికాదన్నది మరో పాఠం.

సిల్వర్‌గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్, క్రెడిట్ స్విస్... ఇటీవలి కాలంలో పత్రికల పతాక శీర్షికలకు ఎక్కిన బ్యాంకుల పేర్లు. భారత్‌లో క్రెడిట్ స్విస్ గురించి చాలామందికి తెలుసు కానీ... మిగిలిన మూడింటితో పరిచయం అంతంత మాత్రమే. ఎందుకంటే ఇవి ప్రధానంగా అమెరికాలో పనిచేసే బ్యాంకులు. అయినాసరే, వీటి గురించి బోలెడన్ని కథనాలు వరుసగా వస్తూండటం కొంత అసౌకర్యంగా అనిపించే విషయమే.

ఇప్పుడు తలెత్తిన ప్రశ్న ఏమిటంటే, మన బ్యాంకింగ వ్యవస్థ ఎంత సురక్షితం? అన్నది. అమెరికాకు చెందిన లేహ్‌మన్ బ్రదర్స్ దివాళా సంక్షోభం తరువాత 'బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్' మూలధనానికి సంబంధించిన విధానాలను మరింత కఠినం చేసింది. బేసెల్ కమిటీ మార్గదర్శకాలు ఇందుకు కారణమయ్యాయి. అయినా ప్రస్తుత సంక్షోభాన్ని అది నివారించలేక పోయింది. ఇప్పుడు ఇంకో ప్రశ్న తలెత్తుతోంది. జరగాల్సిన నష్టమంతా జరిగిపోయిందా? లేక ఇలా కుప్పకూలిపోయే బ్యాంకులు మరిన్ని ఉన్నాయా? అయితే, ఈ బ్యాంకుల మూసివేతకు దారితీసిన పరిస్థితులు దేనికవే వేర్వేరు కావడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

దేని కారణాలు దానివే!

ఈ మూడు బ్యాంకుల మూసివేతకూ, భారతీయ బ్యాంకులకూ నేరుగా సంబంధం లేకపోవచ్చు. సిల్వర్‌గేట్ బ్యాంకు క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లో ఉంది. ఇప్పుడు క్రిప్టో కరెన్సీకి అంత ఆదరణ లేదు. ఇంకొన్నేళ్లు పోతే అసలు క్రిప్టో అన్న పదం కూడా వినిపించకపోవచ్చు. అదంత సుస్థిరమైంది కాదని ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది.

సిలికాన్ వ్యాలీ బ్యాంకు కేవలం స్టార్టప్‌లపైనే ఎక్కువగా కేంద్రీకరించింది. అందిన డిపాజిట్లు అత్యధికం స్టార్టప్‌ల నుంచి వచ్చినవే. కొంతమేరకు అప్పులూ ఇచ్చారు కానీ ఎక్కువ మొత్తం ప్రభుత్వాలకు అప్పు ఇచ్చింది. (మన బ్యాంకుల మాదిరిగానే ప్రభుత్వ బాండ్లు, ట్రెజరీ బిల్లుల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టారన్నమాట.)

ఇక సిగ్నేచర్ బ్యాంకు గురించి: ఇది అటు క్రిప్టో, ఇటు స్టార్టప్‌లు రెండు రంగాల్లోనూ పనిచేస్తోంది. ప్రస్తుతం దీన్ని ఆదుకునేందుకు న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాన్‌కార్ప్ ఒక ప్రయత్నం చేస్తోంది.

చివరగా క్రెడిట్ స్విస్: ఇది స్విట్జర్లాండ్ బ్యాంక్. ఎవరికి రుణాలిచ్చారన్న విషయంలో ఈ బ్యాంకు కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే రకరకాల వ్యాపార వ్యవహారాల కారణంగా నష్టాలు ఎదుర్కొంది. ఆ దేశ కేంద్ర బ్యాంకు దీనికి బెయిల్ అవుట్ ఇస్తోంది. అలాగే యూబీఎస్ దీన్ని స్వాధీనం చేసుకుని కష్టాల నుంచి బయట పడేసే ప్రయత్నం చేస్తోంది. ఈ నాలుగు ఘటనలు వేటికవే ప్రత్యేకం కానీ చరిత్ర పుటల్లో నిలిచిపోయేవి.



లేహ్‌మన్ బ్రదర్స్ సంక్షోభం కంటే ప్రస్తుత సంక్షోభం భిన్నమైంది. ఎలాగంటే... ఇప్పుడు అన్ని నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగాయి. ఆర్‌బీఐ కూడా భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందన్న భరోసా ఇచ్చింది. యూరప్‌లోనూ కేంద్ర బ్యాంకులు క్రెడిట్ స్విస్ సంక్షోభం ప్రభావాన్ని మదిస్తున్నాయి. మరి ఈ సంక్షోభం ప్రభావం భారత్‌పై ఏమిటి? మనం నేర్చుకోవాల్సిన గుణపాఠాలేమిటి?

అప్పుల గురించి కూడా యోచించాలి...

సిలికాన్ వ్యాలీ బ్యాంక్ కుప్పకూలిపోవడం నేర్పించే **మొదటి పాఠం...** కేవలం పెట్టుబడులపై మాత్రమే కాకుండా, అప్పులపై కూడా దృష్టి పెట్టాలని! రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ముప్పు ఒక్క దగ్గర పోగు పడకుండా చూడటం వీటి ఉద్దేశం. అయితే డిపాజిట్లు పోగుపడటం వల్ల కూడా ముప్పు ఉంటుందన్నది వినూత్నమైన విషయం. డిపాజిట్లు ఎక్కువగా స్టార్టప్‌ల నుంచి రావడం వల్ల సంక్షోభం మరింత ముదిరింది. ఎందుకంటే డిపాజిట్లు చేసిన వారందరూ అకస్మాత్తుగా వాటిని ఉపసంహరించుకునే ప్రయత్నం చేశారు. భారతీయ బ్యాంకులు ఈ విషయమై ఆలోచన చేయాలి. చిన్న బ్యాంకులు మరీ ముఖ్యంగా.

ఇక రెండో గుణపాఠం: పెట్టుబడుల జాబితా మరీ కొండవీటి చాంతాడంత ఉండటమూ సరికాదని చెబుతోంది. యూఎస్ ట్రెజరీ బాండ్లు కలిగి ఉండటం వాస్తవానికి చాలా సురక్షితం. కానీ వడ్డీ రేట్లు పెరిగిపోవడం వల్ల ఈ పెట్టుబడుల విలువల్లో తేడాలొస్తాయి. ఈ విషయాన్ని బ్యాంకులు గుర్తించాలి. రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ ప్రాక్టీసెస్‌లను సమీక్షించుకోవాలి.

ముచ్చటగా మూడో పాఠం: వాణిజ్య బ్యాంకింగ్‌లో నైపుణ్యం సాధించాలని బ్యాంకులకు తరచూ చెబుతూంటారు. ఇతర కార్యకలాపాలను అనుబంధ కంపెనీల ద్వారా నడపాలనీ, వాటి మూలధన నిర్మాణం కూడా వేరుగా ఉండాలనీ అంటారు. క్రెడిట్ స్విస్ విషయంలో ఈ రెండు లోపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో వచ్చిన నష్టాలు, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగపు నిధులను విత్‌డ్రా చేయడం కాస్తా వాణిజ్య బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్‌పై ప్రభావం చూపింది.

భారత్‌లో ఈ బలహీనతను చాలాకాలం కిందటే గుర్తించారు. అందుకే ఇన్వెస్ట్‌మెంట్, మర్చెంట్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితరాలను అనుబంధ సంస్థల ద్వారా నడుపుతున్నారు. దీనివల్ల ముప్పు కొంచెం తక్కువవుతుంది.

క్రిప్టో కరెన్సీని ఎలాగూ భారత్ గుర్తించలేదు. కాబట్టి రెండు బ్యాంకులు కుప్పకూలడం తాలూకూ ప్రభావం మనపై ఉండదు. వాస్తవానికి తాజా సంక్షోభం తరువాత ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో కరెన్సీ వ్యవహారాలను బ్యాంకింగ్‌కు దూరంగా ఉంచాలన్న అభిప్రాయం బలపడటం గుర్తించాలి.

ప్రత్యక్ష ప్రభావం లేదు

అమెరికన్ బ్యాంకులు, క్రెడిట్ స్విస్ సంక్షోభం తాలూకూ ప్రత్యక్ష ప్రభావం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థపై ఏమీ కనపడటం లేదు. కాకపోతే ఒక్కసారి పరిస్థితిని సమీక్షించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. బ్యాలెన్స్ షీట్లను ఒక్కసారి పరిశీలించుకుని డిపాజిట్లు, అప్పులు ఎలా విభజితమై ఉన్నాయో చూసుకోవడం మేలు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా రిస్క్ టీమ్స్‌తో కలిసి పెట్టుబడుల తీరుతెన్నులను మదింపు చేయాలి. అంతేకాకుండా... డెట్(రుణ) సర్వీస్ కవరేజి నిష్పత్తికి సంబంధించి ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా? అన్నది పరిశీలించాలి. ఇది నిరంతర ప్రక్రియలా సాగాలి.

ఆర్‌బీఐ కూడా డిపాజిట్లపై ప్రస్తుతం జారీ చేస్తున్న ఇన్సూరెన్స్‌ను సమీక్షించాల్సిన అవసరముంది. ప్రస్తుతం డిపాజిట్లపై ఉన్న ఐదు లక్షల గరిష్ఠ ఇన్సూరెన్స్ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచాలి. ముప్పు తీవ్రత ఆధారంగా బ్యాంకులను వర్గీకరించే అంశాన్నీ పరిశీలించాలి.

అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న అంశంపై త్వరలోనే చర్చ మొదలు కావచ్చు. 'బేసిల్–4' (సంస్కరణల కోసం) వంటివి ఏర్పడే అవకాశమూ లేకపోలేదు. ఇది బ్యాంకులకు అవసరమైన మూలధనం మరింత పెరిగేందుకు దారితీసే అవకాశముంది. అంతేకాకుండా... మార్కెట్, క్రెడిట్ రిస్క్‌లను అంచనా వేసేందుకు మరిన్ని పరీక్షల్లాంటివి చేయాల్సిన అవసరం ఏర్పడవచ్చు.

వ్యాసకర్త బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్
('ద బిజినెస్ లైన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బలోపేతం చేస్తున్నారు



రాహుల్ గాంధీ కూడా కలలు కనన్ని రకాలుగా ఈ ప్రభుత్వం ఆయన్ని బలోపేతం చేయడానికి దారులు వెతుకుతోంది.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

వద్దంటే వద్దు



నియంత మెక్రాన్‌ను తొలగించాలని కోరుతూ ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో లక్షల మంది పోగయ్యారు. 'వరల్డ్‌ఎకనామిక్ ఫోరమ్' నిరంకుశత్వంతో ప్రజలు విసిగిపోయారు.

– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు

అన్నది వేరు!



నీరవ్ మోదీ, లలిత్ మోదీ, మేహుల్ చోక్సీలను రాహుల్ గాంధీ దొంగలు అన్నారు. అందరు దొంగలకు మోదీ అనే పేరు ఎందుకుంది అని ప్రశ్నించారు. అందరు మోదీలు దొంగలు అని ఆయన అనలేదు. అయినప్పటికీ ఎవరో మోదీ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందన్న ఫిర్యాదు మీద ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఆ కారణంగా ఆయన్ని ఎన్నికల్లో పాల్గొనకుండా చేయవచ్చనే కదా? ఇదీ భారత ప్రజాస్వామ్య పరిస్థితి!

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

పేడ పాఠం



ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ క్షేత్రాలను జప్తు చేయడానికి నెదర్లాండ్స్ ప్రభుత్వం ప్రయత్నించింది. దీనికి ప్రతిగా డచ్ రైతులు ప్రభుత్వ భవనాలు, పోలీసుల మీద పేడను పిచికారీ చేశారు. మనం డచ్‌వాళ్ల నుంచి నేర్చుకోవచ్చు.

– స్టూ పీటర్స్, టీవీ హోస్ట్

ఓబీసీలను అవమానించారు!



రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని అవమానించినంత మాత్రాన మనం గాంధీ ఇంటిపేర్లున్న అందరినీ నిందించలేం. రాహుల్ గాంధీ ఓబీసీ సమాజం మీద అవమానకర వ్యాఖ్యలు చేసి వాళ్లను అగౌరవపరిచారు. కానీ కొందరు కాంగ్రెస్ నాయకులు దీన్ని సమర్థించుకోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

– కిరణ్ రిజిజు, కేంద్ర న్యాయశాఖ మంత్రి

కొంతైనా పేరొస్తుంది



ఒక విన్నపం: తర్వాతెప్పుడైనా మీరు మీకు నచ్చిన పుస్తకం గురించి ప్రస్తావించినప్పుడు, ఒకవేళ అది ఏ పుస్తకాల దుకాణంలోనో కొనివుంటే అది కూడా పేర్కొనండి. అది మాలాంటి పుస్తకాల షాపులకు ఎంతో మేలు చేస్తుంది. మీ ప్రస్తావన మమ్మల్ని సంతోషంతో చిన్న డ్యాన్స్ చేసేట్లు కూడా చేయొచ్చు.

– లియొనార్డ్ ఫెర్నాండెజ్, గోవా పుస్తకాల దుకాణదారు

అందుకే గొప్ప



నాకు వరుసకు అమ్మమ్మయ్యే (రచయిత్రి) మహాశ్వేతాదేవి బతికి ఉన్నప్పుడు ఆమె దగ్గరకు ఎప్పుడు వెళ్లినా, మూడు రైటింగ్ ప్యాడ్స్ మీద వరుసగా రాస్తూవుండేది. బహుశా ఒకటి నవల, మిగిలిన రెండు కథలు లేదా వ్యాసాలు. మళ్లీ ఆ మూడింటిలోనూ ఆమె అప్రయత్నంగా రాస్తున్నట్టు అనిపించేది.

– నీలాంజనా భౌమిక్, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

రంగినేని ఎల్లమ్మ పురస్కారం

2022 సంవత్సరపు 'రంగినేని ఎల్లమ్మ పురస్కారా'న్ని రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు 'ఉడుకు బెల్లం' కథా సంపుటి గెలుచుకుంది. రంగినేని మోహన్ రావు అధ్యక్షులుగా ఉన్న రంగినేని చారిటబుల్ ట్రస్ట్ కొన్నేళ్లుగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తోంది.

సిరిసిల్ల కరీంనగర్ రోడ్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో జరిగే వేడుకకు ముఖ్య అతిథి... ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత డా॥ ఎన్. గోపి. కవి, రచయిత జూకంటి జగన్నాథం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్రసాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్, ఉస్మానియా యూనివర్సిటీ సహాయ ఆచార్యులు ఎస్. రఘు, కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ వంటి ప్రముఖులు పాల్గొంటారు. కేంద్రసాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్ సమన్వయంతో ఈ సభ జరగనుంది.

– మద్దికుంట లక్ష్మణ్, పురస్కార కమిటీ కన్వీనర్
(రేపు సిరిసిల్లలో 'రంగినేని ఎల్లమ్మ పురస్కార' ప్రదానం)

భారత ప్రజాస్వామ్యంలో చీకటి దినం

సందర్భం



డా॥ కొనగాల మహేష్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ మోదీ–అమిత్ షా ద్వయం తమ గర్హనీయ రాజతంత్రాన్ని అమలు పరిచారు. రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ 4,080 కి.మీ. 'భారత్ జోడో మహా పాదయాత్ర' ముగించుకొని పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. ఆ వెంటనే పార్లమెంట్‌లో మోదీ–అదానీ విదేశీ పర్యటనలపైనా, హిండెన్ బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ బయటపెట్టిన విషయాలపైనా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ చేసిన ప్రసంగాలు మోదీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాయి. ఈ నేపథ్యంలో మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోని సూరత్ కోర్టు వెలువరించిన తీర్పును సాకుగా చూపి రాహుల్ గాంధీని ఎంపీ స్థానానికి అనర్హులుగా ప్రకటించడం శోచనీయం.

2019 లోక్ సభ ఎన్నికల సందర్భంగా, కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ... 'దేశంలో బడా ఆర్థిక నేరస్థుల పేర్లలో యాదృచ్ఛికంగా మోదీ అని ఎలా ఉంది?' అని, దేశంలో ఆర్థిక మోసాలకు పాల్పడి దేశం వదిలి పారిపోయిన లలిత్ మోదీ, నీరవ్ మోదీ లను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో, గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ, యావత్ మోదీ సమాజాన్ని రాహుల్ గాంధీ నిందించారని సూరత్ కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావాకేసు వేశారు. లలిత్ మోదీ, నీరవ్ మోదీలు దేశంలో అనేక వేలకోట్ల ఆర్థిక నేరాలకు పాల్పడి దేశం వదిలి పారిపోయినది నిజమేనని మనందరికీ తెలుసు. కానీ, ఈ వ్యాఖ్యల పట్ల రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఉన్న విషయం మాట్లాడితే బీజేపీ నేతలకు ఉలుకెందుకు? గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకొనుడు ఎందుకు? రాహుల్ గాంధీ,' సత్యమేవ జయతే,



అబద్ధం మాట్లాడనప్పుడు నేనెందుకు క్షమాపణ చెప్తాను? న్యాయపరంగా ఎదుర్కొంటాన'ని వెన్ను చూపకుండా నిలబడ్డారు. ఈ కేసుపై సూరత్ కోర్టు మార్చి 23న తీర్పు చెబుతూ... రాహుల్ గాంధీకి 2 సంవత్సరాల జైలుశిక్ష విధించింది. అయితే, వెంటనే బెయిల్ ఇస్తూ, ఈ తీర్పుపై పై కోర్టుకు అప్పీల్ చేసుకోవడానికి 30 రోజుల గడువు కూడా ఇచ్చింది.

తీర్పు వెలువడిన 24 గంటల్లోనే... మోదీ ప్రభుత్వం ఆగమేఘాల మీద రాహుల్ వాయనాడు పార్లమెంటు సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్టు లోక్ సభ సచివాలయం ద్వారా ఒక నోటిఫికేషన్ విడుదల చేయించింది. ఈ తీర్పు అమలుకు ఇంకా 30 రోజుల గడువు ఉండగానే... దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, త్యాగాలు చేసిన కుటుంబానికి వారసుడిగా, సీనియర్ పార్లమెంటేరియన్‌గా ఉన్న రాహుల్‌పై అనర్హతవేటు వేసి పార్లమెంట్ నుంచి బయటకు పంపడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక చీకటి రోజు. ప్రశ్నించే గొంతుకలను నొక్కి, మోదీ పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. మోదీ ప్రధానిగా ఉన్న ఈ 9 సంవత్సరాల పాలనలో, ప్రతిపక్ష పార్టీ నేతగా రాహుల్ గాంధీ సంధించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ఎండగట్టి... మోదీ కార్పొరేట్ మిత్రులకు కొమ్ముగాయడాన్ని నిలదీసి పేద ప్రజల, రైతుల, నిరుద్యోగుల, మహిళల, అట్టడుగు వర్గాల హక్కులకోసం పోరాడుతున్న రాహుల్‌ని ఈరోజు పార్లమెంట్ బయటకు పంపడం ఖండనార్హం. ఆయనకి దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల నుంచి లభిస్తున్న మద్దతు చూసి మోదీ ప్రభుత్వం భయపడింది అనడానికి ఇదే ఉదాహరణ. రాహుల్‌కి జరిగిన అన్యాయం పట్ల ఈ దేశంలోని అన్ని వర్గాల ప్రజలందరూ అండగా నిలబడాలి.

వ్యాసకర్త కాంగ్రెస్ సీనియర్ నాయకులు
మొబైల్: 98667 76999

విద్య – విష సర్పం

చదవడం అంటే అక్షరాల్ని గుర్తించడం కాదు. గుర్తించి గడగడా వల్లించడం కాదు. సారాన్ని గ్రహించలేనిది చదువు కాదు. అన్నం గిన్నెలో చేయి పెట్టినా, నీటి పాత్రలో వేలు ముంచినా ఆకలి తీరదు, దాహం తీరదు. ప్రాణం నిలువదు. అలాగే, అక్షరం కూడా! అక్షరాన్ని అక్షరంగా కాదు, ఒక నిండైన భావానికి రూపంగా చూడగలిగితేనే దాని సారం తెలుస్తుంది. చదివినవారు కాదు, చదువుల సారం ఎరిగిన వారే నేర్పరి. చదువుకు సామాజిక ప్రయోజనం ఉంటుంది. వ్యక్తి వికాసానికి దోహదం చేస్తుంది. మనోవికాసం చెందిన మనుషులతో నిర్మితమైన సమాజం మానవీయంగా, మహోన్నతంగా విరాజిల్లుతుంది. ఏతావతా చెప్పాలంటే... మానవీయతను పరిమళింప చేసేదే చదువు. సంస్కారాన్ని నేర్పించి సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చనిది చదువే కాదు. అలాంటి చదువు వల్ల మరింత కీడే కలుగుతుంది కూడా. అలాంటి విద్యావంతుల వల్ల ఎంతో మానవ హననం జరిగింది. చరిత్రలో ఇందుకు ఎన్నెన్నో ఉదాహరణలు ఉన్నాయి.

అందుకే... నేర్చుకునే విద్యను ప్రజ్ఞతో నేర్చుకోవాలి, ప్రజ్ఞతో పరిశీలించాలి, ప్రజ్ఞతో పరీక్షించాలి. అప్పుడే దాని బాహ్య స్వరూపం కాకుండా అంతరంగం తెలుస్తుంది. సారం లభిస్తుంది. కొందరు బాగా చదువుతారు. ఉద్గ్రంథాలు వల్లె వేస్తారు. కానీ, అనైతికంగా జీవిస్తారు. అది అటు ఉంచి... కేవలం తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. వాదాలలో గెలుస్తారు. ఇలాంటివన్నీ బాహ్య ప్రదర్శనలే! కానీ, వారి అంతరంగం మాత్రం స్వార్థంతో, అహంతో మలినమై ఉంటుంది. నిజానికి చదువు మన ఆంతరంగిక మలినాల్ని శుద్ధి చేయాలి. నిర్మల హృదయులుగా తీర్చిదిద్దాలి. మనిషికి నియతిని, నైతిక విలువల్ని పెంపొందించేదే నిజమైన చదువు.

జ్యోతిర్మయం

నాగుపామును పట్టుకోవాలనుకున్నవారు తోక పట్టుకున్నా, నడుం దగ్గర పట్టుకున్నా దాని కాటుకు గురవుతారు. అలా పట్టుకోవడం ప్రమాదం. నైతిక విలువలు నేర్పని చదువు కూడా అలాంటిదే అంటాడు బుద్ధుడు. నేర్పరి అయినవాడు నాగుపాము ప్రక్కగా వెళ్ళి, పంగల కర్రతో తల వెనుక అదిమిపట్టి, వెనుకనుంచి లాఘవంగా తలను పట్టుకుంటాడు. అలా పట్టుకోవడం వల్ల అది కాటేయలేదు. ప్రమాదాన్ని కలిగించదు. చదువూ అంతే... జ్ఞానం, విజ్ఞానం మానవీయతలో ఉంటే మానవాభ్యుదయానికి దారులు తీస్తాయి. లేకుంటే మారణ గీతం పాడుతాయి.

– బొర్రా గోవర్ధన్



విద్యుత్‌సౌధ ముందు విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



విద్యుత్‌సౌధ ప్రాంగణంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆర్టిజన్ కార్మికులు

విద్యుత్‌సౌధ అష్టదిగ్బంధనం

- వేతన సవరణ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం, ఆర్టిజన్లకు తగిన ఫిట్‌మెంట్ కోసం డిమాండ్
- సోమాజిగూడలో రోడ్డుపై బైఠాయించిన కార్మికులు
- ఖైరతాబాద్, పంజగుట్ట, ఎన్టీఆర్‌మార్గ్‌లలో ట్రాఫిక్ జాం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్‌సౌధను ఉద్యోగులు అష్ట దిగ్బంధనం చేశారు. వేతన సవరణ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చలో విద్యుత్‌సౌధ కార్యక్రమానికి 24 సంఘాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్(టీఎస్‌పీఈ జేఏసీ) కమిటీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. జేఏసీ పిలుపు మేరకు గ్రేటర్ హైదరాబాద్ నుంచే కాకుండా తెలంగాణ జిల్లాల నుంచి విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్టిజన్ కార్మికులు ఉదయం పదిగంటలకే పెద్దసంఖ్యలో సోమాజిగూడలోని విద్యుత్‌సౌధకు చేరుకున్నారు. అనుకున్న దానికంటే అధిక సంఖ్యలో తరలిరావడంతో విద్యుత్‌సౌధ ప్రాంగణమంతా నిండిపోయింది. మిగిలిన వాళ్లంతా ప్రధాన కార్యాలయం ముందున్న రహదారిపైనే నిలబడాల్సి వచ్చింది. దీంతో ఇటు ఖైరతాబాద్ చౌరస్తా నుంచి అటు పంజగుట్ట వరకు రోడ్డంతా విద్యుత్ కార్మికులతో నిండిపోయింది.

ట్రాఫిక్ మళ్లింపు.. ఎక్కడి వాహనాలు అక్కడే..

విద్యుత్ ఉద్యోగుల ధర్నాతో లక్డీకాపూల్, పంజగుట్ట, ఎన్టీఆర్ మార్గ్, సోమాజిగూడ, ఎర్రమంజిల్ పరిసర ప్రాంతాలన్నీ రద్దీగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు అప్రమత్తమై ఖైరతాబాద్ చౌరస్తా నుంచి పంజగుట్ట వైపు వెళ్లే రోడ్డుమార్గాన్ని బారికేడ్లతో మూసివేశారు. అసెంబ్లీ మీదుగా వచ్చిన వాహనాలను రాజ్‌భవన్ మీదుగా బేగంపేట వైపు మళ్లించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. ఆందోళనకారులు ఒక్కసారిగా పెద్దసంఖ్యలో రోడ్డుపైకి రావడం, సీఎం కేసీఆర్, సీఎండీ ప్రభాకర్‌రావుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉందని ముందే పసిగట్టిన జేఏసీ నేతలు ధర్నా విజయవంతమైందని చెప్పి ఆందోళన కార్యక్రమాన్ని ముగించారు. ధర్నా కారణంగా రోడ్లపై భారీగా ట్రాఫిక్ జాం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

మొండివైఖరిపై మండిపడిన జేఏసీ

ఉద్యోగుల వేతనాలను వెంటనే సవరించాలని, 1999 నుంచి 2004 మధ్యకాలంలో నియమితులైన విద్యుత్ ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ నుంచి జీపీఎస్ సదుపాయాన్ని కల్పించాలని, ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, చైర్మన్ సాయిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా వేదికపై నుంచి వీరు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే పలుమార్లు యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అయినా వారి నుంచి కనీసస్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులకు నగదురహిత అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చేయాలని, రూ.కోటి లైఫ్‌టైమ్ ఇన్సూరెన్స్ పాలసీ ఇవ్వాలని, రిటైర్మెంట్ గ్యారంటీని జీపీఎఫ్ ఉద్యోగులకు రూ.16 లక్షలు, ఈపీఎఫ్ ఉద్యోగులకు రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా విద్యుత్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

8 వారాల్లో సమీక్షించండి

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులపై సర్కారుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో పదోన్నతులపై 8 వారాల్లో సమీక్ష జరిపి నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2018లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. ఆ ఆదేశాలను అమలు చేయకపోవడంతో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలపై ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావలీ శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యుత్ సంస్థల తరపు న్యాయవాది ఉమాదేవి వాదనలు వినిపిస్తూ పదోన్నతుల సమీక్షకు ఆరు నెలల సమయాన్ని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మహమ్మద్ అదనాన్ వాదనలు వినిపిస్తూ.. ఇంకా ఆరు మాసాలు గడువు కోరడం సరికాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి, జూనియర్ లైన్‌మన్ స్థాయి నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి వరకు కల్పించిన పదోన్నతులన్నింటినీ సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు సమీక్షించాలన్నారు. నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించి 8 వారాల్లో హైకోర్టుకు నివేదిక సమర్పించాలని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేశారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమారస్వామి, వైస్ చైర్మన్ ఆర్.సుధాకర్ రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో-కన్వీనర్ సి.భానుప్రకాశ్ తదితరులు హర్షం వ్యక్తంచేశారు. వెంటనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంట నష్టం సాయంపై ప్రజలను మభ్యపెడుతున్నారు

- బీజేపీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో నష్టపోయిన పంటకు రాష్ట్ర నిధుల నుంచి పరిహారమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజలను సీఎం కేసీఆర్ మభ్యపెడుతున్నారని బీజేపీ నేత, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ కిలాడీ రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. నోటిఫైడ్ విపత్తుల ప్రతిస్పందనల కోసం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాల వద్ద అందుబాటులో ఉన్న ప్రాథమిక నిధి అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్‌లో 75 శాతం వాటా ఇస్తుందని తెలిపారు. తాను చేసిన తప్పును రాహుల్‌గాంధీ ఇప్పటికైనా సరిదిద్దుకుని, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఆ విధంగా ఆయన చేయని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఒక ప్రకటనలో హెచ్చరించారు. తాను చేసిన వ్యాఖ్యల ఫలితంగా రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధిస్తే దాన్ని బీజేపీకి అంటగట్టడం అన్యాయమన్నారు. విదేశాల్లో భారత్ పరువు తీసే ఘనుడు రాహుల్‌గాంధీనే అని ఆరోపించారు. 'దేశ సంపదను కొల్లగొట్టింది కాంగ్రెస్ హయాంలోనే. దేశ రాజకీయాల్లో పరిపక్వత లేని నాయకుడు రాహుల్ గాంధీ. జనాదరణ లేకనే అమేథీలో రాహుల్ తిరస్కరణకు గురయ్యారు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

పాలమూరు-రంగారెడ్డిపై 'సుప్రీం' ఆదేశాలు అమలు చేస్తున్నారా?

- తాజా నివేదిక సమర్పించాలని తెలంగాణకు కృష్ణా బోర్డు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తాగునీటి సరఫరా అవసరాల మేరకు మాత్రమే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను కొనసాగించేందుకు ఇటీవల సుప్రీంకోర్టు అనుమతించిన నేపథ్యంలో.. ప్రాజెక్టు తాజా పురోగతిపై నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని చేయదగిన పనులు, నిలుపుదల చేయాల్సిన పనుల వివరాలను సైతం సమర్పించాలని కోరింది. ప్రాజెక్టు డీపీఆర్ మదింపు, అనుమతుల జారీ కోసం ఈ వివరాలను సీడబ్ల్యూసీకి ఈ నెల 29లోగా పంపించాలని సూచించింది. ఈ మేరకు కృష్ణాబోర్డు సభ్యుడు డీఎం రాయ్‌పురే శుక్రవారం తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాశారు. పర్యావరణ అనుమతులు లేనికారణంగా ఈ ప్రాజెక్టు పనులపై గతంలో ఎన్జీటీ స్టే విధించగా, 7.15 టీఎంసీల తాగునీటి అవసరాలకు సంబంధించిన పనులు మాత్రమే చేపట్టేందుకు ఇటీవల సుప్రీం కోర్టు అనుమతిచ్చింది.

ఇక నీటి కేటాయింపుల్లేవ్

- ప్రాజెక్టుల వారీగా నిర్దిష్ట కేటాయింపులే చేస్తాం
- స్పష్టం చేసిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్
- పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులపై విచారణ
- కేటాయింపులపై ట్రిబ్యునల్‌కు అధికారం ఉందని ఏపీ వాదన
- తోసిపుచ్చిన ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేష్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల కేటాయింపులను జరపమని, ప్రాజెక్టుల వారీగా ఇప్పటికే నిర్దిష్ట కేటాయింపులు జరగని పక్షంలో ఆ మేరకు కేటాయింపులు మాత్రమే చేస్తామని బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్-2 మరోసారి స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద పరిష్కార చట్టం (ఐఎస్‌ఆర్‌డబ్ల్యూ) 1956లోని సెక్షన్ -3, 5 కింద కృష్ణా జలాల కేటాయింపులను ట్రిబ్యునల్ ఇప్పటికే ముగించిందని తెలిపింది. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 కింద ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరిపేందుకు పరిమిత అవకాశాలు మాత్రమే ఉన్నాయని ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేష్‌కుమార్ వెల్లడించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి కేటాయింపులు జరుపుతూ 2022లో తెలంగాణ జారీ చేసిన జీవో నెం.246ను సవాలు చేస్తూ ఏపీ దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్‌పై శుక్రవారం ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ నిర్వహించింది. మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలు, కాళేశ్వరం ద్వారా గోదావరి జలాల తరలింపులకు బదులుగా మరో 45 టీఎంసీలను కలిపి మొత్తం 90 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి పథకానికి తెలంగాణ కేటాయించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం ట్రిబ్యునల్‌కు ఉందని ఏపీ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపించగా, నీటి కేటాయింపులపై నిర్ణయాధికారం తమకు లేదని బ్రిజేష్‌కుమార్ ఆయన వాదనలను తోసిపుచ్చారు. అపెక్స్ కౌన్సిల్‌కు నిర్ణయాధికారం లేదని, కేవలం మధ్యవర్తి పాత్రపోషించాల్సి ఉంటుందని పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89ను ఉటంకిస్తూ ఏపీ న్యాయవాది పేర్కొనగా, అపెక్స్ కౌన్సిల్ విషయాన్ని ట్రిబ్యునల్‌కు రిఫర్ చేయవచ్చు అని బ్రిజేష్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టుల వారీగా నిర్దిష్ట కేటాయింపులు జరపనిపక్షంలో ఆపరేషనల్ ప్రొటోకాల్స్‌పై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదంటూ తెలంగాణ తరపున సాక్షిగా ఉన్న ఓ వ్యక్తి చేతన్ పండిత్ పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

ఏపీ ఆరోపణను తోసిపుచ్చిన తెలంగాణ న్యాయవాది

మిషన్ కాకతీయ ద్వారా తెలంగాణ 89.15 టీఎంసీలను వినియోగిస్తున్నట్టు జీవోలో పేర్కొందని, వాస్తవానికి 175 టీఎంసీలను వాడుతుందని ఏపీ న్యాయవాది పేర్కొన్నారు. అయితే, 44టీఎంసీలను మాత్రమే మైనర్ ఇరిగేషన్ ద్వారా వాడుతున్నామని, మిగిలిన 45టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పునః కేటాయింపులు జరిపినట్టు తెలంగాణ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. కేఆర్‌ఎంబీ, కృష్ణా బోర్డుకు ఈ ప్రాజెక్టు డీపీఆర్‌లను తెలంగాణ సమర్పించలేదని ఏపీ చేసిన ఆరోపణను తెలంగాణ న్యాయవాది తోసిపుచ్చారు. ఇప్పటికే డీపీఆర్‌ను సమర్పించామని, పరిశీలన దశలో ఉందని స్పష్టం చేశారు. నీటి లభ్యతను చూపడానికే నీటి పునః కేటాయింపులు జరిపారా? అని ఈ సందర్భంగా ట్రిబ్యునల్ తెలంగాణను ప్రశ్నించింది. పర్యావరణ అనుమతుల కోసం నీటి లభ్యతను చూపాల్సి ఉంటుందని తెలంగాణ బదులిచ్చింది.

రైతుకష్టం తెలిసిన నేత సీఎం కేసీఆర్



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి పువ్వాడ, రైతులు

ఖమ్మం అర్బన్: రైతుల కష్టం తెలిసిన నేతగా సీఎం కేసీఆర్ అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల చొప్పున సాయం ప్రకటించారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా అల్లీపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం సీఎం కేసీఆర్ పరిహారం ప్రకటించిన నేపథ్యంలో ఆయన చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించిన సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేల చొప్పున ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రావూరి కరుణ, కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రోజుకో కుంభకోణం: కొమ్మూరి



యాత్రలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలో రోజుకో కుంభకోణం వెలుగు చూస్తుండగా, వాటిల్లో సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులే ఉండటం వారి ధనదాహానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన యాత్రలో కొమ్మూరి పాల్గొన్నారు. పట్టణంలోని 1వ వార్డు ఇండస్ట్రియల్ ఏరియా నుంచి నెహ్రూ పార్క్ మీదుగా ఆర్టీసీ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రసాధనలో జనగామ, చేర్యాల ప్రాంతం ముందుండి నడిపిస్తే, నేడు ఉద్యమద్రోహులకు పెద్దపీట వేసి కేసీఆర్ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాలతో నష్టపోయిన ప్రతి ఎకరాకు సాయంగా రూ.50 వేలు అందించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో విసుగు చెందిన ప్రజలు, వారిని ఇంటికి పంపించేందుకు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చారబుడ్ల రాందయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు

లోక్‌సభ సభ్యత్వం రద్దు ● పార్లమెంట్ సెక్రటేరియట్ నిర్ణయం

స్పందనలు

ప్రజాస్వామ్య చరిత్రలో ఇదో చీకటి రోజు

'ఇది భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు. నిజాలు మాట్లాడుతున్నందుకు, ప్రజల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నందుకే రాహుల్‌పై అధికార బీజేపీ కక్షగట్టింది. ఆయన గొంతు నొక్కడమే ఉద్దేశం. నిజాలను రాహుల్ బహిర్గతం చేయడం బీజేపీకి ఇష్టం లేదు, రాహుల్‌పై వేటు పడినా అదానీ అక్రమాలపై జేపీసీ విచారణ డిమాండ్‌పై తగ్గేది లేదు. మమ్మల్ని జైలుకు పంపించినా పోరాడుతూనే ఉంటాం''

– మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు

''మోదీ భారత్‌లో విపక్ష నాయకులే లక్ష్యంగా మారారు. నేర చరితులైన బీజేపీ వారికి మంత్రి పదవులు. విపక్ష నేతలపై అనర్హత వేటు. ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత హీనమైన పరిస్థితి!''

మమత బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

''రాహుల్‌పై అనర్హత వేటు దిగ్భ్రాంతికి గురిచేసింది. దేశం అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. దేశంలో ఒకే పార్టీ, ఒకే నాయకుడు ఉండాలని అనుకుంటున్నారు. బ్రిటీష్ పరిపాలన కంటే ప్రమాదకరంగా ప్రధాని మోదీ పాలన మారింది. ఇది కేవలం ఒక్క కాంగ్రెస్ చేసే పోరాటం కాదు. దేశాన్ని రక్షించుకోవడానికి 130 కోట్ల మంది భారతీయులు ఏకం కావాలి''

అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

''ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మోదీ స్నేహితుడైన పారిశ్రామికవేత్త (అదానీ) అంశాల నుంచి దృష్టి మరల్చే బీజేపీ ఎత్తుగడ ఇది. యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కుట్రలు పన్ని, తప్పుడు కేసులు పెట్టి సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఆజమ్‌ఖాన్ సహా ఎందరిపైనో అనర్హత వేటు వేసింది''

అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు

''రాహుల్‌గాంధీపై అనర్హత వేటు రాజ్యాంగం ప్రాథమిక సిద్ధాంతాలకే వ్యతిరేకం. ప్రజాస్వామ్య విలువలన్నీ మంటగలుపుతున్నారు. ఇలాంటి చర్యల్ని పూర్తిగా ఖండించాలి''

శరద్ పవార్, ఎన్సీపీ అధినేత

''రాహుల్‌పై అనర్హత ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులపై జరిగిన దాడి. ఇదొక ఫాసిస్టు చర్య. ఒక జాతీయ పార్టీ నాయకుడు, పార్లమెంటు సభ్యుడికి కూడా తన అభిప్రాయాలను వ్యక్తపరిచే ప్రజాస్వామ్య హక్కు లేదని ఇలాంటి చర్యల ద్వారా భయపెడుతున్నారు''

ఎంకె స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

''ప్రతిపక్ష నాయకుల్ని టార్గెట్ చేయడానికి పరువు నష్టం మార్గాన్ని బీజేపీ ఎంచుకోవడాన్ని ఖండించాలి. వ్యవస్థల్ని దుర్వినియోగం చేయడం తారాస్థాయికి చేరుకుంది. ఇలాంటి నిరంకుశ దాడుల్ని ప్రతిఘటించాలి, ఓడించాలి''

సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

''అబద్ధాలు, వ్యక్తిగత నిందలు, ప్రతికూల రాజకీయాలు రాహుల్‌లో ఒక అంతర్భాగంగా మారాయి. ఒబిసి సామాజిక వర్గాన్ని దొంగలతో పోల్చి రాహుల్ తనకున్న కుల అహంకారాన్ని బయటపెట్టుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆయనకి ప్రజలు ఇంతకంటే పెద్ద శిక్ష విధిస్తారు.''

జె.పి. నడ్డా, బీజేపీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామం! పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష ఖరారైన కాంగ్రెస్ నాయకుడు, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది! ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకుంటూ లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 'దొంగలందరి ఇంటి పేరూ మోదీయే ఎందుకుంటుందో' అని వ్యాఖ్యానించిన కేసులో సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొంది. తీర్పు వెలువడ్డ ఈ నెల 23వ తేదీ (గురువారం) నుంచే వేటు అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. నిజానికి అపీలుకు వీలుగా శిక్ష అమలును నెల రోజుల పాటు నిలిపేస్తున్నట్టు సూరత్ కోర్టు పేర్కొనడం తెలిసిందే. అయినా లోక్‌సభ సెక్రటేరియట్ మాత్రం 24 గంటల్లోపే ఎంపీగా ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ వేటు వేయడం గమనార్హం! శిక్షపై ఉన్నత న్యాయస్థానంలో స్టే లభించని పక్షంలో రెండేళ్ల జైలు శిక్షా కాలం, అనంతరం మరో ఆరేళ్లు కలుపుకుని మొత్తం ఎనిమిదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాహుల్ అనర్హుడవుతారు! శుక్రవారం ఉదయం మామూలుగానే లోక్‌సభ సమావేశానికి హాజరైన ఆయన, లోక్‌సభ సెక్రటేరియట్ నిర్ణయం అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. రాహుల్‌పై అనర్హత వేటును కాంగ్రెస్ తీవ్రంగా నిరసించగా విపక్షాలన్నీ ముక్త కంఠంతో ఖండించాయి. ఆయనకు బాసటగా నిలిచాయి. దీనిపై 'జనాందోళన్' పేరిట దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. బీజేపీ మాత్రం వేటు చట్టప్రకారమే జరిగిందని పేర్కొంది. రాహుల్‌కు చట్టం వర్తించదా అని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన, అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. 'నేరాలకు పాల్పడడం రాహుల్‌కు అలవాటే. పార్లమెంట్‌కు, ప్రభుత్వానికి, దేశానికి అతీతుడినని ఆయన భావిస్తున్నారు. తమకు ప్రత్యేక భారత శిక్షాస్మృతి ఉండాలని, తమను ఎవరూ నేరస్తులుగా నిర్ధారించవద్దని, శిక్షలు విధించవద్దని కాంగ్రెస్, ప్రధానంగా నెహ్రూ–గాంధీ కుటుంబం కోరుకుంటోంది'' అంటూ దుయ్యబట్టారు. ''ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. కానీ దేశ ప్రజలంతా ప్రధాని మోదీకి మద్దతుగా నిలుస్తున్నారు'' అన్నారు.



శుక్రవారం తనపై వేటు నిర్ణయం అనంతరం పార్లమెంటు నుంచి వెళ్లిపోతున్న రాహుల్ గాంధీ

భారత్ గొంతుక కోసమే నా పోరాటం

"భారతదేశ గొంతుక కోసం పోరాటం సాగిస్తున్నా. ఈ విషయంలో ఎలాంటి మూల్యం చెల్లించడానికైనా సిద్ధంగా ఉన్నా"

- రాహుల్ గాంధీ ట్వీట్

తలవంచం.. ఏం చేసుకుంటారో చేసుకోండి

''దేశ ప్రజాస్వామ్యం కోసం మా కుటుంబం రక్తం ధారపోసింది. అలాంటి ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోంది. ప్రాణత్యాగం చేసిన ప్రధాని కుమారుడైన రాహుల్ గాంధీని 'మీర్ జాఫర్' అంటూ మోదీ మనుషులు కించపర్చారు. మా కుటుంబాన్ని దూషించారు. రాహుల్ తండ్రెవరని బీజేపీ ముఖ్యమంత్రి ఒకరు ప్రశ్నించారు. కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని పాటిస్తూ తలపాగా ధరిస్తే దాన్నీ తప్పుపట్టారు. తద్వారా పండిట్ల సామాజిక వర్గాన్ని అవమానించారు. నెహ్రూ ఇంటి పేరు ఎందుకు పెట్టుకోలేదని పార్లమెంట్‌లో మీరు (మోదీ) మమ్మల్ని ప్రశ్నించారు. మమ్మల్ని దారుణంగా అవమానించినా ఏ జడ్జి కూడా మీకు రెండేళ్ల జైలు శిక్ష విధించలేదు. పార్లమెంట్ నుంచి అనర్హత వేటు వేయలేదు. రాహుల్ నిజమైన దేశ భక్తుడు. అందుకే అదానీ గ్రూప్ సాగించిన లూటీపై ప్రశ్నించాడు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ బాగోతాలపై నిలదీశాడు. మీ మిత్రుడు గౌతమ్ అదానీ పార్లమెంట్ కంటే గొప్పవాడా? అధికార దాహమున్న వ్యక్తుల ముందు మేం తల వంచే ప్రసక్తే లేదు. ఏం చేసుంటారో చేసుకోండి!''

- ప్రియాంకాగాంధీ వాద్రా, కాంగ్రెస్ నాయకురాలు

వయనాడ్ ఖాళీ

లోక్‌సభలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ స్థానం ఖాళీ అయినట్టు లోక్‌సభ వెబ్‌సైట్ పేర్కొంది. ఎన్సీపీ ఎంపీ మహ్మద్ ఫైజల్‌పై హత్యా యత్నం నేరం రుజువై పదేళ్ల జైలు శిక్ష పడటంతో లక్షద్వీప్, కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి మృతితో జలంధర్ (పంజాబ్) స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. 2019లో వయనాడ్‌తో పాటు గాంధీల కంచుకోట అయిన యూపీలోని అమేఠీ నుంచి కూడా పోటీ చేసిన రాహుల్ అక్కడ బీజేపీ నేత స్మృతీ ఇరానీ చేతిలో ఓటమి చూవిచూశారు.

రాహుల్ ముందు 2 మార్గాలు

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్ష, పార్లమెంట్ సెక్రటేరియట్ వేసిన అనర్హత వేటుపై న్యాయ పోరాటానికి ప్రతిపక్ష కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. అనర్హత వేటు నుంచి బయట పడి, ఎంపీగా కొనసాగడంతో పాటు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే రాహుల్ ముందు రెండు మార్గాలున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు. తీర్పును పై కోర్టు కొట్టివేస్తే అనర్హత వేటూ రద్దవుతుంది. కనీసం జైలు శిక్షను రెండేళ్ల కంటే తగ్గించినా ఊరటే. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లు, అంతకు మించి జైలుశిక్ష పడితేనే అనర్హత వేటు వర్తిస్తుంది. కనుక సూరత్ కోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేసేలా, రెండేళ్ల కంటే తగ్గించేలా పై కోర్టులో వాదించి నెగ్గాల్సి ఉంటుంది. లేదంటే కనీసం శిక్ష అమలుపై స్టే తెచ్చుకున్నా ఎంపీ పదవిని కాపాడుకోవచ్చు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. రాహుల్ అప్పీల్‌ను పై కోర్టు తిరస్కరిస్తే మాత్రం మరో ఎనిమిదేళ్ల దాకా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదు. ఇది క్రిమినల్ కేసు కావడంతో నేరుగా గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించకపోవచ్చని తెలుస్తోంది. తొలుత సూరత్ సెషన్స్ కోర్టులో అప్పీల్ దాఖలు చేస్తారని, అక్కడ ఊరట దక్కకపోతే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీం కోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. హత్యాయత్నం కేసులో దోషిగా తేలి, జైలుశిక్ష పడిన లక్షద్వీప్ ఎంపీ మొహమ్మద్ ఫైజల్‌పై లోక్‌సభ సెక్రటేరియట్ ఈ ఏడాది జనవరిలో అనర్హత వేటు వేసింది. లక్షద్వీప్ లోక్‌సభ స్థానం ఖాళీ అయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉప ఎన్నిక కోసం నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. ఇంతలో మొహమ్మద్ ఫైజల్‌కు విధించిన జైలు శిక్షపై కేరళ హైకోర్టు స్టే విధించింది. దీంతో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం రద్దు చేసింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

అదానీ అంశంపై జేపీసీతో దర్యాప్తు చేయించాలని, దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ నిరసన ర్యాలీ చేపట్టిన 40 మంది ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు నిర్బంధించారు. పార్లమెంట్ హౌస్ నుంచి విజయ్ చౌక్‌కు ర్యాలీగా వెళ్లిన ప్రముఖుల్లో కేసీ వేణుగోపాల్, ఆధిర్ రంజన్ చౌధురి, కె.సురేశ్, మాణిక్కం ఠాగోర్ తదితరులు ఉన్నారు. వీరంతా నిషేధాజ్ఞలు ఉల్లంఘించారని పోలీసులు చెప్పారు. సెక్షన్ 144ను ఉల్లంఘించి ర్యాలీ చేపట్టిన 40 మంది ఎంపీలను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అంతకుముందు విజయ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితర నేతలు మాట్లాడారు. ర్యాలీలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, శివసేన ఉద్ధవ్ వర్గం, జేడీయూ, ఆప్ నేతలు పాల్గొని 'వుయ్ డిమాండ్ జేపీసీ', 'సేవ్ ఎల్ఐసీ', 'డెమోక్రసీ ఇన్ డేంజర్' అన్న ప్లకార్డులను ప్రదర్శించారు.



వేటును నిరసిస్తూ విపక్షాల ర్యాలీ

రాహుల్ నోరు నొక్కేందుకే: కాంగ్రెస్

సోనియా సహా అగ్ర నేతల అత్యవసర భేటీ

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. దీనిపై దేశవ్యాప్తంగా 'జనాందోళన్'కు పిలుపునిచ్చింది. రాహుల్ సభ్యత్వంపై వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ వెలువడగానే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ సహా కాంగ్రెస్ ముఖ్య నేతలంతా శుక్రవారం సాయంత్రం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. రాహుల్ నోరు నొక్కేందుకే అధికార బీజేపీ ఇలా వాయు వేగంతో చర్యలకు దిగిందని తీర్మానించారు. వేటుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని, మోదీ సర్కారు నిరంకుశ వైఖరిపై నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల విభాగాలు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయనున్నాయి. రాహుల్‌కు విపక్షాల సంఘీభావాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ స్వాగతించింది. ''దీనిపై ఐక్యంగా పోరాడదాం. ఆందోళనల్లో మీరు కూడా కలిసి రండి'' అంటూ ప్రతిపక్ష పార్టీలకు పిలుపునిచ్చింది. భేటీలో ప్రియాంక, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర సంస్థల దుర్వినియోగంపై ఏప్రిల్ 5న విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రాజకీయ విరోధులకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలను ఏకపక్షంగా వాడుకుంటోందంటూ 14 ప్రతిపక్ష పార్టీలు వేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 5వ తేదీన విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. డీఎంకే, ఆర్జేడీ, బీఆర్ఎస్, టీఎంసీ, ఎన్సీపీ, జేఎంఎం, జేడీయూ, సీపీఎం ఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీలు వేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం వాదనలు వింది. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో 95% ప్రతిపక్ష పార్టీల నేతలపై ఉన్నవేనని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి తెలిపారు.

రాహుల్‌కు జైలు శిక్ష గురించి తెలిసింది: ఐరాస

ఐక్యరాజ్యసమితి: ''కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడిన విషయం మా అవగాహనలో ఉంది. భారత్‌లోని పరిణామాలపై ఈ దశలో మా స్పందన ఇదే'' అని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ ప్రతినిధి ఫర్హాన్ హక్ గురువారం మీడియాతో మాట్లాడారు. భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి గుటెరస్ ఆందోళన చెందుతున్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.


వేటు రాజ్యాంగబద్ధమేనా?

రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేటు రాజ్యాంగబద్ధమేనని కొందరు, లోక్‌సభ సెక్రటేరియట్ సరైన నిర్ణయం తీసుకోలేదని మరికొందరు అంటున్నారు. 2014 నాటి లిల్లీ థామస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన ప్రజాప్రతినిధులు వెంటనే అనర్హతకు గురవుతారని వెల్లడించింది. శిక్ష పడిన మర్నాడే రాహుల్‌పై వేటుకు ఈ తీర్పు దోహదపడినట్లు తెలుస్తోంది. అయితే 2018 నాటి లోక్‌ప్రహరీ వర్సెస్ భారత ఎన్నికల సంఘం కేసులో సుప్రీంకోర్టు మరో తీర్పు ప్రకటించింది. అనర్హత వేటు పడిన ప్రజాప్రతినిధిపై అభియోగాలను పై కోరుటు కొట్టేస్తే సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. శిక్ష రద్దయితే వేటూ రద్దవుతుందని తెలియజేసింది. రాహుల్‌పై వేటు విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 102(1)(ఈ), ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3)ని లోక్‌సభ సెక్రటేరియట్ ఉదాహరించింది. వీటి ప్రకారం రెండేళ్లకు మించి జైలు శిక్ష పడిన సభ్యులపై శిక్షాకాలం ముగిసిన తర్వాత ఆరేళ్ల దాకా ఎన్నికల్లో పోటీ చేయకుండా వేటు వేయవచ్చు. కానీ ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4) ప్రకారం శిక్ష పడిన 3 నెలల తర్వాత మాత్రమే అనర్హత ప్రక్రియ ప్రారంభం కావాలి. ఈలోగా శిక్షపడిన సభ్యుడు పై కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. కింది కోర్టు తీర్పును పై కోర్టు కొట్టివేసే అవకాశం ఉంది. కానీ, రాహుల్‌పై వెంటనే వేటు వేయడం గమనార్హం. ఇలా శిక్ష పడిన మరుసటి రోజే సభ్యులపై అనర్హత వేటు వేసిన దాఖలాలు గతంలో లేవు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 8(4)ను లోక్‌సభ సెక్రటేరియట్ పట్టించుకోలేదని నిపుణులు చెబుతున్నారు. లోక్‌ప్రహరీ కేసు ప్రకారం.. రాహుల్‌కు పడిన జైలుశిక్షను పై కోర్టు రద్దు చేస్తే ఆయనపై అనర్హత వేటు సైతం రద్దవుతుంది.

అండర్ వాటర్ డ్రోన్!

శత్రు నౌకల్ని అమాంతంగా ముంచేయవచ్చు.. వీటితో నౌకాశ్రయాలకు, నగరాలకూ ముప్పే

ప్రస్తుతం రష్యా వద్ద మాత్రమే ఈ సామర్థ్యం.. ఉత్తర కొరియా ప్రకటనతో ప్రకంపనలు



సునామీ పుట్టించే..

- సాక్షి, నేషనల్ డెస్క్

సునామీని పుట్టించే అణు సామర్థ్యమున్న అండర్ వాటర్ డ్రోన్ 'హెయిల్'ను విజయవంతంగా పరీక్షించినట్టు ఉత్తర కొరియా చేసిన ప్రకటన ప్రకంపనలు రేపుతోంది. దీని సాయంతో భారీ సునామీలు పుట్టించి తీరంలో నౌకాశ్రయాలనూ, సముద్ర మధ్యంలో శత్రు నౌకలను నాశనం చేయగల సామర్థ్యం తమకు సమకూరిందని అది చెబుతోంది. అదే నిజమైతే రష్యా తర్వాత ఈ సామర్థ్యమున్న రెండో దేశమవుతుంది. ఇలాంటి డ్రోన్లను ప్రయోగిస్తే సముద్ర మట్టం అనూహ్యంగా పెరిగి పరిసర ప్రాంతాలను పూర్తిగా ముంచెత్తుతుంది. దీనితో సముద్ర మధ్యంలో అయితే శత్రు నౌకలను నీట ముంచవచ్చు. అదే తీర ప్రాంతంలో ప్రయోగిస్తే సమీప నౌకాశ్రయాలతో పాటు నగరాలు, జనావాసాలు కూడా నామరూపాల్లేకుండా పోయే ప్రమాదముంది! కాకపోతే హెయిల్‌ను రష్యా అండర్ వాటర్ డ్రోన్ పొసెయ్‌డాన్‌తో ఏ మాత్రమూ పోల్చలేం. ఎందుకంటే అత్యాధునిక హంగులతో కూడిన పొసెయ్‌డాన్‌ను జలాంతర్గాముల నుంచీ ప్రయోగించవచ్చు. స్వయంచాలిత న్యూక్లియర్ ప్రొపెల్షన్ వ్యవస్థ సాయంతో ఎంతకాలమైనా ప్రయాణం చేయగల సత్తా దాని సొంతం. హెయిల్‌కు అంత సీన్ లేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికాతో సంయుక్త సైనిక విన్యాసాలు చేస్తున్న దక్షిణ కొరియాను బెదిరించేందుకే ఇలాంటి ప్రకటన చేసి ఉండవచ్చన్నది వారి విశ్లేషణ.

ఏమిటీ అండర్ వాటర్ డ్రోన్?

➤ వీటిని ఒకరకంగా చిన్నపాటి మానవరహితజలాంతర్గాములుగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా సముద్ర గర్భంలో వరుస పేలుళ్ల ద్వారా అతి పెద్ద రాకాసి అలల్ని పుట్టించి పరిసర ప్రాంతాలను నీట ముంచేస్తాయి. ఇవి స్వయంచాలితాలు. యుద్ధనౌకలు, లేదా ఇతర ప్రాంతాల నుంచి కంప్యూటర్లు, సెన్సర్ల ద్వారా వీటిని నియంత్రిస్తుంటారు. ఇలాంటి అండర్‌వాటర్ డ్రోన్లు 1950ల నుంచే ఉనికిలో ఉన్నట్టు బార్డ్ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ ద డ్రోన్ చెబుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 250కి పైగా ఇలాంటి డ్రోన్లు వినియోగంలో ఉన్నట్టు అంచనా. మిలిటరీ డాట్‌కామ్ వివరాల మేరకు వీటిని జలాంతర్గాముల ద్వారా అమెరికా నేవీ 2015లో తొలిసారిగా మోహరించింది. ''ఇది ప్రమాదకరమైన పనులెన్నింటినో అండర్‌వాటర్ డ్రోన్ గుట్టు గా చక్కబెట్టగలదు. ఒకవైపు వీటిని ప్రయోగించి శత్రు లక్ష్యాలను ఛేదించవచ్చు. శత్రువు దృష్టిని అటువైపు మళ్లించి ప్రధాన జలాంతర్గామి తన ప్రధాన లక్ష్యం మీద మరింత మెరుగ్గా దృష్టి సారించవచ్చు. అంటే రెట్టింపు ప్రయోజనమన్న మాట''అని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.



పొసెయ్‌డాన్.. రష్యా డ్రోన్..

➤ ఇది అణు సామర్థ్యమున్న సూపర్ టోర్పెడో. చరిత్రలో అతిపెద్ద టోర్పెడో కూడా ఇదే! నాటో దళాలు దీన్ని కాన్యాన్‌గా పిలిచే పొసెయ్‌డాన్‌ను టోర్పెడో, డ్రోన్ రెండింటి క్రాస్ బ్రీడ్‌గా చెప్పవచ్చు. తొలి జత పొసెయ్‌డాన్ టోర్పెడోలను విజయవంతంగా ఉత్పత్తి చేసినట్టు గత జనవరిలో రష్యా స్వయంగా ప్రకటించింది. వీటిని బెల్ గొరోడ్ అణు జలాంతర్గామిలో మోహరిస్తామని పేర్కొంది. అయితే పొసెయ్‌డాన్ తయారీ గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ 2018లోనే ప్రకటన చేశారు. ''దీని రేంజ్ అపరిమితం. అంతేగాక సముద్రాల్లో అత్యంత అట్టడుగుల్లోకీ వెళ్లి దాడులు చేయగల సత్తా దీని సొంతం. పైగా ప్రస్తుతమున్న అన్ని టోర్పెడోల కంటే కొన్ని రెట్లు ఎక్కువ వేగంతో, అదే సమయంలో ఏమాత్రం శబ్దం చేయకుండా దూసుకెళ్తుంది. తననుతానుగా ప్రమాదాన్ని గుర్తించి ప్రయాణ మార్గాన్ని మార్చేసుకోగలదు. కనుక దీన్ని శత్రువు నాశనం చేయడం దాదాపుగా అసాధ్యం. సముద్రంలో దీన్ని ఎదుర్కొగల ఆయుధమే లేదు''అని ధీమాగా పేర్కొన్నారు. రష్యాతో పాటు చైనా కూడా ఇలాంటివి తయారు చేసే పనిలో ఉందని అమెరికా అనుమానిస్తోంది. అయితే అమెరికా వద్ద ఇలాంటివి ఎప్పటినుంచో ఉన్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు!

➤ స్టేటస్–6 ఓషియానిక్ మల్టీపర్పస్ సిస్టంగా కూడా పిలిచే పొసెయ్‌డాన్ గురించి తెలిసింది చాలా తక్కువ.

➤ దాదాపు ఆరడుగుల వ్యాసార్థం, 24 మీటర్ల పొడవు, 2 లక్షల పౌండ్ల బరువుండే దీన్ని అణు జలాంతర్గామి నుంచి ప్రయోగించవచ్చు.

➤ ఈ డ్రోన్లు ఎంత పెద్దవంటే అంతటి జలాంతర్గామిలో కేవలం ఆరంటే ఆరు మాత్రమే పడతాయట!

➤ ఇది అణు, సంప్రదాయ ఆయుధాలు రెండింటినీ మోసుకెళ్లగలదు.

➤ ఇందులో ఏకంగా ఓ అణు రియాక్టరే ఉంటుంది. దాని సాయంతో ఇది స్వయం చాలితంగా పని చేస్తుంది.

➤ పొసెయ్‌డాన్ శత్రు యుద్ధ నౌకలను, తీర ప్రాంతాల్లోని లక్ష్యాలను నాశనం చేస్తున్నట్టున్న దృశ్యాలతో కూడిన వీడియోలను రష్యా రక్షణ శాఖ విడుదల చేసింది.

➤ అమెరికాలోని దాదాపు అన్ని తీర ప్రాంత నగరాలూ దీని పరిధిలోకి వస్తాయని రష్యా చెబుతోంది!

అణు డ్రోన్‌ను పరీక్షించాం: ఉత్తర కొరియా

భారీ రేడియో ధార్మిక సునామీని పుట్టించగల అణుసామర్థ్యంతో కూడిన అండర్ వాటర్ డ్రోన్ 'హెయిల్'ను విజయవంతంగా పరీక్షించినట్టు ఉత్తర కొరియా ప్రకటించింది! ఈ ఆందోళనకర పరిణామం కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. ''ఈ డ్రోన్‌ను తీరం వద్ద మోహరించవచ్చు. నౌకలపై సముద్రం లోపలికి తీసుకెళ్లీ ప్రయోగించవచ్చు. నీటి లోపల ఇది సృష్టించే పేలుడు దెబ్బకు పుట్టుకొచ్చే రేడియో ధార్మిక సునామీ నౌకాశ్రయాలతో పాటు నడి సముద్రంలో శత్రు యుద్ధ నౌకలను కూడా తుత్తునియలు చేయగలదు''అని ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ చెప్పుకొచ్చింది. ''ఈ దిశగా మూడు రోజులుగా సాగుతున్న ప్రయోగాలను అధ్యక్షుడు కిమ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు'' అని తెలిపింది. టోర్పెడో వంటి పరికరం పక్కన కిమ్ నవ్వుతున్న ఫొటోను ఉత్తరకొరియా పత్రిక రొండొంగ్ సిన్మున్ ప్రచురించింది. ఆ పరికరమేమిటనేది వివరించలేదు. సముద్ర జలాలు ఉవ్వెత్తున లేచి పడుతున్న ఫొటోలను కూడా ముద్రించింది. ''ఈ అలలు డ్రోన్ మోసుకెళ్లిన అణ్వాయుధం పేలుడు ఫలితం. మంగళవారం ప్రయోగించిన ఈ డ్రోన్ నీటి అడుగున 60 గంటల పాటు ప్రయాణించి, 150మీటర్ల లోతులో లక్ష్యాన్ని ఛేదించింది''అని పేర్కొంది. 2012 నుంచి అభివృద్ధి చేస్తున్న ఈ డ్రోన్‌ను గత రెండేళ్లలో 50 సార్లకు పైగా పరీక్షించి చూసినట్టు తెలిపింది. అయితే ఉత్తర కొరియా ప్రకటనలో విశ్వసనీయతపై నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హెయిల్ అంటే కొరియా భాషలో సునామీ. ఈ డ్రోన్ గురించి ఉత్తర కొరియా అధికారికంగా వెల్లడించడం ఇదే తొలిసారి! ఉత్తర కొరియా దుందుడుకు చర్యలకు మూల్యం తప్పదంటూ దక్షిణ కొరియా అధ్యక్షుడు హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఈ పరీక్ష గురించిన ప్రకటన వెలువడింది!

కొరియా సముద్ర జలాల్లో విమానవాహక నౌకలను మోహరిస్తామని అమెరికా ప్రకటించడం తెలిసిందే.

అనర్హత వేటు పడ్డ నేతలు...!

న్యూఢిల్లీ: ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951, సెక్షన్ 8(3) ప్రకారం ఏదైనా క్రిమినల్ కేసులో దోషిగా తేలి, రెండేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష పడితే చట్టసభ సభ్యులు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. మోదీ ఇంటి పేరుని కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో గతంలో ఎవరెవరికి శిక్ష పడి ఎంపీ, ఎమ్మెల్యే పదవుల్ని పోగొట్టుకున్నారో చూద్దాం.

లాలూ ప్రసాద్ యాదవ్: దాణా కుంభకోణం కేసులో సెప్టెంబర్ 2013లో దోషిగా తేలిన ఆర్జేడీ అధినేత పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. బిహార్‌లోని సారన్ నియోజకవర్గం ఎంపీగా ఉన్న ఆయన పదవి పోగొట్టుకొని జైలు పాలయ్యారు. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు.

జె.జయలలిత: ఏఐఏడీఎంకే దివంగత నాయకురాలు జె.జయలలిత కూడా జైలు శిక్ష పడిన కారణంగా అనర్హతకు గురయ్యారు. అక్రమాస్తుల కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడడంతో తమిళనాడు అసెంబ్లీ సెప్టెంబర్ 2014లో ఆమె శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఆమె పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 2015లో కర్ణాటక హైకోర్టు జయలలితను నిర్దోషిగా ప్రకటించడంతో ఆమె తిరిగి సీఎం పదవి దక్కించుకున్నారు.

పి.పి. మహమ్మద్ ఫైజల్: హత్యాయత్నం కేసులో లక్షద్వీప్‌లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ పి.పి.మహమ్మద్ ఫైజల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. అనంతరం జైలుశిక్షపై స్టే నేపథ్యంలో లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాల్సి ఉంది.

ఆజమ్‌ఖాన్: విద్వేషపూరిత ప్రసంగాల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఆజమ్‌ఖాన్‌పై 2022 అక్టోబర్‌లో ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడింది.

అనిల్ కుమార్ సాహ్ని: రాజ్యసభ ఎంపీగా ఉండగా విమాన ప్రయాణాలు చేయకుండానే తప్పుడు టిక్కెట్లు సమర్పించి రూ.23.71 లక్షలు క్లెయిమ్ చేసుకున్న కేసులో బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ సాహ్నికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. శిక్ష పడిన సమయంలో అసెంబ్లీ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

విక్రమ్ సింగ్ సైని: 2013 నాటి ముజాఫర్‌నగర్ ఘర్షణల కేసులో దోషిగా తేలి రెండేళ్ల శిక్ష పడిన ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సింగ్ సైని 2022 అక్టోబర్‌లో అనర్హతని ఎదుర్కొన్నారు.

ప్రదీప్ చౌధరి: హర్యానాలోని కాల్కా నియోజవకర్గం ఎమ్మెల్యే ప్రదీప్ చౌధరికి దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో 2021జనవరిలో హర్యానా అసెంబ్లీ ఎమ్మెల్యేగా ఆయనపై అనర్హత వేటు పడింది.

కులదీప్ సింగ్ సెంగార్: ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగార్ అత్యాచారం కేసులో దోషిగా తేలడంతో 2020 ఫిబ్రవరిలో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

అబ్దుల్లా ఆజమ్‌ఖాన్: 15 ఏళ్ల క్రితం నాటి ధర్నా కేసులో రెండేళ్ల పాటు శిక్ష పడిన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజమ్ ఖాన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో యూపీ ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడింది.

అనంత్ సింగ్: బిహార్‌లోని ఆర్జేడీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ నివాసంలో మారణాయుధాలు లభ్యమైన కేసులో ఆయన దోషిగా తేలడంతో 2022 జులైలో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

ఏసీబీ వలలో డీఈఓ రాజేశ్

- స్కూల్‌కు ఎన్‌ఓసీ కోసం లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన డీఈవో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ
- సంగారెడ్డి డీఈఓ ఆదేశాల మేరకే లంచం తీసుకున్నట్టు వెల్లడి
- ఇద్దరిపై కేసులు నమోదు చేసిన ఏసీబీ


డీఈఓ రాజేశ్


సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ

కొండాపూర్(సంగారెడ్డి): ఓ పాఠశాలకు ఎన్‌ఓసీ విషయంలో సంగారెడ్డి డీఈఓ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. డీఈఓ రాజేశ్ ఆదేశాల మేరకే తాను లంచం తీసుకున్నట్లు రామకృష్ణ చెప్పుకొచ్చాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కథనం ప్రకారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. రాంచంద్రాపురం మండలంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు తమ స్కూల్‌కు సంబంధించి సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ నుంచి ఐసీఎస్‌ఈ (ఇండియన్ సర్టిఫికెట్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్)కు మార్చేందుకు ఎన్‌ఓసీ ఇవ్వాలని డీఈఓను సంప్రదించారు. ఇందుకు రాజేశ్ తన సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ద్వారా రూ.1,10,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఒకేసారి ఇవ్వలే మని చెప్పడంతో ముందుగా రూ.52,000 ఇవ్వాలని అడిగారు. అన్ని పేపర్లు సక్రమంగా ఉన్నా ఎందుకు లంచం ఇవ్వాలని భావించి నేరుగా ఈ నెల 15న ఏసీబీ కార్యాలయంలో సంప్రదించారు. ఏసీబీ వర్గాల సూచన మేరకు ముందస్తుగా అనుకున్న ప్రకారం శుక్రవారం పాఠశాల యాజమాన్యం డబ్బులను ఇచ్చేందుకు డీఈఓ కార్యాలయానికి వచ్చింది. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయంపై రామకృష్ణను విచారించగా డీఈఓ ఆదేశాల మేరకు డబ్బు డిమాండ్ చేసినట్టు నేరం అంగీకరించా రని ఏసీబీ డీఎస్పీ వివరించారు. కేసులో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణతో పాటు డీఈఓ రాజేశ్‌ను కూడా నిందితులుగా చేర్చామని తెలిపారు.

నిజామాబాద్‌లోనూ అదే ట్రాక్ రికార్డు

నిజామాబాద్ అర్బన్: సంగారెడ్డి డీఈవో నాంపల్లి రాజేశ్ ఏసీబీకి చిక్కడం నిజామాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో రెండేళ్ల పాటు ఇక్కడ డీఈవోగా పనిచేసిన రాజేశ్ లెక్కకు మించి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఉపాధ్యాయ సంఘాలతోపాటు అభ్యర్థులే నేరుగా ఫిర్యాదులు చేశారు. దీనిపై అప్పటి జేడీ సత్యనారాయణ రాజేశ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇచ్చారు. దీంతో ఆయనకి పదోన్నతి నిలిచిపోయింది. జిల్లానుంచి బదిలీపై వెళ్లిన తర్వాత కూడా విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాసచారి ఇక్కడికి వచ్చి ఫిర్యాదులపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఇలా విచారణ సమయంలోనే తాజాగా ఏసీబీకి పట్టుబడడం చర్చనీయాంశమైంది.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

సారంగాపూర్ (జగిత్యాల): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మిని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రేచపల్లి తురకకాశీకాలనీలో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులు వెచ్చించి కాంట్రాక్టర్ ఎడమల లక్ష్మారెడ్డి సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు పనులు పూర్తికావడంతో ఈజీఎస్ ద్వారా గ్రామపంచాయతీ ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ఈ సొమ్ముకు సంబంధించిన చెక్కుపై సర్పంచ్ ఎడమల జయ సంతకం చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి సంతకం చేయాల్సి ఉంది. తనకు రూ.10వేలు లంచమిస్తేనే చెక్కుపై సంతకం చేస్తానని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారు. చేసేదిలేక కాంట్రాక్టర్ లక్ష్మారెడ్డి.. ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారిసూచన మేరకు శుక్రవారం రూ.10వేలను విజయలక్ష్మికి పంచాయతీ కార్యాలయంలో ఇస్తుండగా అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయంపై బాధితురాలు మాట్లాడుతూ, తనను బదిలీ చేయించేందుకు కుట్ర పన్ని కేసులో ఇరికించారని ఆవేదన చెందారు.

టికెట్ల ఆదాయం రూ. 5 వేల కోట్లపైనే

2019లోని రూ. 4 వేల కోట్ల రికార్డు బ్రేక్

- దక్షిణ మధ్య రైల్వేకు కాసులు కురిపిస్తున్న రైళ్లు
- దేశంలో 18 జోన్లకు గానూ ఐదో స్థానంలో సౌత్ సెంట్రల్ రైల్వే

సాక్షి, హైదరాబాద్: సరుకు రవాణా రూపంలో భారీగా ఆదాయాన్ని పొందుతూ దేశంలోని రైల్వే జోన్‌లలో కీలకంగా అవతరించిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా ప్యాసింజర్ రైళ్ల ద్వారా కూడా భారీ మొత్తంలో ఆదాయాన్ని నమోదు చేసింది. టికెట్ల అమ్మకం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో వారం రోజులు మిగిలి ఉండగానే రూ.5 వేల కోట్ల మార్కును అందుకుంది. ఇప్పటివరకు దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఇదే అతి పెద్ద ఆదాయంగా రికార్డుకెక్కింది. గురువారం నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5,000.81 కోట్లుగా నమోదైంది. ఇప్పటివరకు ఆదాయం గరిష్ఠ మొత్తంగా రూ.2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.4,119.44 కోట్లు. ఆ రికార్డును ఇప్పుడు బ్రేక్ చేస్తూ తొలిసారి రూ.5 వేల కోట్లను దాటింది. మార్చి చివరి నాటికి ఈ మొత్తం మరింత పెరగనుంది. ఈసారి దేశవ్యాప్తంగా చాలా జోన్లు టికెట్ల రూపంలో మంచి ఆదాయాలను సొంతం చేసుకున్నాయి. 18 జోన్లకు గానూ దక్షిణ మధ్య రైల్వే ఆదాయం విషయంలో ఐదో స్థానంలో నిలిచింది.

కోవిడ్ తర్వాత ఇటీవలే పూర్తిస్థాయిలో..

కోవిడ్ లాక్‌డౌన్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం వరకు చాలా రైళ్లు పార్కింగ్ యార్డులకే పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే పూర్తిస్థాయి రైళ్లను నడుపుతున్నారు. కోవిడ్ తర్వాత తిరిగి 100 శాతం రైళ్లను నడిపిన తొలి జోన్‌గా దక్షిణ మధ్య రైల్వేనే నిలిచింది. గతంలో ఎన్నడూ లేనట్టుగా పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో అదనపు రైళ్లు, ఉన్న రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే బిజీగా ఉంటోంది. ఇటీవల పలు రైళ్లకు అదనంగా ఏర్పాటు చేసిన వాటిల్లో 200 కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన నడుపుతున్నారు. ఇక రద్దీ ఎక్కువగా ఉన్న సమయాలకు సంబంధించి రోజువారీ ప్రాతిపదికన 10,539 కోచ్‌లను తాత్కాలికంగా నిర్వహించారు. వీటి రూపంలో 9,83,559 మంది అదనంగా బెర్తులు పొందగలిగినట్టు అధికారులు తెలిపారు. ఈ అదనపు ప్రయాణికుల ద్వారానే రూ. 81 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో 3,543 ప్రత్యేక రైళ్లను నడిపారు. వీటి ద్వారా 30.42 లక్షల మంది అదనంగా ప్రయాణించారు. వీరి ద్వారా రూ.219 కోట్లు అదనంగా సమకూరాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆక్యుపెన్సీ రేషియో 123 శాతం

ఈ సంవత్సరం సికింద్రాబాద్-విశాఖ మధ్య దేశంలో ఎనిమిదో వందే భారత్ రైలును, కాచిగూడ-మెదక్, అకోలా-అకోట్, బీదర్-కలబురగి మధ్య కొత్త రైళ్లు ప్రారంభమయ్యాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం 8 జతల రైళ్లకు కొత్తగా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రారంభించారు. వీటిల్లో ప్రయాణికుల సామర్థ్యం ఎక్కువ కావటం వల్ల కూడా వారి సంఖ్య పెరిగింది. వెరసి ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆక్యుపెన్సీ రేషియో 123 శాతానికి చేరుకోవటం విశేషం. చమురు ధరలు విపరీతంగా పెరగటంతో సొంత వాహనాలను పక్కన పెట్టి ప్రజా రవాణాపై చాలా మంది దృష్టి సారిస్తున్నారు. దూరప్రాంతాలకు రైళ్లలో వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ అన్ని కారణాలతో ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆదాయం నమోదైందని తెలుస్తోంది.


భూమిపూజ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

బాసర ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

భూమిపూజ చేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. సరస్వతి అమ్మవారి గర్భాలయ పునర్నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే రూ.8 కోట్ల వ్యయంతో ఆలయ పరిసరాల్లో విశ్రాంతి భవనాలు, ఇతర పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రూ.22 కోట్లతో ప్రస్తుతం ఉన్న గర్భాలయాన్ని కృష్ణశిలలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ సిబ్బంది, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులను ఆపేయాలి

దాడులను నిరసిస్తూ రేపు బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: దండకారణ్యంలోని ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులను ఆపేయాలని, మధ్య భారతంలో మోహరించిన భారీ సాయుధ బలగాలను ఉపసంహరించాలని పౌరహక్కుల సంఘం (సీఎల్‌సీ)-తెలంగాణ ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ (సీడీఆర్‌వో) డిమాండ్ చేసింది. దీన్ని నిలువరించడానికి దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందని, ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధాన్ని నిరసిస్తూ ఈనెల 26న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సీఎల్‌సీ-సీడీఆర్‌వో నేతలు హరగోపాల్, లక్ష్మణ్ గడ్డం, గుంటి రవి, ఎన్.నారాయణరావు, సురేశ్‌కుమార్, జాబాలి, పీఎం రాజు, విష్ణువర్ధన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీల జీవించే హక్కుకై ఉద్యమించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. దండకారణ్యంలో గ్రేహౌండ్స్ అనేక సార్లు బాంబు దాడులు చేశాయని ఆరోపించారు. ఇవన్నీ ప్రజలకు తెలియజేసేందుకే ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. దేశ ప్రజలనే శత్రుదేశ ప్రజలుగా భావిస్తూ ప్రస్తుతం యుద్ధ హెలికాప్టర్లతో సామూహిక హత్యాకాండలు చేసేలా పాలన కొనసాగుతోందని విమర్శించారు. దీన్ని ప్రజాస్వామికవాదులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల కోసం ఏర్పడిన పెసా చట్టం, గ్రామ సభ తీర్మానం ఐదో షెడ్యూల్ వంటివి అమలు కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

దర్గాలో రామనామం

- వైభవంగా పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠ
- భద్రాద్రి జిల్లాలో మతసామరస్యం చాటుతున్న నాగుల్‌మీరా దర్గా


హోమం నిర్వహిస్తున్న వివిధ మతాలకు చెందిన దంపతులు

ఇల్లెందు రూరల్: అల్లాకు ప్రార్థనలు చేసే ఓ దర్గా ప్రాంగణంలో రామ నామం మార్మోగింది. దీనికి భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సత్యనారాయణపురం గ్రామంలోని హజరత్ నాగుల్ మీరా మౌలాచాన్ దర్గా వేదికగా మారింది. శ్రీరామ నవమి సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ దర్గాలో సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వేడుకలను మరింత కనులపండువగా నిర్వహించేందుకు దర్గా ప్రతినిధులు 80 కిలోల వెండితో ప్రత్యేకంగా లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమ సమేత సీతారాముల విగ్రహాలను తయారు చేయించారు. శుక్రవారం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు దర్గాహ్ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన ఆరాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం, ధాన్యాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాల తర్వాత వైభవంగా హోమం జరిపించారు. ఇందులో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, దర్గాహ్ కమిటీ ప్రతినిధులైన పలువురు ముస్లింలు కుటుంబసమేతంగా హాజరై సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషం.

క్లుప్తంగా

క్వింటాల్‌ పత్తి ధర రూ. 7,500



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. గురువారం క్వింటాల్‌ పత్తికి రూ.7,400 కాగా శుక్రవారం గరిష్టంగా క్వింటాల్‌కు ధర రూ.7,500 పలికింది. మార్కెట్‌కు 115 వాహనాల్లో 1922 క్వింటాల్‌ పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా మోడల్‌ ధర రూ. 7,350, కనిష్ట ధర రూ. 6,700 ఉంది. గన్నీ సంచుల్లో 25మంది రైతులు 36 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,100, మోడల్‌ ధర రూ. 6,500, కనిష్ట ధర రూ.6.వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా శని, ఆదివారాలు మార్కెట్‌ యార్డుకు సాధారణ సెలవులు ఉంటాయని, సోమవారం మార్కెట్‌ యార్డులో కొనుగోళ్లు యథావిధిగా ఉంటాయని కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్‌ తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా సంక్షేమాధికారి సబిత



కరీంనగర్‌ : సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలని జిల్లా సంక్షేమ అధికారి కే. సబితాకుమారి అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక షెడ్యూల్‌ కులాల కళాశాల వసతి గృహ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలు రోజు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలన్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు వంటివి ఆహారంలో భాగంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, అడ్వకేట్‌ హేమలత, సఖి కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్‌ లక్ష్మి, పోషణ్‌ అభియాన్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ నాగరాజు, రోమీల, హాస్టల్‌ వార్డెన్‌ ఫర్వీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌ 25 నుంచి ఓపెన్‌ ఎస్సెస్సీ, ఇంటర్‌ పరీక్షలు

కరీంనగర్‌ : ఓపెన్‌ టెన్త్‌, ఇంటర్మీడియట్‌ పరీక్షలు ఏప్రిల్‌ 25 నుంచి మే4 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌ వీఎస్‌ జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్‌స్కూల్‌ కో ఆర్డినేటర్‌ చలువాజీ నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయయని తెలిపారు. సప్లిమెంటరీ అభ్యర్థులు అభ్యాసన కేంద్రాల కో ఆర్డినేటర్స్‌ను సంప్రదించి హాల్‌టికెట్లు పొంది పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఇంటర్మీడియెట్‌ ప్రాక్టికల్స్‌ మే 12 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇలా చదివితే విజయం మీ సొంతం..

- 10 జీపీఏ సాధించేందుకు ఇవీ సూత్రాలు
- ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు..
- విద్యార్థులకు నిపుణుల సూచనలు



సప్తగిరి కాలనీ (కరీంనగర్‌) : పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నాయి. సమయం వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదివితేనే లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఏప్రిల్‌ 3 నుంచి జరిగే వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఆత్మవిశ్వాసంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఆరు సబ్జెక్టులకు సంబంధించిన విషయ నిపుణులు తమ సలహాలు సూచనలు అందజేశారు. పదిలో 10 జీపీఏ సాధించేందుకు పది సూత్రాలు పాటిస్తే విజయం సాధించొచ్చని సూచిస్తున్నారు. పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం సాక్షి ప్రత్యేక కథనం..

ఇంగ్లిష్‌..

– చెరుకు ప్రద్యుమ్న కుమార్‌, పదో తరగతి పాఠ్య పుస్తక రచయిత



ప్రశ్నపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. పాఠ్య పుస్తకంలో అన్ని యూనిట్లలో ఏబీసీ రీడింగ్‌ ప్యాసేజ్‌లు, పద్యాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. పుస్తకంలో ఉన్న అన్ని పదాలకు అర్థాలు తెలుసుకోవాలి. ఆబ్జెక్టివ్‌ టైప్‌ ప్రశ్నలకు గత పబ్లిక్‌ ప్రశ్న పత్రాల్లో ఇచ్చిన ప్రశ్నలను జాగ్రత్తగా గమనించాలి. అన్‌సీన్‌ ప్యాసేజ్‌, అన్‌సీన్‌ పద్యాలపై వచ్చే ప్రశ్నలకు సమాధానాలు టెక్ట్స్‌లో ఉంటాయి. తెలియని పదాల అర్థాల గురించి కంగారు పడకుండా ప్యాసేజ్‌, పద్యాల్లోనే క్లూలు గ్రహించాలి.

గణితం...

– రాచకొండ దేవదాస్‌, గణిత సబ్జెక్టు విషయ నిపుణులు



గత సంవత్సరం 70 శాతం సిలబస్‌, 50 శాతం చాయిస్‌తో జరిగిన పరీక్షలకు ఈవిద్యా సంవత్సరానికి సంబంధించి గణిత పరీక్షకు వ్యత్యాసం ఉంది. పార్ట్‌ ఏ 60 మార్కులు, పార్ట్‌ బి 20 మార్కులకు ఉంటాయి. పదిలో జీపీఏ సాధించాలంటే 3, 4, 14 చాప్టర్ల నుంచి గ్రాఫ్‌ ప్రశ్నలు, అలాగే 8, 9 చాప్టర్లలోని నిర్మాణాలు, 14 చాప్టర్‌ లోని సగటు మధ్యగతం బహుళకం సమస్యలు, త్రికోణమితిలోని 11.4 అలాగే 5, 6, 10 చాప్టర్లపై దృష్టిసారించాలి.

తెలుగు..

– గాజుల రవీందర్‌, పదో తరగతి పాఠ్య పుస్తక రచయిత



తెలుగు పేపర్‌లో కొన్ని మార్పులు చేశారు. అవగాహన ప్రతిస్పందన విభాగం కింద 20 మార్కులు కేటాయించారు. ఐదు ప్రశ్నలు ఇచ్చి ఒక్కోదానికి ఒక్కో మార్కుచొప్పున ఐదు మార్కులు కేటాయిస్తారు. పరిచిత పద్యం కింద పాఠ్యపుస్తకంలోని పద్య భాగంలో ఉన్న చుక్కబెట్టిన పద్యాలను అడుగుతారు. ఈ పద్యాలు రెండు ఇస్తే ఒకటి రాయాలి. రెండవ విభాగంలో స్వీయరచన, సృజనాత్మకత అంశాలకు 40 మార్కులు ఉంటాయి. దీనిలో స్వీయ రచనకు 33, సృజనాత్మకతకు 7 మార్కులుంటాయి.

హిందీ ...

– ఎండీ ఉమర్‌ అలీ, పదో తరగతి పాఠ్య పుస్తక రచయిత



హిందీలో ముఖ్యంగా స్వీయరచన, సృజనాత్మకత అంశాలపై దృష్టిసారించాలి. మొదటిబిట్టులో పరిచిత, అపరిచిత గద్యం, పరిచిత పద్య భాగముల నుంచి 5 ప్రశ్నలు ఇస్తారు. వీటికి 1–15 వరకు ప్రశ్న సంఖ్య కేటాయిస్తారు. వ్యాసరూప సమాధానాలు 2,3 పేరాల్లో విభజించి రాస్తే బాగుంటుంది. కవి పరిచయం పేరా రూపంలో రాయాలి. కవి, జన్మస్థలం, తల్లిదండ్రుల పేర్లు, తదితర అంశాలను క్రమంలో రాయాలి.

భౌతిక, రసాయన శాస్త్రం..

– చాడ జైపాల్‌ రెడ్డి, జిల్లా సైన్స్‌ అధికారి, కరీంనగర్‌



భౌతిక రసాయన శాస్త్రంలో పార్ట్‌ ఏ కు 30 మార్కులు పార్టు బి కి 10 మార్కులు ఉంటాయి. పార్ట్‌ ఏ లో మూడు సెక్షన్లు ఉంటాయి, సెక్షన్‌ వన్‌ లో మూడు ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఒక్కొక్క ప్రశ్నకు రెండు మార్కులు. సెక్షన్‌ 2 లో మూడు ప్రశ్నలు, సెక్షన్‌ 3 లో మూడు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు ప్రయోగాలకు సంబంధించిన అన్ని అంశాలను చూసి సమాధానాలు రాయొచ్చు.

జీవశాస్త్రం...

– కె ఎస్‌ అనంతాచార్య, బయోసైన్స్‌ రిసోర్స్‌ పర్సన్‌



జీవశాస్త్రంలోని భావనలను పూర్తిగా అర్థం చేసుకోవాలి. అన్ని పాఠాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒకటో విద్యా ప్రమాణం. దీనికింద ఉదాహరణలు, భేదాలు, కారణాలు, పోలికలు, విశ్లేషణాలుంటాయి. 2వ విద్యాప్రమాణం. పరికల్పనలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. 3వ విద్యా ప్రమాణం కింద ప్రయోగాలకు సంబంధించిన అంశాల్లో పరికరాలు, రసాయన పదార్థాలు ప్రయోగవిధానం, పరిశీలనలు, ఫలితాలకు సంబంధించినవి ఉంటాయి.

సాంఘిక శాస్త్రం

– ఆరెల్లి కుమార స్వామి, సోషల్‌ సబ్జెక్టు విషయ నిపుణులు



సమాచార నైపుణ్యం ఈ విద్యా ప్రమాణానికి 12 మార్కులు, పటనైపుణ్యం ఈ విభాగానికి 12 మార్కులను కేటాయించారు. వీటి కింద పటాలు గీయడం, చదవడం, ప్రదేశాలను గుర్తించడంపై ప్రశ్నలు అడుగుతారు. ప్రశంసా సున్నితత్వం ఈ ప్రమాణం కింద 6 మార్కులు కేటాయించారు. వీటి కింద లేఖలు, నినాదాలు, కర పత్రాలు వ్యక్తుల యొక్క గుణగణాల మీద ప్రశ్నలు ఉంటాయి.

గ్రూప్‌- 1 పరీక్షకు ఉచిత శిక్షణ

కరీంనగర్‌ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్‌ ద్వారా గ్రూప్‌–1 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్‌ బీసీ స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ డా.ఎం.రవికుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ అభ్యర్థులు ఈ 25 నంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలని, ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం, బీసీ స్టడీ సర్కిల్‌లో ఇంతకు ముందు శిక్షణ పొందిన వారు ఈ ఉచిత శిక్షణకు అర్హులు కాదని తెలిపారు. టెన్త్‌, ఇంటర్‌, డిగ్రీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గలవారు వివరాలకు 0878 – 2268686, కరీంనగర్‌ బీసీ స్టడీ సర్కిల్‌ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న బీజేపీ

కరీంనగర్‌ : అధికారాన్ని అడ్డుపెట్టుకొని మోడీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని అవలంబిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ దుయ్యబట్టారు. ప్రశ్నించే గొంతుకలను అడ్డుకొని రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థల అండతో దురహంకారంగా ప్రవర్తిస్తూ దేశంలో ప్రతిపక్షాల గొంతునొక్కుతుందన్నారు. త్వరలోనే ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కాలువలో పడి యువకుడి మృతి



శ్రీకాంత్‌ (ఫైల్‌)

పెద్దపల్లి రూరల్‌: బైక్‌ అదుపుతప్పి ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన మెట్టు శ్రీకాంత్‌ (30) మృతిచెందాడు. ఎస్సై రాజేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్‌ ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి పెద్దకల్వలకు వెళ్తున్నాడు. గ్రామశివారులో మలుపువద్ద బైక్‌ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బీఆర్‌ఎస్‌ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య



మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య



హాజరైన కార్యకర్తలు

గంగాధర: అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్‌ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ పేర్కొన్నారు. మండలంలోని మంగపేట గ్రామంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ఆత్మీయ సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో బస్వరాజు సారయ్యతో పాటు, జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ విషయంలో ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు, నాయకులు, కార్యకర్తల కృషితో బీఆర్‌ఎస్‌ పార్టీ ఎదురులేని శక్తిగా ఎదిగిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం, చెరువులు, కుంటల మరమ్మతు, మిషన్‌ భగీరథ, కల్యాణలక్ష్మీ పథకాలను ప్రభుత్వం వర్తింపజేస్తుందన్నారు. దళితబంధు ద్వారా ఒక్కొక్కరికి రూ.10లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జెడ్పీ చైర్మన్‌ కనుమల్ల విజయ, గ్రంథాలయ చైర్మన్‌ పొన్నం అనిల్‌, ఎంపీపీ శ్రీరాం మధుకర్‌, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించొద్దు

- సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి
- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

చిగురుమామిడి: ప్రజాసమస్యలు పరిష్కరించకుండా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం చిగురుమామిడిలోని ముసుకురాజిరెడ్డి స్మారకభవనంలో సీపీఐ మండల జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెట్టుబడిదారుల కొమ్ముకాసే ప్రభుత్వంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనపై ప్రజావ్యతిరేకతను ప్రజలకు వివరించేందుకు దేశవ్యాప్తంగా బీజేపీ కో హఠావో దేశ్‌కో బచావో అనే నినాదంతో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మండల సీపీఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సీతారాంపూర్‌ సర్పంచ్‌ గోలీ బాపురెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, బోయిని అశోక్‌, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని పటేల్‌, జిల్లా కౌన్సిల్‌ సభ్యులు రాజయ్య, బూడిద సదాశివ, నాయకులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేత



చొప్పదండి: దీన్‌దయాల్‌ పంచాయతీ పురస్కార్‌ను మండలంలోని కొలిమికుంట సర్పంచ్‌ తాళ్లపల్లి సుజాతకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి ప్రవళికను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్‌, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, పాల్గొన్నారు.

వెలిచాల పాలకవర్గ సభ్యులకు..

రామడుగు : పండిట్‌ దీన్‌దయాళ్‌ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కారానికి మండలంలోని వెలిచాల గ్రామ పంచాయతీ 2021–22 సంవత్సరానికి ఎంపికైంది. శుక్రవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ పాలకవర్గ సభ్యులకు అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, ఎంపీడీవో రాజీమ్‌ ఖ్‌త్ర, తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్‌ సిల్క్‌ బోర్డు సభ్యురాలు డాక్టర్‌ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామరూరల్‌: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్‌ సిల్క్‌ బోర్డ్‌ సభ్యురాలు డాక్టర్‌ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్‌ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్‌ సిల్క్‌ బోర్డ్‌ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్‌, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్‌, మంచిర్యాల, వరంగల్‌, హనుమకొండ, కరీంనగర్‌, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్‌ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేలమందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్‌ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని, రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్‌ బోర్డు శాస్త్రవేత్తలు, వినోద్‌ యాదవ్‌, మీనాక్షి, బీటీ శ్రీనివాస్‌, మొగిలి, హార్టికల్చర్‌ అధికారి లత, వివిధ జిల్లాల నుంచి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అటకెక్కినట్టేనా..!

- ఏడాదికి పైగా సహకార బంకుల మూసివేత
- అచేతన స్థితికి విలువైన పరికరాలు..

> ఏడాదికి పైగా పెట్రోల్‌ బంకులు మూతబడి ఉన్నాయి. పెట్టిన పెట్టుబడులకు వడ్డీ తడిసి మోపెడవుతోంది. బంకులను తెరిపించేలా చర్యలు చేపట్టండి.
> – ఇటీవల కేడీసీసీబీ సర్వసభ్య సమావేశంలో ప్యాక్స్‌ ఛైర్మన్లు



హుజూరాబాద్‌ క్రాస్‌రోడ్‌లో మూసి ఉన్న బంకు

కరీంనగర్‌ అర్బన్‌: సహకార సంఘాల బలోపేతం.. రైతుల ప్రయోజనార్థం చేపట్టిన పెట్రోల్‌ బంకుల నిర్వహణ అటకెక్కింది. ప్రభుత్వం వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా పెట్రోల్‌ బంకులను నెలకొల్పిన విషయం తెలిసిందే. వీటి ద్వారా తక్కువ ధరకే పెట్రోల్‌, డీజిల్‌ను రైతులకు అందించేలా ఏర్పాటు చేసింది. 2022 జనవరిలో వచ్చిన మార్పులతో ఆయా బంకులు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. వీటిలో బయటి కంటే ఎక్కువ ధరకు విక్రయించాల్సి రావడంతో అనివార్యంగా మూతబడ్డాయి. జిల్లావ్యాప్తంగా సాధారణంగా కమర్షియల్‌ పెట్రోల్‌ బంకుల్లో కన్నా సొసైటీ (కన్జ్యూమర్‌) బంకుల్లో తక్కువ ధరకు పెట్రోల్‌, డీజిల్‌ విక్రయిస్తుండటంతో వాహనాదారులు ఇక్కడికే క్యూకట్టేవారు. ఆయా సొసైటీల పరిధిలో సభ్యులుగా కొనసాగే రైతులకు తక్కువ ధరకు పెట్రోల్‌ దొరకడంతో ఆర్థిక భారం తప్పేది. గత జనవరి నుంచి సొసైటీ బంకుల్లో ఎక్కువ ధరకు అమ్ముతుండటంతో పరిస్థితి మారింది. దీంతో నష్టాలను చవిచూడాల్సి రావడంతో మూసివేయక తప్పలేదు.

పాడైన పరికరాలు..

సహకార సంఘాల పరిధిలోని పెట్రోల్‌ బంకులు ఏడాదికి పైగా మూసివేసి ఉండటంతో విలువైన పరికరాలు పాడయ్యే స్థితికి చేరాయి. బంకు ఏర్పాటు చేయాలంటే రూ.50 లక్షల పెట్టుబడి అవసరం. స్థల కిరాయి, కార్మికులు, నిర్వహణ ఖర్చులు అదనం. ఈ క్రమంలో ఏడాదికి పైగా మూతబడి ఉండటంతో వందమంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. దీనికి తోడు యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. సొసైటీల పరిధిలో మరిన్ని పెట్రోల్‌ బంకులు ఏర్పాటు చేయాలని ఆయా సంఘాలు నిర్ణయించాయి. స్థలాలను కొనుగోలు చేశాయి. కరీంనగర్‌, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో మరో 10 బంకుల నిర్మాణ పనులు ప్రారంభించాలనుకునే క్రమంలో పెట్రోలియం కంపెనీల నిర్ణయం గుదిబండగా మారింది. దీంతో నిర్మాణ పనులు నిలిపివేశారు.


34 సంఘాల పరిధిలో బంకులు

కేడీసీసీబీ పరిధిలో 34 పెట్రోల్‌ బంకులున్నాయి. కరీంనగర్‌, హుజూరాబాద్‌, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, వేములవాడ, పెద్దపల్లి, మంథని, కోరుట్ల తదితర ప్రాంతాల్లో సహకార సంఘాలు లాభం లేకున్నా పెట్రోల్‌ బంకులను నిర్వహించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారు. పెట్రోలియం సంస్థల పరిధిలోని బంకులకు తక్కువ ధరకు పెట్రోల్‌, డీజిల్‌ సరఫరా చేసి కమీషన్‌ ఇస్తుండటంతో నిర్వహణ ఖర్చు కలిసివచ్చేది. సహకార సంఘాలకు అలా కాకుండా రైతుల కోసం పెద్దమొత్తంలో కొనుగోలు చేయడం వల్ల ఒకటి, రెండు రూపాయలు ఎక్కువ ధరతో విక్రయించినా రైతులకు తక్కువ లాభంతో మార్కెట్‌తో సమానంగా సరఫరా చేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం పెట్రో డీజిల్‌ ధరలు పెంచడంతో పాటు సహకార సంఘాల పరిధిలోని బంకులకు వినియోగదారులు ఇచ్చే ధర కంటే ఎక్కువకు సరఫరా చేస్తున్నారు. నిర్వహణ భారమై భారీగా నష్టపోయే అవకాశముండటంతో బంకులను మూసివేశారు.

అసలేం జరిగిందంటే..

దేశవ్యాప్తంగా మూడు దశాబ్దాల క్రితం కమర్షియల్‌ బంకులతో పాటు 'కన్జ్యూమర్‌ బంకులు' కూడా ప్రారంభమయ్యాయి. కన్జ్యూమర్‌ పరిధిలో కో ఆపరేటివ్‌ సొసైటీలు, సింగరేణి, ఆర్టీసీ, ఫిషరీస్‌ కో ఆపరేటివ్‌ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కంపెనీలతో జరిగే ఒప్పందంలో భాగంగా పెట్రోలు, డీజిల్‌ విక్రయిస్తుంటారు. కమర్షియల్‌ బంకుల్లో కంటే కన్జ్యూమర్‌ బంకుల్లో తక్కువ ధరకు పెట్రోల్‌, డీజిల్‌ లభించడంతో మొదట్లో పెద్దసంఖ్యలో వాహనదారులు ఇక్కడికి వచ్చేవారు. తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో సంఘాలకు కొంతమేర లాభాలు వచ్చాయి. సంఘం పరిధిలోని రైతులు తక్కువ ధరకు పెట్రోల్‌, డీజిల్‌ కొనుగోలు చేయడంతో ఆర్థిక భారం తగ్గింది. అయితే రష్యా ఉక్రెయిన్‌ యుద్ధం నేపథ్యంలో గత జనవరి నుంచి కమర్షియల్‌ బంకులకు తక్కువ ధరకు పెట్రో ఉత్పత్తులను సరఫరా చేస్తూ కన్జ్యూమర్‌ బంకులను పట్టించుకోవడం లేదు. కమర్షియల్‌ బంకులకు రూ.4 సబ్సిడీ, రూ.3 కమీషన్‌ ఇస్తుండగా కన్జ్యూమర్‌ బంకులకు రూ.2 చెల్లిస్తున్నాయి.పైగా మార్కెట్‌ రేటు కంటే పెట్రోల్‌ రూ.26, డీజిల్‌ రూ.17 ఎక్కువగా విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌ రేటులో పెట్రోల్‌, డీజిల్‌ విక్రయిస్తే ఆర్థికంగా నష్టపోయే అవకాశముండటంతో మూసేశారు.

సమస్యను పరిష్కరిస్తాం..



కన్జ్యూమర్‌ బంకుల కోటాలో బంకులను నిర్వహిస్తున్నాం. కమర్షియల్‌ బంకులకు తక్కువ ధరకు ఇంధన రావడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ విషయంలో కేంద్ర మంత్రి అమిత్‌షాతో చర్చించి సమస్యను పరిష్కరిస్తాం.

– కొండూరు రవీందర్‌రావు, టెస్కాబ్‌ ఛైర్మన్‌

రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు బీజేపీ కుట్ర


ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దుకు నిరసనగా నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నేతలు కుట్రపూరితంగా ఒక పథకం ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేశారని ఆరోపించారు. ఆయన ప్రధానమంత్రి కావాలనుకుంటే 15 ఏళ్ల క్రితమే అయ్యేవారని అన్నారు. ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబంపై కక్ష పెంచుకోవడాన్ని ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ నాయక్, లింగంపల్లి బాబు, కుర్ర పోచయ్య, విలాస్ రెడ్డి, దండి రవీందర్, కొరివి అరుణ్ కుమార్, జీడీ రమేశ్, షబానా మహమ్మద్, దన్న సింగ్, ఎండీ.చాంద్, అస్తపురం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఖైదీలకు రంజాన్ ఉపవాస దీక్ష సామగ్రి


సామగ్రి అందిస్తున్న గులాం అహ్మద్ హుస్సేన్, నాయకులు

విద్యానగర్: కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తూ రంజాన్ ఉపవాస దీక్ష పాటించే ముస్లిం ఖైదీలకు అవసరమైన సామగ్రిని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ శుక్రవారం జైలు పర్యవేక్షకుడు సమ్మయ్య, జైలర్ రమేశ్, డిప్యూటీ జైలర్ సుధాకర్ రెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా ఎంఐఎం ఆధ్వర్యంలో ఖైదీలకు ఇఫ్తార్, నమాజ్ ఆచరించేందుకు సామగ్రి, ఖురాన్‌లను అందిస్తున్నామని అన్నారు. నాయకులు అబ్బాస్ సమీ, సయ్యద్ బర్కత్ అలీ, ఖమరుద్దీన్, ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అలీబాబా, అజర్ దబీర్, సాజిద్, అన్నెమల్ల సురేష్, కరీంఖాన్, ఫర్హాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ల లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్: లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం తగదని, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజామిత్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా ఐదు ప్రశ్నపత్రాలు లీకవడం విచారకరమన్నారు. వేలాది రూపాయలు కోచింగ్‌లకు వెచ్చించి, చాలీచాలని డబ్బులతో అద్దె రూముల్లో ఉంటూ అహర్నిశలు శ్రమించి, పరీక్షలు రాసిన అభ్యర్థుల భవిష్యత్ అంధకారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాకుండా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష క్వాలిఫై అయినవారికి పరిహారం చెల్లించాలని కోరారు. రద్దు చేసిన పరీక్షలను వెంటనే నిర్వహించాలన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు శ్రీధర్, రామచంద్రం, లక్ష్మీనారాయణ, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధ్వజారోహణ


ధ్వజారోహణలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ధ్వజారోహణ సేవలు నిర్వహించగా మేయర్ సునీల్‌రావు హాజరయ్యారు. కార్యక్రమంలో చైతన్య యూత్ క్లబ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షౌకత్ అలీ


నియామక పత్రం అందిస్తున్న రామకృష్ణారావు

కరీంనగర్: బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నగర అధ్యక్షుడిగా మీర్ షౌకత్ అలీ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ వాజిద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు శుక్రవారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, బీఆర్ఎస్ టౌన్ యూత్ ప్రెసిడెంట్ కుల్దీప్, నగర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, యూత్ ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు, రైతులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. 2021–22 ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదిక, యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు అవసరమైన కేంద్రాలు, నగునూరు, బావుపేట గ్రామాల్లో ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సొసైటీ ఆదాయ వ్యయాల నివేదికను సీఈవో రమేశ్ చదివి వినిపించారు. సమావేశంలో డైరెక్టర్లు గంట శంకరయ్య, నిమ్మల అంజయ్య, బోనాల నర్సయ్య, లింగయ్య, తిరుమల్, సాయిల్ల మహేందర్, లత, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఆయుష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ


కిట్లు అందిస్తున్న ఆయుష్ సిబ్బంది

కరీంనగర్‌టౌన్: యునాని సీనియర్ వైద్యాధికారి యస్రబ్ సుల్తానా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సప్తగిరి కాలనీ కేజీబీవీ, సవరన్ స్ట్రీట్ బాలికల పాఠశాలల్లో ఆయుష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులకు జ్ఞాపకశక్తి పెరగడానికి, మానసిక ఎదుగుదలకు దోహదపడే మజూన్ పలాసఫీ మందులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ పి.శ్రీలత, బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్, యునాని ఫార్మసిస్ట్ అన్వర్, ఎంఎన్‌వోలు సంజీవరావు, సలీం తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా ‘మన ఊరు–మన బడి’

- పాఠశాలల్లో కొనసా..గుతున్న పనులు
- పలుచోట్ల ప్రారంభమే కాలేదు
- కొత్తపల్లి మండలంలో పరిస్థితి


ప్రహరీ లేని ఆసిఫ్‌నగర్ పాఠశాల

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. కొన్ని దశాబ్దాలుగా సర్కారు బడి విద్యావ్యవస్థను పట్టి పీడిస్తున్న అనేక సమస్యలను పరిష్కరించడానికి ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, హాజరు కొనసాగింపుతోపాటు దశలవారీగా డిజిటల్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి, పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు ఈ పథకాన్ని రూపొందించింది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దేందుకు చేపడుతున్న పనులు కొత్తపల్లి మండలంలో మందకొడిగా సాగుతున్నాయి. కొన్ని స్కూళ్లలో పనులు పూర్తవగా.. మరికొన్ని పాఠశాలల్లో పురోగతిలో ఉన్నాయి. ఆసిఫ్‌నగర్ యూపీఎస్ పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణం, తదితర పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

వచ్చే విద్యాసంవత్సరం వరకైనా పూర్తయ్యేనా?

కొత్తపల్లి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అధిక విద్యార్థులున్న బడుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ‘మన ఊరు–మన బడి’ పథకం కింద ఈ పనులను పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) చేపట్టాల్సి ఉంది. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్ల నిర్వహణ, విద్యుదీకరణ, తాగునీరు, ఫర్నిచర్, రంగులు వేయడం, పెద్ద, చిన్న తరహా మరమ్మతులు చేయడం, గ్రీన్ బోర్డులు, ప్రహరీలు, వంట గదుల నిర్మాణం, శిథిల భవనాల స్థానంలో నూతన గదులు, భోజనశాలలు (ఉన్నత పాఠశాలల్లో మాత్రమే), డిజిటల్ సౌకర్యాలు వంటి పనులు చేపడుతున్నారు. అయితే ఇవి నత్తనడకన సాగుతుండటంతో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం వరకైనా అందుబాటులోకి వస్తాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి.

రూ.87.24 లక్షలతో ప్రహరీల నిర్మాణం

ఆసిఫ్‌నగర్, చింతకుంట, ఎలగందుల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి ఈజీఎస్ కింద ప్రభుత్వం రూ.87.24 లక్షలు మంజూరు చేసింది. ఇందులో ఆసిఫ్‌నగర్ తమిళకాలనీ, చింతకుంట శాంతినగర్ ప్రాథమికోన్నత, చింతకుంట ప్రాథమిక పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.19.80 లక్షలతో ఎలగందుల హైస్కూల్‌లో పనులు కొనసాగుతున్నాయి. కాగా రూ.12.70 లక్షలతో ఆసిఫ్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల, రూ.4.65 లక్షలతో ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

మౌలిక వసతులూ అంతే..

కమాన్‌పూర్, చింతకుంట శాంతినగర్, చింతకుంట, ఆసిఫ్‌నగర్ తమిళకాలనీ, ఆసిఫ్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎలగందుల, ఆసిఫ్‌నగర్, చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. కొన్ని బడుల్లో డైనింగ్ హాల్ పనులు సాగుతుండగా.. ఎలగందులలో ఇంకా ప్రారంభం కాలేదు.

త్వరితగతిన పూర్తి చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ‘మన ఊరు–మన బడి’ పథకంలో అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. కొత్తపల్లి మండలానికి 8 పనులు మంజూరవగా ఐదింటిని పూర్తి చేశాం. ఆసిఫ్‌నగర్ ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూల్ ప్రహరీల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఎలగందుల జెడ్పీ హైస్కూల్ ప్రహరీ పనులు కొనసాగుతున్నాయి. ఆసిఫ్‌నగర్‌లో ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేస్తాం. మౌలిక వసతుల పనులు పురోగతిలో ఉన్నాయి. – ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, కొత్తపల్లి

అన్ని రంగాల్లో నగర అభివృద్ధికి కృషి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు


కంటి వెలుగు శిబిరంలో మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం కృషి చేస్తోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2020–2021, 2021–2022, 2022–2023 ఆర్థిక సంవత్సరాల్లో వివిధ పద్దుల కింద నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.32.8 కోట్లు, పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.36.26 కోట్లు, ముఖ్యమంత్రి హామీ నిధుల నుంచి రూ.28 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.3.27 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.1.45 కోట్లు, ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి రూ.4.75 కోట్లు, అమృత్ నిధుల నుంచి రూ.1.04 కోట్లతోపాటు నగరంలో సమీకృత మార్కెట్లకు సంబంధించి రూ.3.27 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగానే నగరంలో జరుగుతున్న పనులపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారని ఆరోపించారు.

ప్రతీ మనిషికి కంటి చూపే ప్రధానం

ప్రతీ మనిషికి కంటి చూపే ప్రధానమని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరంలో 14వ డివిజన్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. టెలిఫోన్ క్వార్టర్స్ కాలనీ బ్రిలియంట్ స్కూల్‌లో కార్పొరేటర్ దిండిగాల మహేశ్‌తో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు. నగరవ్యాప్తంగా ఇప్పటివరకు 80 వేల మందికి కంటి పరీక్షలు చేసి, అద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయ చట్టం రూపొందించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: వ్యవసాయ కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం సమగ్ర వ్యవసాయ చట్టం రూపొందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని గుంటూరుపల్లిలో సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంపై ఆధారపడిన కార్మికులకు యాంత్రీకరణ కారణంగా పని దొరకడం లేదన్నారు. వ్యవసాయ కూలీల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 26, 27 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సురేందర్‌రెడ్డి, సదానందం, రాజేందర్, తిరుపతి, బాలవ్వ, కొమురవ్వ, ఖైరున్నిసా, లలిత తదితరులు పాల్గొన్నారు.

వాల్యూస్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ: ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వాల్యూస్ ఒలింపియాడ్ పోటీ పరీక్షలో కరీంనగర్‌లోని సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. సీహెచ్.సాయి గుణదీప్ జిల్లాస్థాయిలో మొదటిస్థానంలో నిలిచి, సైకిల్‌ను బహుమతిగా పొందగా, ఎస్.ఉజ్వల రూప నాలుగో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

రైల్వే గూడ్స్ షెడ్‌లో ఉచిత వైద్య శిబిరం



కరీంనగర్ అర్బన్: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల సంస్థ కరీంనగర్ రైల్వే గూడ్స్ షెడ్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. కోరమాండల్ రీజినల్ లాజిస్టిక్స్ మేనేజర్ వీవీఎస్.శేషు కుమార్ కంపెనీ సీనియర్ జోనల్ మేనేజర్ సజన్ కుమార్‌తో కలిసి, శిబిరాన్ని ప్రారంభించారు. హమాలీలు, వారి కుటుంబాల శ్రేయస్సు దృష్ట్యా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్యులు దాదాపు 200 మంది హమాలీలు, లారీ డ్రైవర్లకు సాధారణ వైద్య చికిత్స, బ్లడ్ షుగర్ లెవెల్, బీపీ, కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కరీంనగర్ మార్కెటింగ్ అధికారులు శ్రీరాజేశ్, సురేష్ అవాజ్ లిమిటెడ్ మేనేజర్ సురేష్, డీలర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల

కరీంనగర్‌రూరల్: చామనపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ్ పక్వాడలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చేతుల పరిశుభ్రతను వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పౌష్టికాహారం, మిల్లెట్ ఫుడ్‌పై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు గీత, మణెమ్మ, పద్మ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని శ్రీ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ కళాశాల హెచ్అండ్ఎస్ (ఇంగ్లిష్) విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న పి. వీరేందర్‌కుమార్‌కు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలియజేశారు. లైఫ్ టు లాంగ్వేజ్ అండ్ లాంగ్వేజ్ టు లైఫ్ రామచంద్రమౌళి వర్క్స్ ఇన్ ఇంగ్లిష్ ట్రాన్స్లేషన్ అనే అంశంపై పరిశోధనకు పట్టా పొందారని తెలిపారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రపంచంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు విద్యార్థులు, ప్రజలకు ఉపయోగపడే విధంగా మరిన్ని సరికొత్త పరిశోధనలు కూడా చేపట్టాలని సూచించారు. వీరేందర్‌కుమార్‌ని చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్లు డాక్టర్ ఏ. ప్రసాదరాజు, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్. రామనర్సింహారెడ్డి అభినందించారు.

సామాజిక సేవలో ముందుండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సేవలో ముందుండాలని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అన్నారు. కరీంనగర్ మండలంలోని దుర్శేడ్‌లో నిర్వహిస్తున్న ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశం శుక్రవారం జరుపగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వలంటీర్లు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రజలు, ప్రకృతితో మమేకమై జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగుంటపల్లి సర్పంచు వడ్లూరి సంతోష, ఎంపీటీసీ సభ్యురాళ్లు గొల్లె రాజ్యలక్ష్మి, ఎల్కపల్లి స్వరూప, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారులు మనోహరాచారి, నాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని అధ్యయనం చేయాలి

కొత్తపల్లి: ఎన్ఎస్ఎస్, ఎస్సారార్ కళాశాల యూనిట్–3 ఆధ్వర్యంలో చింతకుంటలో శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రారంభోత్సవ సమావేశాన్ని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ వెంకట్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. ఎస్సారార్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవకై నడుం బిగించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.వరప్రసాద్‌ను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి ఎన్ఎస్ఎస్ వారధిలా నిలుస్తుందన్నారు. సర్పంచు మొగిలి మంజుల, ఉప సర్పంచు మంగారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, ఎన్‌సీసీ అధికారి పి.రాజు, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల ప్రజాప్రతినిధులకు సన్మానం


కొత్తపల్లి: ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎంపీపీ శ్రీలత, జెడ్పీటీసీ సభ్యురాలు కరుణ


చెర్లభూత్కూర్ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కొత్తపల్లి: మండలంలో దీన్ దయాళ్ ఉత్తమ పంచాయతీ పురస్కారాలకు ఎంపికైన ఎనిమిది గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులను శుక్రవారం కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల కరుణ మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, నాయకులు పిల్లి మహేశ్, పిట్టల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కార్ కింద ఎంపికైన గ్రామ పంచాయతీలకు బహుమతులు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన తొమ్మిది అంశాల్లో సత్తా చాటిన గ్రామాలను మూడింటి చొప్పున ఎంపిక చేశారు. ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డిలు శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ మోర్చా నాయకులు

కొత్తపల్లి: పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా కొత్తపల్లి మండల అధ్యక్షుడు నలువాల మహేశ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 60 ప్రకారం కార్మికులకు రూ.16,500, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలన్నారు. యాక్ట్ 2/94ను రద్దు చేయాలని, పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో నంబర్ 51ని సవరించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని, పంచాయతీ కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. దళిత బంధు పథకంలో పంచాయతీ సిబ్బందికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడమ సత్యనారాయణ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వ పూర్ణచందర్ రెడ్డి, సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శి పూరం హరిశంకర్, బీజేవైఎం సౌత్ జోన్ అధ్యక్షుడు శ్రీమంతుల అక్షయ్, కొత్తపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లు అందించిన అధికారి వెంకట్‌రాంబాబు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చేగుర్తిలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ఎన్‌వైకే జిల్లా యువజన అధికారి వెంకట్‌రాంబాబు సర్టిఫికెట్లు అందించారు. గతేడాది డిసెంబర్ 20 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు 25 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌వైకే ప్రోగ్రాం అధికారి బి.రవీందర్, శిక్షకురాలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కీర్తి పురస్కారాలకు ఎంపిక

కరీంనగర్ కల్చరల్: తెలుగు సాహిత్యంలోని పలు ప్రక్రియల్లో సేవలందించిన రాష్ట్రంలోని 44 మందికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023 సంవత్సరానికి గాను కీర్తి పురస్కారాలను ప్రకటించింది. వీరిలో జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేసినట్లు వర్సిటీ ఆచార్యుడు తంగెడ కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సినీ విమర్శకుడు వారాల ఆనంద్, పద్య రచన పండితుడు జీవీ కృష్ణమూర్తి, విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి డాక్టర్ ముదుగంటి సుధాకర్ రెడ్డిలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పురస్కారం కింద రూ.5,116లను ఈ నెల 28, 29 తేదీల్లో అందించనున్నట్లు తెలిపారు.

అది దొంగల రాజ్యం...

ఆధారాలతో చంద్రబాబు మరో భారీ దోపిడీ బట్టబయలు
శాసనసభలో సీఎం వైఎస్ జగన్ వెల్లడి

సాక్షి, అమరావతి : 'అమరావతిలో సచివాలయం, శాసనసభ, న్యాయస్థానం భవన నిర్మాణాల్లో చంద్రబాబు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కాంట్రాక్టు సంస్థలను బెదిరించి మరీ భారీ వసూళ్లు చేశారు. తన మనుషుల ద్వారా బోగస్ కంపెనీలు సృష్టించి సబ్ కాంట్రాక్టుల రూపంలో నిధులు కొల్లగొట్టారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇది మనం చెబుతోంది కాదు. ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో బట్టబయలైన అవినీతి బాగోతం. ఐటీ శాఖ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడించిన వాస్తవం' అని వెల్లడించారు. 'అమరావతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తే ఈ అవినీతి బండారం బయట పడింది. అందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అమరావతి నిర్మాణాల విషయంలో చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన అంశంపై శాసనసభలో శుక్రవారం నిర్వహించిన చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. 'చంద్రబాబు తమను బెదిరించడంతోనే ఆయన చెప్పిన బోగస్ కంపెనీలకు నిధులు మళ్లించామని షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. మరో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి తామే నిధులు వసూలు చేసి, చంద్రబాబుకు అందించామని వెల్లడించారు'ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నిధులను కొల్లగొట్టిన తీరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇలా వివరించారు.


చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు

● ఐటీ దాడులతో వెలుగులోకి..

- మొట్టమొదటగా ఆదాయ పన్ను శాఖ (ఐటీ శాఖ) అధికారులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ నివాసంలో 2019 నవంబర్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడ మొత్తం సమాచారం లభించింది. ఆ తర్వాత 2020 ఫిబ్రవరిలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ నివాసంలో సోదాలు చేశారు. దాంతో మరింత సమాచారం లభించింది.
- ఆదాయ పన్ను శాఖ పరిశోధన విభాగం ఆ మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి ఆదాయ పన్ను అప్రైజల్ రిపోర్ట్‌ను తయారు చేసింది. తాము నిర్వహించిన దాడుల్లో లభించిన ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తులను పిలిపించారు. తాము సేకరించిన ఆధారాలను ఆ వ్యక్తులకు చూపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఆ వాంగ్మూలాలపై వారు సంతకాలు కూడా పెట్టారు. వాటన్నింటి ఆధారంగా ఐటీ అధికారులు చంద్రబాబుకు ఇప్పుడు నోటీసులు పంపారు.

● చంద్రబాబు అవినీతి బాగోతం ఇలా..

- అమరావతిలో నిర్మాణాల కంట్రాక్టుల్లో చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు. అందుకోసం పక్కాగా స్కెచ్ వేశారు. 2019 జనవరి, ఫిబ్రవరిలో చంద్రబాబు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్‌ను పిలిపించుకుని తన పీఏ శ్రీనివాస్‌ను కలవమని చెప్పారు. దాంతో మనోజ్.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ను కలిశారు.
- షాపూర్జీ పల్లోంజీ కంపెనీ కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదారిల్లో టిడ్కో ఇళ్లు, అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణంతో పాటు రాజధానిలో ఇతర నిర్మాణ పనులను కలిపి 2018 నాటికి రూ.8 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్ట్ పనులు చేసింది. అందులో తన కమీషన్లు వసూలు చేసేందుకు బాబు.. శ్రీనివాస్‌ను రంగంలోకి దింపారు. వినయ్ నంగల్లా, విక్కీ జైన్ అనే ఇద్దరిని మనోజ్‌కు శ్రీనివాస్ అటాచ్ చేశారు. వీరిలో వినయ్ నంగల్లా మూడు కంపెనీలు, విక్కీ జైన్ రెండు కంపెనీలు సృష్టించారు. ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇవ్వమన్నారు. వాళ్ల నుంచి తాము డబ్బులు తీసుకుంటామని చంద్రబాబు పీఏ శ్రీనివాస్ మనోజ్‌తో చెప్పారు.
- దాంతో వినయ్ నంగల్లా హయగ్రీవమ్, అన్నై షలాఖా అనే కంపెనీలను మనోజ్‌కు అటాచ్ చేశారు. విక్కీ జైన్.. నయోలిన్, ఎవరెట్ అనే రెండు కంపెనీలను అటాచ్ చేశారు. మనోజ్‌కు వాళ్లెవరో కూడా తెలియదు. తాము ఇలా డబ్బులు ఇవ్వలేమని, కావాలంటే పార్టీకి ఫండ్ ఇస్తామని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ చెప్పింది.
- 2019లో అర్జంటుగా డబ్బులు ఇవ్వాలని తాము చెప్పినట్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మనోజ్‌ను శ్రీనివాస్ బెదిరించారు. ఆ విషయాన్ని మనోజ్ ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా వెల్లడించారు. ఆ వాంగ్మూలం కాపీలు కూడా ఉన్నాయి.
- ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇచ్చిన తర్వాత వాటిని వసూలు చేసి చంద్రబాబుకు అప్పగించే బాధ్యతను ఆర్వీఆర్ రఘు, కృష్ణ, నారాయణ్, శ్రీకాంత్, అనికేత్ బలోటాలకు అప్పగించారు. ఇదీ ఈ మోడస్ ఆఫ్ ఆపరెండీ. ఐటీ అధికారులు ఈ సమాచారాన్ని అంతా ఆ కంపెనీల ప్రతినిధుల నుంచి వాంగ్మూలంగా తీసుకుని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ తయారు చేశారు. దాన్ని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చూపించారు. అదంతా వాస్తవమేనని శ్రీనివాస్ అంగీకరించి సంతకాలు కూడా చేశారు.
- శ్రీనివాస్‌తోపాటు రఘు, మిగిలిన వారిని కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. వాళ్లు కూడా అదంతా వాస్తవమేనని అంగీకరించి సంతకాలు కూడా చేశారని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడిస్తోంది.
- చంద్రబాబుకు దుబాయిలో కూడా రూ.15.14 కోట్లను దినార్ల రూపంలో క్యాష్‌గా ఇచ్చినట్టు ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో మనోజ్ అంగీకరించారు. దాంతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కూడా చంద్రబాబుకు ఇలానే మూడు నెలల్లో రూ.371 కోట్లు అందాయి. ఆ కుంభకోణంలో చంద్రబాబుకు డబ్బులు చేర్చిన యోగేశ్ గుప్తానే ఈ వ్యవహారంలో కూడా ఉన్నారు.

● ఇది రూ.2 వేల కోట్ల దోపిడీ


- ఐటీ అధికారులు విశాఖపట్నం, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై జరిపిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ.రెండు వేల కోట్లు దొరికినట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ 2020 ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో వెల్లడించింది. 40 చోట్ల జరిపిన తనిఖీల్లో బోగస్ సబ్ కాంట్రాక్ట్ కంపెనీలు, ఇన్వాయిస్లు, బిల్లులు ఇతర ఆధారాలు లభించాయని చెప్పింది.
- రెండో దశ దర్యాప్తులో భాగంగా ఐటీ అధికారులు 2022 సెప్టెంబర్ 28న చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. ఈ కేసును డీసీఏసీ–సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో త్వరలో చంద్రబాబును కూడా విచారణకు పిలవనున్నారు.
- మనోజ్ వాసుదేవ్‌కు చంద్రబాబు చెప్పారు. హయగ్రీవా, అన్నై షలాఖా అనే సంస్థలకు రూ.52.50 కోట్లు.. నవోలిన్, ఎవరెట్ కంపెనీలకు రూ.62.90 కోట్లు చొప్పున మనోజ్ చెల్లించారు. చంద్రబాబు ఆదేశాలతో మనోజ్.. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఇప్పించారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు అతుల్ సోని, బాల వెంకటేశ్ ఫినిక్స్ ఇన్‌ఫ్రా, ఫోర్ ట్రేడింగ్, లక్ స్టోన్ అండ్ కో బోగస్ కంపెనీల ఖాతాల్లో రూ.41.90 కోట్లు జమ చేశారు. మొత్తం రూ.157.3 కోట్లు మళ్లించారు.
- ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్వీఆర్ రఘుతోపాటు కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, అనికెత్ బల్డోటాలకు ఈ రూ.157.3 కోట్లు చేరాయి. వారు ఆ నిధులను నేరుగా చంద్రబాబుకు చేర్చారు. ఈ వ్యవహారంలో నారా లోకేశ్ పీఏ రాజేశ్ కిలారి కీలక పాత్ర పోషించారు.

● కోట్ల మళ్లింపునకు కోడ్ భాష

- ఆర్వీఆర్ రఘు వాట్సాప్ చాట్‌లను ఐటీ అధికారులు పరిశీలించగా.. ఈ అక్రమ ఆర్థిక లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మనోజ్ వాసుదేవ్ సన్నిహితుడు యోగేశ్ గుప్తా నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నిధుల మళ్లింపులో కూడా యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. బోగస్ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో ఆయనదే ప్రధాన భూమిక.
- ఈ అక్రమ లావాదేవీలను మనోజ్ కోడ్ భాషలో తన ఈ–మెయిల్ ఐడీకే మెయిల్ చేసుకుని భద్రపరిచినట్టుగా ఐటీ అధికారులు గుర్తించారు. ఎవరెవరికి ఎంతెంత మొత్తం చెల్లించింది కోడ్ భాష 'టన్నుల' రూపంలో పేర్కొన్నట్టుగా పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 3 టన్నులు, ఢిల్లీకి 3 టన్నులు, ముంబాయికి 3.5 టన్నులు.. ఇలా భారీగా నిధులను మళ్లించిన గుట్టును ఐటీ అధికారులు ఛేదించారు.

ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్

- ఇంతకు ముందు కూడా ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్. అప్పటి ప్రభుత్వం కన్నా అప్పుల గ్రోత్ రేటు ఇప్పుడు తక్కువ. ఇదే బడ్జెట్‌తో మన ప్రభుత్వం నేరుగా బటన్ నొక్కి డీబీటీ ద్వారా ప్రతి అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్ల పూర్తికాక ముందే మన ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసింది. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా బటన్ నొక్కిన వెంటనే అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి.
- ఇంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇదే బడ్జెట్. అయినప్పటికీ ఎందుకు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, వారి కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లలేదు? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ స్కీం ఎలా చేశారో మొన్న కూడా చెప్పాం. ఈ రోజు మళ్లీ చెబుతున్నాం. గత ప్రభుత్వం ఎలా ఉండేది.. మనందరి ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఎంత మంచి జరుగుతోందో రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలి.



ఈడీ పట్టుకోదనే కేడీ చంద్రబాబు ధీమా

ఇంతగా ప్రజాధనాన్ని కొల్లగొట్టినా, తనను ఏ ఈడీ కూడా పట్టుకోదనే ఈ కేడీ చంద్రబాబు ధీమా. సీమెన్స్ కేసులో రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు ఈ కేసులో రూ.172.44 కోట్లు దోపిడీ చేసినట్లు ఇప్పటిదాకా తేలింది. అమరావతి పేరిట ఏదో చేస్తున్నానని ప్రజలను మభ్యపెడుతూ ఇక్కడ చేసింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోపిడీ ఆధారాలతో బయటకు వచ్చింది. ఇప్పుడు ప్రజలకు ముఖం ఎలా చూపిస్తావ్ చంద్రబాబూ.. అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణానికి చ.అడుగుకు రూ.12 వేలు చొప్పున దోచి పెట్టారు. బాబు దోపిడీలో దోచుకో పంచుకో తినుకో(డీపీటీ) బ్యాచ్‌లోని రామోజీరావుకూ వాటాలు అందాయి.
– గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

నేడు అడెల్లి మహాపోచమ్మ ఆలయ నిర్మాణానికి శ్రీకారం

- కార్యాలయంలో బాలాలయం ఏర్పాటు

సారంగపూర్: నిర్మల్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అడెల్లి మహా పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శనివారం అంకురార్పణ చేయనున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు ఆధ్వర్యంలో శుక్రవారం బాలాలయం ఏర్పాటు పనులను పూర్తిచేయించారు. ప్రస్తుత కార్యాలయం భవనంలో బాలాలయం ఏర్పాటు చేయించడంతోపాటు భక్తులు ప్రతీ ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అమ్మవారి విగ్రహాన్ని వేదపండితులు, మఠాధిపతుల ప్రత్యేక పూజలు, మంత్రోచ్ఛారణల మధ్య గర్భగుడి నుంచి బాలాలయంలో ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం మళ్లీ అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో పునఃప్రతిష్ఠిస్తామని కమిటీ అధ్యక్షుడు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సుచరిత రాజేశ్వర్ రావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఆలయ ఇన్‌చార్జి ఈవో రవికిషన్, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మాధవరావు, ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.


బాలాలయం(ప్రస్తుత కార్యాలయం భవనం)లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అధికారులు

ఆలయ నిర్మాణానికి రూ.50 లక్షలు

అడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం దేవాదాయ శాఖ కేటాయించిన రూ.50 లక్షలను స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో శుక్రవారం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు అయిటి చందు తెలిపారు. ఈనిధులను ఆలయ నిర్మాణానికి ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 20న జరిగిన టెండర్ కం బహిరంగ వేలం పూర్తిగా దేవాదాయ శాఖ నిబంధనల మేరకే నిర్వహించామని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

- రాహుల్‌గాంధీపై అనర్హత వేటు ప్రజాస్వామ్యానికి చేటు
- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్: బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ సంపదను బడాబాబులకు తాకట్టు పెడుతోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌ల ఎజెండా అమలు చేస్తోందని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. అదానీ, అంబానీలకు లక్షలాది కోట్లను ధారాదత్తం చేస్తూ సామాన్య ప్రజానీకంపై పన్ను విధిస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలైన సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, లాలూప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్, మమతాబెనర్జీ, స్టాలిన్‌లతోపాటు ఇతర నాయకులపై పాత కేసులు తిరగేసి, ఈడీ, సీబీఐ, ఐటీ దాడుల పేరిట బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. తాజాగా ఎంపీ రాహుల్‌గాంధీపై ఓ కేసు విషయంలో అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి చేటన్నారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ సర్కార్, సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితలపై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. జేఏసీ రాష్ట్ర, జిల్లా బాధ్యులు కల్లెపల్లి శంకర్, గజ్జెల ఆనందరావు, సముద్రాల అజయ్, బొంకూరి సురేందర్, బోయిని కొమురయ్య, మీసాల సాయిలు, గొర్రె రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడేది ఆదివాసీలే..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య


పుస్తకం ఆవిష్కరిస్తున్న వీరయ్య

ఉట్నూర్‌రూరల్: అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలే పర్యావరణాన్ని కాపాడేదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. సీపీఎం జన చైతన్యయాత్ర శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చేరుకుంది. స్థానిక రాంజీ గోండ్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ, కార్పొరేట్ విధానాలను అవలంభిస్తుందన్నారు. జన చైతన్య యాత్ర అనేది పార్టీ కోసమో, ఎన్నికల కోసమో కాదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసమని అన్నారు. ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలను పకడ్బందీగా అమలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ ఆదివాసీల ఓట్లతో బీజేపీ ఎంపీగా గెలిచిన సోయం బాపురావు ఆదివాసీలకు, జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. రానున్న రోజుల్లో ఆదివాసీ సమాజంతో పాటు ఈ ప్రాంత ప్రజలు తగిన బుద్ధి చెప్పక తప్పదన్నారు. అంతకు ముందు జన చైతన్య యాత్రకు సంబంధించిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, స్కైలాబ్, ఆశయ్య, జగదీశ్, వెంకటేశ్, నాయకులు సచిన్, కిరణ్, బండి దత్తాత్రి, పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ

భైంసా: అసోంలోని గౌహతిలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో జరుగుతున్న 97వ వార్షిక సమావేశంలో బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ పాల్గొన్నారు. 'ఉన్నత విద్యలో పరివర్తనాత్మక సంస్కరణలు' అనే అంశంపై సదస్సులో వెంకటరమణ మాట్లాడారు. ఉన్నత విద్యావిధానంలో పరివర్తనాత్మక సంస్కరణలు అవసరమని, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు సాంకేతిక, విజ్ఞానశాస్త్రాలపై అభిరుచి, గణితశాస్త్ర సంబంధిత ఆలోచనల సరళిని, నేర్చుకోవడం, ప్రశ్నించడం, పరిష్కరించడం అనే మూడు విషయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యలో వస్తున్న మార్పులను పరిచయం చేసేందుకు యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మేఘాలయ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకునేందుకు చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు.


సమావేశంలో పాల్గొన్న వీసీ వెంకటరమణ

జ్వరాల బారిన 'ఆశ్రమ' విద్యార్థినులు


ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యం కోసం వేచి ఉన్న విద్యార్థినులు

కోటపల్లి: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు జ్వరాలతో అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా జ్వరం, జలుబుతో బాధపడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. జ్వరాల బారిన పడిన విద్యార్థినులు పాఠశాలలోని పార్ట్‌టైం సిబ్బంది సహాయంతో కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు వెళ్తున్నారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత, పారిశుధ్యలోపంతో జ్వరాలు ప్రబలుతున్నట్లు విద్యార్థినులు తెలిపారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో జ్వరాల బారిన పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో ఏఎన్ఎం లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధ్యులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదు

- బాధిత కుటుంబాల్లో ఆత్మస్థైర్యం కల్పించాలి
- 45 శాతం కాదు.. వందశాతం డబ్బులు ఇప్పించాలి
- మావోయిస్టు కోల్‌బెల్ట్ ఏరియా కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని(రామగుండం): ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ బాధిత కాంట్రాక్టు కార్మికులకు డబ్బులు ఇప్పించే బాధ్యత కీలక ప్రజాప్రతినిధి తీసుకోవాలని మావోయిస్టు కోల్‌బెల్ట్ ఏరియా కార్యదర్శి ప్రభాత్ పేరిట విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి, అతడి అనుచరులే ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగ బాగోతానికి కర్మ, కర్త, క్రియ అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 45శాతం కాదని, వందశాతం చెల్లించాల్సిందే పేర్కొన్నారు. ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు తీసుకున్న బ్రోకర్ల పేర్లను బయట పెట్టాలన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లించలేక కార్మికులు ఆత్మహత్యా యత్నాలకు పాల్పడుతున్నారన్నారు. రూ.కోట్లు వసూలు చేయించి ఏమీ తెలియదన్నట్లు నటిస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయ, కార్మిక సంఘాల నాయకులు కూడా కొందరు ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బులు దండుకున్నారని, 90 మంది బ్రోకర్లను 76 మందికి కుదించి అఖిలపక్ష కమిటీ పేరిట డ్రామాలు ఆడించారన్నారు. అనేక ఉద్యమాలకు పురుడుపోసుకున్న కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజలు, కార్మికులు, మహిళలు, యువత నిత్య చైతన్యవంతులనేది గుర్తించకపోవడం పాలకపార్టీ ప్రజాప్రతినిధుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కొంత మంది ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు లంపెయిన్ గ్రూపులను, రౌడీషీటర్లను తయారుచేస్తూ ఈప్రాంతాన్ని శాసించాలని చూస్తున్నారని, వారందరికీ త్వరలోనే తగిన బుద్ధి చెప్తామన్నారు. అవసరమైతే ప్రజాకోర్టులో శిక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకుల కబంధహస్తాల నుంచి కాంట్రాక్టు కార్మికులను కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగాల పేరిట నిండా ముంచినవారిని ఎవరినీ వదిలిపెటమని హెచ్చరించారు. అఖిలపక్ష కమిటీ నాయకులు ఇప్పించిన చెక్కులు చెల్లక బాధిత కుటుంబాలు అరిగోస పడుతున్నాయన్నారు. మావోయిస్టు పార్టీ, సింగరేణి కార్మిక సమాఖ్యను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్న ప్రజలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

సిరిసిల్ల చైతన్యం స్ఫూర్తినిచ్చే సాహిత్యం

- కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్
- సిరిసిల్లలో జాతీయ సాహిత్య సదస్సు

సిరిసిల్లకల్చరల్: మొదటి నుంచి సిరిసిల్ల ప్రాంతం చైతన్యానికి మారుపేరుగా నిలిచిందని ఇక్కడి సాహిత్యం స్ఫూర్తినిస్తోందని కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ, మానేరు రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ పత్తిపాక మోహన్ బాలసాహిత్యంపై సమాలోచన జరిగింది. జ్యోతి ప్రజ్వలనం చేసి సదస్సును ప్రారంభించిన శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడారు. నిత్య చైతన్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న జిల్లాలో జాతీయ స్థాయి సాహిత్య సదస్సు నిర్వహించడం అభినందనీయం అన్నారు. బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ సాహిత్య అధ్యయనంతో వ్యక్తి సంస్కారం మెరుగుపడుతుందని తెలిపారు. అఖిల భారత రచయితల సంఘం ప్రతినిధి జూకంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టీవీ నారాయణ, నాక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్ తదితరులు మోహన్ సాహిత్యంలోని ప్రత్యేకాంశాలను ప్రస్తావించారు. కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థి జాతీయస్థాయిలో సాహిత్య రంగంలో కీర్తి గడించడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం జరిగిన సదస్సులో మట్టా సంపతకుమార్‌రెడ్డి, అట్టం దత్తయ్య, పప్పుల శైలజ, వెలుదండి శ్రీధర్, ఎం.నారాయణశర్మ, తన్నీరు సురేశ్, వడ్ల శంకర్, మహేందర్‌రెడ్డి, మారోజు దేవేంద్ర, జి.శ్రీమతి, దేవరకొండ ప్రవీణ్ పత్ర సమర్పణ చేశారు. ఎస్.రమాదేవి, అనిత మాడూరి, అర్జున్ సుమన్‌చక్రవర్తి, వాసరవేని పరశురాం, వీరగోని చైతన్య, దీపిక, సౌమ్య, గోనె బాల్‌రెడ్డి, జిందం అశోక్, ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, గర్రెపెల్లి అశోక్ పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యామ్ ప్రసాద్‌లాల్

ఏసీబీ వలలో డీఈఓ రాజేశ్

- స్కూల్‌కు ఎన్‌ఓసీ కోసం లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిన డీఈవో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ
- సంగారెడ్డి డీఈఓ ఆదేశాల మేరకే లంచం తీసుకున్నట్టు వెల్లడి
- ఇద్దరిపై కేసులు నమోదు చేసిన ఏసీబీ


డీఈఓ రాజేశ్


సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ

కొండాపూర్(సంగారెడ్డి): ఓ పాఠశాలకు ఎన్ఓసీ విషయంలో సంగారెడ్డి డీఈఓ సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. డీఈఓ రాజేశ్ ఆదేశాల మేరకే తాను లంచం తీసుకున్నట్లు రామకృష్ణ చెప్పుకొచ్చాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కథనం ప్రకారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా.. రాంచంద్రాపురం మండలంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు తమ స్కూల్‌కు సంబంధించి సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్ నుంచి ఐసీఎస్ఈ (ఇండియన్ సర్టిఫికెట్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్)కు మార్చేందుకు ఎన్ఓసీ ఇవ్వాలని డీఈఓను సంప్రదించారు. ఇందుకు రాజేశ్ తన సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ద్వారా రూ.1,10,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఒకేసారి ఇవ్వలేమని చెప్పడంతో ముందుగా రూ.52,000 ఇవ్వాలని అడిగారు. అన్ని పేపర్లు సక్రమంగా ఉన్నా ఎందుకు లంచం ఇవ్వాలని భావించి నేరుగా ఈ నెల 15న ఏసీబీ కార్యాలయంలో సంప్రదించారు. ఏసీబీ వర్గాల సూచన మేరకు ముందస్తుగా అనుకున్న ప్రకారం శుక్రవారం పాఠశాల యాజమాన్యం డబ్బులను ఇచ్చేందుకు డీఈఓ కార్యాలయానికి వచ్చింది. సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయంపై రామకృష్ణను విచారించగా డీఈఓ ఆదేశాల మేరకు డబ్బు డిమాండ్ చేసినట్టు నేరం అంగీకరించారని ఏసీబీ డీఎస్పీ వివరించారు. కేసులో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణతో పాటు డీఈఓ రాజేశ్‌ను కూడా నిందితులుగా చేర్చామని తెలిపారు.

నిజామాబాద్‌లోనూ అదే ట్రాక్ రికార్డు

నిజామాబాద్ అర్బన్: సంగారెడ్డి డీఈవో నాంపల్లి రాజేశ్ ఏసీబీకి చిక్కడం నిజామాబాద్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో రెండేళ్ల పాటు ఇక్కడ డీఈవోగా పనిచేసిన రాజేశ్ లెక్కకు మించి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు ఉపాధ్యాయ సంఘాలతోపాటు అభ్యర్థులే నేరుగా ఫిర్యాదులు చేశారు. దీనిపై అప్పటి జేడీ సత్యనారాయణ రాజేశ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు ఇచ్చారు. దీంతో ఆయనకి పదోన్నతి నిలిచిపోయింది. జిల్లానుంచి బదిలీపై వెళ్లిన తర్వాత కూడా విద్యాశాఖ డైరెక్టర్ శ్రీనివాసచారి ఇక్కడికి వచ్చి ఫిర్యాదులపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఇలా విచారణ సమయంలోనే తాజాగా ఏసీబీకి పట్టుబడడం చర్చనీయాంశమైంది.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

సారంగాపూర్ (జగిత్యాల): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మిని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రేచపల్లి తురకకాశికాలనీలో రూ.5 లక్షల ఈజీఎస్ నిధులు వెచ్చించి కాంట్రాక్టర్ ఎడమల లక్ష్మారెడ్డి సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు పనులు పూర్తికావడంతో ఈజీఎస్ ద్వారా గ్రామపంచాయతీ ఖాతాలో డబ్బులు జమయ్యాయి. ఈ సొమ్ముకు సంబంధించిన చెక్కుపై సర్పంచ్ ఎడమల జయ సంతకం చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి సంతకం చేయాల్సి ఉంది. తనకు రూ.10వేలు లంచమిస్తేనే చెక్కుపై సంతకం చేస్తానని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారు. చేసేదిలేక కాంట్రాక్టర్ లక్ష్మారెడ్డి.. ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారిసూచన మేరకు శుక్రవారం రూ.10వేలను విజయలక్ష్మికి పంచాయతీ కార్యాలయంలో ఇస్తుండగా అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయంపై బాధితురాలు మాట్లాడుతూ, తనను బదిలీ చేయించేందుకు కుట్ర పన్ని కేసులో ఇరికించారని ఆవేదన చెందారు.

టికెట్ల ఆదాయం రూ. 5 వేల కోట్లపైనే

2019లోని రూ. 4 వేల కోట్ల రికార్డు బ్రేక్

- దక్షిణ మధ్య రైల్వేకు కాసులు కురిపిస్తున్న రైళ్లు
- దేశంలో 18 జోన్లకు గానూ ఐదో స్థానంలో సౌత్ సెంట్రల్ రైల్వే

సాక్షి, హైదరాబాద్: సరుకు రవాణా రూపంలో భారీగా ఆదాయాన్ని పొందుతూ దేశంలోని రైల్వే జోన్‌లలో కీలకంగా అవతరించిన దక్షిణ మధ్య రైల్వే తాజాగా ప్యాసింజర్ రైళ్ల ద్వారా కూడా భారీ మొత్తంలో ఆదాయాన్ని నమోదు చేసింది. టికెట్ల అమ్మకం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో వారం రోజులు మిగిలి ఉండగానే రూ.5 వేల కోట్ల మార్కును అందుకుంది. ఇప్పటివరకు దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఇదే అతి పెద్ద ఆదాయంగా రికార్డుకెక్కింది. గురువారం నాటికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5,000.81 కోట్లుగా నమోదైంది. ఇప్పటివరకు ఆదాయం గరిష్ట మొత్తంగా రూ.2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.4,119.44 కోట్లు. ఆ రికార్డును ఇప్పుడు బ్రేక్ చేస్తూ తొలిసారి రూ.5 వేల కోట్లను దాటింది. మార్చి చివరి నాటికి ఈ మొత్తం మరింత పెరగనుంది. ఈసారి దేశవ్యాప్తంగా చాలా జోన్లు టికెట్ల రూపంలో మంచి ఆదాయాలను సొంతం చేసుకున్నాయి. 18 జోన్లకు గానూ దక్షిణ మధ్య రైల్వే ఆదాయం విషయంలో ఐదో స్థానంలో నిలిచింది.

కోవిడ్ తర్వాత ఇటీవలే పూర్తిస్థాయిలో..

కోవిడ్ లాక్‌డౌన్ ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం వరకు చాలా రైళ్లు పార్కింగ్ యార్డులకే పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే పూర్తిస్థాయి రైళ్లను నడుపుతున్నారు. కోవిడ్ తర్వాత తిరిగి 100 శాతం రైళ్లను నడిపిన తొలి జోన్‌గా దక్షిణ మధ్య రైల్వేనే నిలిచింది. గతంలో ఎన్నడూ లేనట్టుగా పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో అదనపు రైళ్లు, ఉన్న రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే బిజీగా ఉంటోంది. ఇటీవల పలు రైళ్లకు అదనంగా ఏర్పాటు చేసిన వాటిల్లో 200 కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన నడుపుతున్నారు. ఇక రద్దీ ఎక్కువగా ఉన్న సమయాలకు సంబంధించి రోజువారీ ప్రాతిపదికన 10,539 కోచ్‌లను తాత్కాలికంగా నిర్వహించారు. వీటి రూపంలో 9,83,559 మంది అదనంగా బెర్తులు పొందగలిగినట్టు అధికారులు తెలిపారు. ఈ అదనపు ప్రయాణికుల ద్వారానే రూ. 81 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో 3,543 ప్రత్యేక రైళ్లను నడిపారు. వీటి ద్వారా 30.42 లక్షల మంది అదనంగా ప్రయాణించారు. వీరి ద్వారా రూ.219 కోట్లు అదనంగా సమకూరాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆక్యుపెన్సీ రేషియో 123 శాతం

ఈ సంవత్సరం సికింద్రాబాద్–విశాఖ మధ్య దేశంలో ఎనిమిదో వందే భారత్ రైలును, కాచిగూడ–మెదక్, అకోలా–అకోట్, బీదర్–కలబురగి మధ్య కొత్త రైళ్లు ప్రారంభమయ్యాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం 8 జతల రైళ్లకు కొత్తగా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను ప్రారంభించారు. వీటిల్లో ప్రయాణికుల సామర్థ్యం ఎక్కువ కావటం వల్ల కూడా వారి సంఖ్య పెరిగింది. వెరసి ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆక్యుపెన్సీ రేషియో 123 శాతానికి చేరుకోవటం విశేషం. చమురు ధరలు విపరీతంగా పెరగటంతో సొంత వాహనాలను పక్కన పెట్టి ప్రజా రవాణాపై చాలా మంది దృష్టి సారిస్తున్నారు. దూరప్రాంతాలకు రైళ్లలో వెళ్లే వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ అన్ని కారణాలతో ఇప్పుడు రికార్డు స్థాయిలో ఆదాయం నమోదైందని తెలుస్తోంది.


భూమిపూజ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

బాసర ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

భూమిపూజ చేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. సరస్వతి అమ్మవారి గర్భాలయ పునర్నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటికే రూ.8 కోట్ల వ్యయంతో ఆలయ పరిసరాల్లో విశ్రాంతి భవనాలు, ఇతర పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రూ.22 కోట్లతో ప్రస్తుతం ఉన్న గర్భాలయాన్ని కృష్ణశిలలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ సిబ్బంది, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులను ఆపేయాలి

దాడులను నిరసిస్తూ రేపు బహిరంగ సభ

సాక్షి, హైదరాబాద్: దండకారణ్యంలోని ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులను ఆపేయాలని, మధ్య భారతంలో మోహరించిన భారీ సాయుధ బలగాలను ఉపసంహరించాలని పౌరహక్కుల సంఘం (సీఎల్‌సీ)–తెలంగాణ ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ (సీడీఆర్‌వో) డిమాండ్ చేసింది. దీన్ని నిలువరించడానికి దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందని, ఆదివాసీలపై జరుగుతున్న యుద్ధాన్ని నిరసిస్తూ ఈనెల 26న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు సీఎల్‌సీ–సీడీఆర్‌వో నేతలు హరగోపాల్, లక్ష్మణ్ గడ్డం, గుంటి రవి, ఎన్.నారాయణరావు, సురేశ్‌కుమార్, జాబాలి, పీఎం రాజు, విష్ణువర్ధన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీల జీవించే హక్కుకై ఉద్యమించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. దండకారణ్యంలో గ్రేహౌండ్స్ అనేక సార్లు బాంబు దాడులు చేశాయని ఆరోపించారు. ఇవన్నీ ప్రజలకు తెలియజేసేందుకే ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. దేశ ప్రజలనే శత్రుదేశ ప్రజలుగా భావిస్తూ ప్రస్తుతం యుద్ధ హెలికాప్టర్లతో సామూహిక హత్యాకాండలు చేసేలా పాలన కొనసాగుతోందని విమర్శించారు. దీన్ని ప్రజాస్వామికవాదులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల కోసం ఏర్పడిన పెసా చట్టం, గ్రామ సభ తీర్మానం ఐదో షెడ్యూల్ వంటివి అమలు కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

దర్గాలో రామనామం

- వైభవంగా పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠ
- భద్రాద్రి జిల్లాలో మతసామరస్యం చాటుతున్న నాగుల్‌మీరా దర్గా


హోమం నిర్వహిస్తున్న వివిధ మతాలకు చెందిన దంపతులు

ఇల్లెందు రూరల్: అల్లాకు ప్రార్థనలు చేసే ఓ దర్గా ప్రాంగణంలో రామనామం మార్మోగింది. దీనికి భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సత్యనారాయణపురం గ్రామంలోని హజరత్ నాగుల్ మీరా మౌలాచాన్ దర్గా వేదికగా మారింది. శ్రీరామ నవమి సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ దర్గాలో సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వేడుకలను మరింత కనులపండువగా నిర్వహించేందుకు దర్గా ప్రతినిధులు 80 కిలోల వెండితో ప్రత్యేకంగా లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమ సమేత సీతారాముల విగ్రహాలను తయారు చేయించారు. శుక్రవారం వేద మంత్రోచ్ఛరణల నడుమ ఈ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకుముందు దర్గాహ్ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన ఆరాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకం, ధాన్యాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాల తర్వాత వైభవంగా హోమం జరిపించారు. ఇందులో కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, దర్గాహ్ కమిటీ ప్రతినిధులైన పలువురు ముస్లింలు కుటుంబసమేతంగా హాజరై సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించడం విశేషం.

క్లుప్తంగా...

వినయ్‌భానురెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి

బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



బొమ్మలరామారం: హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి త్యాగం గొప్పదని, మాతృభూమి రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనిక కుటుంబాలకు ఎంత చేసినా తక్కువేనని ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలో లెఫ్టినెంట్ కల్నల్ వినయ్ భానురెడ్డి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ రక్షణలో ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగాలను వెలకట్టలేమని ఈటల పేర్కొన్నారు. కల్నల్ సంతోష్ బాబు కుటుంబానికి అందించిన సహాయ సహకారాల మాదిరిగానే వినయ్‌భానురెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. చిన్న వయసులోనే మాతృభూమి ఒడికి చేరిన వినయ్‌భానురెడ్డి లేని లోటు వారి కుటుంబానికి తీరనిదన్నారు. ఈటల వెంట బీజేపీ నాయకులు గూడూరు నారాయణరెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

పింఛన్‌పై కమిటీ... కాలయాపనే

ఎన్‌ఎంఓపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ


సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల నూతన పెన్షన్ విధానంపై కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం హాస్యాస్పదంగా ఉందని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులపై స్పందిస్తున్నామని చెప్పడం ఉద్యోగులను మోసగించడమేనని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. ఉద్యోగులకు పాత పింఛన్ పునరుద్ధరణ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో లేదని లిఖితపూర్వకంగా తెలిపిన కేంద్ర ప్రభుత్వం పాత పింఛన్ కోసం నిరసనల్లో పాల్గొన్న ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తామని చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటమిని తప్పించుకునేందుకు గానూ కంటితుడుపు కాలయాపన చర్యగానే ఈ కమిటీని ప్రతిపాదించారే తప్ప కేంద్ర ప్రభుత్వానికి సీపీఎస్ ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి లేదని ఆ ప్రకటనలో స్థితప్రజ్ఞ విమర్శించారు.

బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తాం: తమ్మినేని



కూసుమంచి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందుకు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర శుక్రవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి, ముదిగొండ మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా కూసుమంచిలో ఏర్పాటుచేసిన సభలో తమ్మినేని మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశం ఛిన్నాభిన్నమవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీని గద్దె దించేందుకు బీఆర్ఎస్‌తో పాటు కలిసి వచ్చే అన్ని పార్టీలతో జట్టుగా పోరాడుతామని వెల్లడించారు. కాగా, సభకు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి హాజరుకాగా.. పాలేరు సీటు నుంచి మేం పోటీ చేస్తామా? మా బావ (ఉపేందర్‌రెడ్డి) పోటీ చేస్తాడా? అనే చర్చ ప్రజల్లో జరుగుతోందని తమ్మినేని తెలిపారు. తమకు రాష్ట్రంలోనే పాలేరు అత్యంత ప్రధానమైన సీటు అని, ఈ సీటు అడిగిన మాట నిజమే అయినా రాష్ట్ర కమిటీ, సీఎం కేసీఆర్ మధ్య జరిగే చర్చల్లో సీటు ఉపేందర్‌రెడ్డికి కేటాయిస్తే ఆయన్ను నెత్తిన పెట్టుకుని ఊరూరా ప్రచారం చేసి గెలిపిస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది సీట్లు గెలుస్తామని పేర్కొన్నప్పటికీ.. పాలేరు సీటుపై మాత్రం స్పందించలేదు.

బలగం సినిమాకు 'మేడి' కుటుంబ బలగం



చిట్యాల: బలగం సినిమా నల్లగొండ జిల్లా చిట్యాలలోని సుజన థియేటర్‌లో రెండు వారాలుగా ప్రదర్శితమవుతోంది. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన మేడి (మేడి ఇంటిపేరుగా గల) కుటుంబానికి చెందిన నలభై మంది సభ్యులు గురువారం రాత్రి బలగం సినిమాకు వచ్చారు. మూడు తరాలకు చెందిన ఆ కుటుంబసభ్యులు తమ అనుబంధాలు ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు.

నాడు పూత రాలి.. నేడు కాయ కుళ్లి

- నెలక్రితం తేనెమంచు పురుగుతో పూతకు దెబ్బ..
- ఇటీవల వడగళ్ల ధాటికి కాయకు...
- మామిడి రైతుకు దెబ్బ మీద దెబ్బ..
- సుమారు 70 శాతం పడిపోనున్న దిగుబడి..
- రాష్ట్ర వ్యాప్తంగా 3.07 లక్షల ఎకరాల్లో సాగు..
- 8,865 ఎకరాల్లో నష్టం..



వడగళ్ల వాన దాటికి నేలకొరిగిన మామిడి చెట్టు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మామిడిరైతును ప్రకృతి పగబట్టింది. నెల రోజుల క్రితం తేనెమంచు పురుగు సోకి సుమారు 70 శాతం పూత రాలిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ తేనెమంచు పురుగుతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ఈ పురుగు ధాటిని తట్టుకుని నిలిచిన పూత ఇప్పుడు కాయదశకు చేరిన కీలక సమయంలో ఇటీవల వడగళ్ల తో మామిడి రైతును దెబ్బమీద దెబ్బ కొట్టినట్లయింది.

వడగళ్లతో 8,865 ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రంలో సాగయ్యే హార్టికల్చర్ పంటల్లో మామిడి ప్రధానమైనది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 3.07 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగైంది. అత్యధికంగా సంగారెడ్డి, రంగారెడ్డి, ఖమ్మం, జగిత్యాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల్లో ఎక్కువగా మామిడి సాగవుతోంది. ఇటీవల వడగళ్లతో కూడిన అకాల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 8,865 ఎకరాల్లో మామిడిపంట దెబ్బతిన్నట్లు హార్టికల్చర్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే సుమారు 2,484 వేల ఎకరాల్లో ఈ పంట దెబ్బతిన్నది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నష్టంలోనే సుమారు 25 శాతం సంగారెడ్డి జిల్లాలోనే చోటుచేసుకుంది.

ఆమ్‌చూర్‌కూ పనికి రాకుండా..

వడగళ్లతో దెబ్బతిన్న మామిడికాయలు కుళ్లిపోతున్నాయి. కుళ్లిపోయిన భాగాన్ని తీసివేసి మిగిలిన భాగాన్ని ఆమ్‌చూర్ చేయడానికి కూడా వీలు పడటం లేదు. చాలా చోట్ల మామిడికాయల టెంక గట్టి పడలేదు. ఇలాంటి తరుణంలో ఆమ్‌చూర్ కూడా చేయలేనంతగా నష్టం వాటిల్లడంతో మామిడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సగానికి పడిపోయిన దిగుబడి..

సాధారణ మామిడిపంట ఎకరానికి రెండు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. అయితే గతంలో పూతరాలిపోవడం, ఇప్పుడు కాయలు నేలరాలడంతో సగం దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లవానకు దెబ్బలు తగిలిన చెట్టుపై ఉన్న మామిడి కాయలు కూడా చెడిపోయి నేలరాలడం ప్రారంభమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెట్టుపై ఉన్న కాయలూ రాలిపోతున్నాయి..



వడగళ్ల దెబ్బలకు అక్కడక్కడ చెట్టుపై మిగిలిన పోయిన కాయలు కూడా ఇప్పుడు నేలరాలడం ప్రారంభమైంది. 80 శాతానికి మించి మామిడి కాయలు నేలరాలిపోయాయి. దెబ్బతగిలినచోట్ల మురిగిపోవడంతో ట్రాక్టర్లతో పారబోస్తున్నాము. ప్రభుత్వం పరిహారం అందజేయాలి.

–చిత్తారి గంగాధర్, మామిడిరైతు, సజ్జారావుపేట్, సంగారెడ్డి జిల్లా

70 శాతం కాయలు రాలిపోయాయి..



ఐదు ఎకరాల్లో మామిడి పంటను వేసుకున్నాను. ఇటీవల కురిసిన గాలి వడగండ్ల వానకు 70 శాతానికి మించి కాయలు రాలిపోయాయి. రూ.రెండున్నర లక్షల వరకు పంట నష్టం జరిగింది. మా జీవనాధారమైన మామిడి పంట పాడై పోవడం వల్ల చాలా నష్టపోయాను. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి.

–ఆకుల రహమద్, మామిడిరైతు, న్యాల్కల్, సంగారెడ్డి జిల్లా

మీ డేటా ఎంత భద్రం?

అంగడి సరుకులా వ్యక్తిగత వివరాలు



- రూ. 2 వేలకే 50 వేల మంది సమాచారం విక్రయం
- ఫోన్ నంబర్, చిరునామా, బ్యాంకు వివరాలు, లోన్లు, ఆధార్, పాన్ నంబర్లు సైతం
- ఉత్తరాది రాష్ట్రాల్లో నకిలీ కాల్ సెంటర్లు
- మెసేజ్‌లు, ఫోన్లు చేస్తూ మోసాలు
- డేటా ప్రైవసీ బిల్లు అమలుతోనే రక్షణ

సాక్షి, హైదరాబాద్: సుమారు 17 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను తస్కరించి, అంగడి సరుకులా విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఫోన్ నంబర్ నుంచి చిరునామా, బ్యాంకు వివరాలు, రుణాలు, ఆధార్, పాన్ కార్డు నంబర్లు వంటి సమస్త సమాచారం సైబర్ నేరస్తులు దొంగిలించి, విక్రయిస్తున్నారు. రూ.2 వేలకు 50 వేల మంది వ్యక్తిగత వివరాలను విక్రయిస్తూ.. నెలకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. బ్యాంకు ఖాతా నంబర్, రుణాలు, ఈఎంఐ చెల్లింపులు, క్రెడిట్, డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, పిన్ నంబర్లతో సహా గోప్యంగా ఉండాల్సిన వ్యక్తిగత వివరాలు అత్యంత సులువుగా సైబర్ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. వాటి సహాయంతో కస్టమర్లకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు మాజీ ఉద్యోగులు, థర్డ్ పార్టీ ఏజెన్సీలు ఖాతాదారుల వివరాలను విక్రయిస్తున్నట్లు పలు కేసుల్లో సైబరాబాద్ పోలీసులు గుర్తించారు.

డేటా ప్రైవసీ బిల్లుతోనే రక్షణ..

కస్టమర్ల డేటాకు రక్షణ కల్పించే డేటా ప్రైవసీ బిల్లు ప్రతిపాదన దశలోనే ఉంది. కస్టమర్ల వ్యక్తిగత సమాచార భద్రతకు ఆయా సంస్థలు, యాజమాన్యాలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ కస్టమర్ అనుమతి లేకుండా వ్యక్తిగత వివరాలు బయటికి వస్తే ఎలా బహిర్గతమైందో వెల్లడించాల్సి ఉంటుంది. జరిగే మోసాలకు, నేరాలకు కూడా వారిదే బాధ్యత.

మన అవసరాలేంటో విశ్లేషిస్తూ..

సైబర్ నేరస్తులు బిహార్, రాజస్తాన్, జార్ఖండ్, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాల్లో నకిలీ కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులను ఆకర్షించి, వారిని కాల్ సెంటర్ ఉద్యోగులుగా నియమించుకుంటున్నారు. వ్యక్తిగత వివరాలను విశ్లేషించి మన అవసరాలేంటో నేరస్తులు గుర్తిస్తున్నారు. వాటిని అస్త్రంగా చేసుకుని కాల్ సెంటర్ల ఉద్యోగులు కస్టమర్లకు ఫోన్ చేస్తారు. స్థానిక భాషలో మాట్లాడుతూ మన అవసరం గురించి ఆరా తీయడంతో కస్టమర్లు సులువుగా నమ్మేస్తారు. చార్జీలు, పన్నులు అంటూ మాయమాటలతో వారిని బుట్టలో వేసి, అందినకాడికి దోచేస్తున్నారు.

ఎలా లీక్ అవుతున్నాయంటే..

- గూగుల్‌లో వెతికే సమాచారాన్ని సేకరించేందుకు సైబర్ నేరస్తులు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మనం గూగుల్‌లో దేనికోసం శోధించినా సరే.. వెంటనే ఆయా సమాచారం నేరస్తులకు చేరిపోతుంది.
- ఉత్పత్తులు కొనుగోలు చేసే ముందు వాటి నాణ్యత, ఇతర వివరాలను తెలుసుకునేందుకు తయారీ సంస్థల వెబ్‌సైట్లను సందర్శిస్తుంటాం. ఈ సందర్భంగా కొన్ని సంస్థలు ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు, నమోదు చేయాలని కోరుతుంటాయి. పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్‌లలో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటిస్తామంటూ పేరు, ఫోన్ నంబర్లను సేకరిస్తుంటారు. ఇలా తీసుకున్న వివరాలను మార్కెటింగ్ సంస్థలకు కమీషన్ తీసుకుని విక్రయిస్తుంటారు.
- ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు, జాబ్ పోర్టల్స్ నుంచి కస్టమర్ల డేటా లీకవుతుంది. ఫేస్‌బుక్, వాట్సాప్ యూజర్ల వివరాలు, ఆన్‌లైన్ షాపింగ్ కొనుగోలుదారుల వివరాలు సైతం నేరస్తుల చేతుల్లోకి చిక్కాయి.
- జిరాక్స్ సెంటర్లలో ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డు... ఏదైనా జిరాక్స్ తీసుకునేందుకు వెళితే కొందరు అక్రమార్కులు కస్టమర్‌కు తెలియకుండా గుట్టుగా అదనపు జిరాక్స్‌లు తీస్తున్నారు. వీటిని సైబర్ ముఠాలకు విక్రయిస్తున్నారు. అనధికారిక ఏజెంట్ల వద్ద సిమ్ కార్డులు తీసుకునే ముందు సమర్పించే డాక్యుమెంట్లు కూడా అక్రమార్కుల చేతుల్లోకి చేరుతున్నాయి.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి



మీ వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు, వెబ్‌సైట్లలో సమర్పించ కూడదు. బ్యాంకు ఖాతా వివరాలు, ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో పంచుకో కూడదు. మీ వ్యక్తిగత సమాచారం తస్కరించినట్లు గుర్తించిన వెంటనే పోలీసులు లేదా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను సంప్రదించాలి.

– స్టీఫెన్ రవీంద్ర, పోలీసు కమిషనర్, సైబరాబాద్

రాహుల్‌పై అనర్హత ప్రజాస్వామ్యంపై కుట్ర

- మోదీ, షాల కుట్రలకు గాంధీ కుటుంబం భయపడదు
- సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క



ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి

కెరమెరి (ఆసిఫాబాద్): రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని ప్రజాస్వామ్యంపై కుట్రగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అభివర్ణించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం కుమురంభీం జిల్లా కెరమెరి మండలం ధనోరా గ్రామం నుంచి ఆసిఫాబాద్ మండలం ఆడ గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌పై అనర్హత వేటు వేయడం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. దీనిని ప్రజాస్వామ్యం, లౌకికవాదంపై జరుగుతున్న కుట్రగా అభిప్రాయపడ్డారు. అందరూ ముక్తకంఠంతో ఖండించాలని అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల కుట్రలకు గాంధీ కుటుంబం భయపడదని, రాహుల్ గాంధీని ఎదుర్కోలేక తప్పుడు కేసులు పెట్టి శిక్ష పడేలా చేస్తున్నారని విమర్శించారు. జైలు శిక్ష, అనర్హత బీజేపీ భూస్థాపితానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలి

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులోని అధికారులతోపాటు సీఎం కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని భట్టి డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను నాశనం చేశారని దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్‌బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగులకు భృతి అని ప్రకటించిన కేసీఆర్ అమలులో విఫలమయ్యారని, రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. నిరుద్యోగులకు న్యాయం కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు, ఏఐసీసీ సభ్యులు మర్సకోల సరస్వతి, గణేశ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలి: అరుణ



సాక్షి, హైదరాబాద్: మోదీలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీకి పిచ్చిపట్టినట్లుంది. ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావట్లేదు..మోదీ అనే పేరున్న వాళ్లంతా దొంగలే అని ఎలా సంబోధిస్తారని ప్రశ్నించారు. లండన్ లో చేసిన వ్యాఖ్యలతో రాహుల్ దేశ ప్రతిష్టను మంట గలిపారని ధ్వజమెత్తారు. 'దొంగల ఇంటి పేరు మోదీ'అంటూ చేసిన తప్పుడు వ్యాఖ్యల ఫలితంగానే రాహుల్‌కు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిస్తే బీజేపీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌కు పట్టిన శని అంటూ ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అరుణ హితవు పలికారు.

టీబీ నియంత్రణలో 4 జిల్లాలకు జాతీయ అవార్డులు

నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, ఖమ్మం జిల్లాలకు అవార్డులు



సాక్షి, హైదరాబాద్: టీబీ నియంత్రణలో ప్రతిభ కనబర్చిన నాలుగు జిల్లాలకు కేంద్రం జాతీయ అవార్డులు ప్రకటించింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో తెలంగాణ టీబీ విభాగం అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల సూచికల ఆధారంగా, తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం దేశంలోనే మూడో ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రంగా నిలిచింది. 2015 కేసులతో పోల్చితే తెలంగాణలో టీబీ కేసుల తగ్గింపు ప్రతి లక్ష జనాభాకు గణనీయంగా తగ్గింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం, తగ్గింపు లక్ష్యం 80 శాతం కాగా, 60 శాతం తగ్గించిన నిజామాబాద్‌కు బంగారు పతకం, 40 శాతం తగ్గించిన భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండకు వెండి, 20 శాతం తగ్గించిన ఖమ్మంను కాంస్య పతకాలు వరించాయి. కార్యక్రమంలో భాగంగా అందించిన అవార్డులను రాష్ట్ర టీబీ విభాగం జేడీ రాజేశం, నిజామాబాద్ డీఎంహెచ్‌వో సుదర్శనం, ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ శ్రీ గణ, ప్లానింగ్ ఆఫీసర్ వాసు ప్రసాద్ తెలంగాణ ప్రభుత్వం తరపున అందుకున్నారు. కాగా, టీబీ నియంత్రణలో సత్తాచాటి అవార్డులు పొందిన జిల్లాలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన వైద్యాధికారులను అభినందించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో తెలంగాణలో 2025 నాటికి పూర్తి స్థాయిలో క్షయ నిర్మూలనే లక్ష్యంగా పరీక్షలు, వైద్యం వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

అసమ్మతి లేని ప్రజాస్వామ్యం ఉండదు

సీనియర్ అడ్వొకేట్ సి.వి.మోహన్‌రెడ్డి



ప్రసంగిస్తున్న సి.వి.మోహన్‌రెడ్డి. చిత్రంలో జస్టిస్ జి.రఘురాం

నాంపల్లి (హైదరాబాద్): అసమ్మతిలేని ప్రజాస్వామ్యం శ్మశానంలో నిశ్శబ్దం వంటిదని ఏపీ హైకోర్టు విశ్రాంత అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది సి.వి.మోహన్‌రెడ్డి అన్నారు. అసమ్మతిని అణగదొక్కే ప్రభుత్వాలు నిరంకుశ ప్రభుత్వాలని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి శత జయంతి స్మారకోపన్యాస కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సి.వి.మోహన్‌రెడ్డి 'ప్రజాస్వామ్యం, అసమ్మతి-భారత రాజ్యాంగం'అనే అంశంపై ప్రసంగించారు. కె.ఎం.మున్షీ వంటి వారు ప్రజాస్వామ్య సారాంశం 'అసమ్మతే'అని రాజ్యాంగ పరిషత్‌లో అభిప్రాయపడినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అనేక మంది న్యాయమూర్తులు వెలువరించిన ముఖ్యమైన తీర్పులను విశ్లేషించారు. సమాజం కొన్ని నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తుందని, అయితే కొత్త ఆలోచనలు పరిఢ విల్లాలన్నా, కొత్త మార్గాలు ఆవిష్కరించాలన్నా స్వేచ్ఛగా ఆలోచించే వీలు సమాజంలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, సంఘసేవకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అల్పాహార విందుకు తెలంగాణ ఎంపీలు

- పాల్గొన్న ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డి, కేకే, నామా, సురేశ్‌రెడ్డి



రాష్ట్రపతి ముర్ముకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు, బడుగుల, నామా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన అల్పాహార విందుకు తెలంగాణ ఎంపీలు హాజరయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ విందుకు బీఆర్ఎస్ ఉభయసభాపక్ష నాయకుడు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావుతోపాటు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, సురేశ్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్, పి.రాములు, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఇక కాంగ్రెస్ నుంచి ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎంపీలతో ప్రత్యేకంగా రాష్ట్ర పరిస్థితులపై చర్చించిన ముర్ము.. వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ విందులో ఒడిశా ఎంపీలు కూడా పాల్గొన్నారు.

ఆ నలుగురు ఎమ్మెల్యేలు ఔట్

- వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి, ఆనం, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి సస్పెన్షన్
- క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించుకున్నాకే చర్యలు: సజ్జల



సజ్జల

సాక్షి, అమరావతి: ఏపీలో ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన నలుగురు శాసన సభ్యులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా వ్యవహరించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు చెప్పారు. వారు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించుకున్నాకే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బలం లేకపోయినా ప్రలోభపెట్టడం, డబ్బు ఎరవేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. అమ్ముడుపోయేవాడుంటే కొనుగోలు చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తమకున్న సమాచారం మేరకు టీడీపీ అభ్యర్థికి ఓటు వేసేందుకు రూ.10–15 కోట్ల వరకు డబ్బిచ్చి ప్రలోభపెట్టి ఓట్లు కొన్నారని సజ్జల చెప్పారు. టికెట్ ఇస్తామని కూడా చంద్రబాబు కొందరికి ఆశ చూపి ఉండవచ్చన్నారు. కోటంరెడ్డి, ఆనం, మేకపాటి, శ్రీదేవి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు తమ అంతర్గత విచారణలో ఆధారాలతో రుజువైందన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు జగన్ దృష్టికి తీసుకొచ్చాక వారిని సస్పెండ్ చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు.

'మా నోట్లో మట్టి కొట్టొద్దు'



చెరువులో జలదీక్ష చేస్తున్న సిరికొండ రైతులు, నాయకులు

- సిరికొండ చెరువులో రైతుల నిరసన
- 220 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన
- రైతులకు మద్దతుగా పురుగుమందు డబ్బాలతో నీళ్లలోకి దిగిన వారి భార్యలు.. సిరికొండలో ఉద్రిక్తత

ఇల్లంతకుంట(మానకొండూర్): 'మా భూములను చెరువులో ముంచి..మా నోట్లో మట్టి కొట్టొద్దు..'అంటూ రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సిరికొండలో రైతులు చెరువులో శుక్రవారం జలదీక్ష చేపట్టారు. శుక్రవారం ఉదయం చెరువులోకి దిగిన రైతులకు బీజేపీ నాయకులు మద్దతుగా నిలిచారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ప్రజాప్రతినిధుల నుంచి స్పందన లేకపోవడంతో రైతులకు మద్దతుగా వారి భార్యలు పురుగుమందు డబ్బాలతో చెరువులోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ...సిరికొండ చెరువులోకి మూడేళ్లుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తూ చెరువును నింపడంతో తమకు చెందిన 220 ఎకరాల పట్టాభూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీంతో అదే గ్రామంలో ఇతర రైతుల పొలాల్లోకి కూలి పనికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేసేంత వరకు చెరువు నీళ్లలోంచి కదిలేది లేదని, కలెక్టర్ హామీ ఇస్తేనే చెరువులోంచి బయటకు వస్తామని పట్టుబట్టారు. మూడేళ్లుగా తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే, మంత్రులు, కలెక్టర్ చుట్టూ తిరిగినా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మధ్యాహ్నం ఆర్ఐ, నీటిపారుదలశాఖ ఏఈ వచ్చి చెప్పినప్పటికీ రైతులు వినలేదు. తహసీల్దార్ రవికాంత్ ఘటన స్థలానికి చేరుకుని ముంపునకు గురయ్యే భూముల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని సమస్యను 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ప్రేమ విఫలమై బాలిక ఆత్మహత్య

బాలిక ఐదు నెలల గర్భవతి

నెల్లికుదురు: ప్రేమ విఫలమైందని మనస్తాపం చెందిన ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక ఐదు నెలల గర్భవతి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన బాలిక మహబూబాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. కళాశాల పక్కనే కూలి పనులు చేసుకునే పెళ్లి అయిన వ్యక్తిని ప్రేమించింది. ఇద్దరు ఒక్కటికావడంతో బాలిక గర్భం దాల్చింది. విషయం ఇంట్లో తెలియడంతో మహబూబాబాద్‌లో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఆ యువకుడు.. బాలిక తల్లిదండ్రులకు కొంత డబ్బు ఇవ్వాలని తీర్మానించారు. ఇంటికి చేరుకున్న బాలిక ప్రేమ విఫలమైందని మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. దీనిపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో నిజాంకంటే దారుణ పాలన

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్‌రెడ్డి

భద్రాచలం టౌన్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిజాం కంటే దారుణమైన పాలన కొనసాగుతోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్ రెడ్డి మండిపడ్డారు. భద్రాచలంలో గురువారం జరిగిన ప్రజాతంత్రవాదుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 2018లో భద్రాచలం ఏజెన్సీలో పట్టాలులేని ఆదివాసీలు అటవీ భూములను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించగా లక్ష మందికి నష్టం జరుగుతున్నందున ఈ ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని చెప్పారు. ప్రస్తుతం పోడు భూముల సర్వే నేపథ్యంలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య నెలకొన్న వైరం తొలగిపోవాలంటే 50 ఏళ్లు కూడా సరిపోవని నిరూప్‌రెడ్డి తెలిపారు. కానీ ఏపీలో పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే పట్టాపుస్తకాలను మంజూరు చేస్తున్నారన్నారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించే వరకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ప్రసంగించగా తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 25-3-2023



ఐసీయూలో పేషెంట్లకు సేవ చేసే నర్సులు ఎంతో జాగ్రత్తగా ఉండాలి.
లేకుంటే కొన్ని వ్యాధులు అంటుకునే ప్రమాదం ఉంది.
ఢిల్లీ ఎయిమ్స్‌లో పని చేసే **దివ్య సోజల్**
మూడుసార్లు టి.బి బారిన పడింది.
అయినా సరే రోగుల సేవ మానలేదు.
'నా కర్తవ్యం నుంచి నేను పారిపోను' అంటున్న ఆమెను
ప్రాణాంతక రోగులు మనిషి అనరు. దేవత అంటుంటారు.

నర్సు కాదు దేవత



దివ్య సోజల్

దివ్య సోజల్ ఐసీయూలో ఉందంటే పేషెంట్లకే కాదు తోటి స్టాఫ్‌కు కూడా ఎంతో ధైర్యం. ఐసీయూలో ఉండే పేషెంట్లను చూసుకోవడంలో ఆమెకు ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం ఉన్నాయి. అయితే అవి చాలామందిలో ఉంటాయి. అందరూ ఐసీయూలో ఉండటానికి ఇష్టపడరు. కాని దివ్య సోజల్ మాత్రం తనకు తానుగా ఐసియులో ఉండే పేషెంట్ల సేవను ఎంచుకుంది. 'ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడుకోవడంలో నాకో సంతృప్తి ఉంది' అంటుంది సోజల్. అయితే ఆ పనిలో ప్రమాదం కూడా ఉంది. అదేమిటంటే అలాంటి రోగులకు సేవ చేసేటప్పుడు కొన్ని వ్యాధులు అంటుకోవచ్చు. సోజల్ మూడుసార్లు అలా టి.బి బారిన పడింది.

కేరళ నర్స్

దివ్య సోజల్‌ది కేరళలోని పత్తానంతిట్ట. చదువులో చురుగ్గా ఉండేది. ముంబైలోని పీడీ హిందూజా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నుంచి జనరల్ నర్సింగ్‌లో డిప్లమా చేసి 2011 నాటికి హిందూజా హాస్పిటల్‌లో ఐసీయూ నర్స్‌గా పని చేయడం మొదలు పెట్టింది. అప్పటికి ఆమె వయసు 23. ఆ సమయంలోనే ఒకరోజు నైట్ డ్యూటీలో ఆమెకు శ్వాసలో ఇబ్బంది ఎదురైంది. ఎక్స్‌రే తీసి చూస్తే ఊపిరితిత్తుల్లో నీరు చేరింది అని తేలింది. పరీక్షలు చేస్తే టి.బి . అని తేలింది. అదే హాస్పిటల్‌లోని వైద్యులు ఆమెకు ఆరు నెలల ట్రీట్‌మెంట్‌లో పెట్టారు. రోజూ నాలుగు రకాల మందులు తీసుకోవాల్సి వచ్చేది. వాటిని తీసుకుంటూ టి.బి. నుంచి బయట పడింది. అయితే వృత్తిని మానేయలేదు. ఐసీయూను వదల్లేదు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో

2012లో బి.ఎస్సీ నర్సింగ్ చేయడానికి ఢిల్లీ ఎయిమ్స్‌కు వచ్చింది దివ్య. ఆ తర్వాత అక్కడే న్యూరోసైన్స్ నర్సింగ్‌లో పి.జి. చేరింది. న్యూరోలాజికల్ ఐసీయూలో పని చేయడానికి నిశ్చయించుకోవడం వల్లే ఆ కోర్సులో చేరింది. ఆ సమయంలో అంటే 2014లో మళ్లీ టి.బి. బారిన పడింది దివ్య. నెల రోజులు హాస్పిటల్‌లో ఉంచారు. నీడిల్‌తో ఫ్లూయిడ్‌ను బయటకు తీయాల్సి వచ్చింది నాలుగైదు సార్లు. మూడు నెలల పాటు రోజూ ఇంజెక్షన్ తీసుకోవాల్సి వచ్చేది. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా నేరుగా రంగంలో దిగి దివ్య ట్రీట్‌మెంట్‌ను పర్యవేక్షించాడు. దివ్య సేవాతత్పరత ఆయనకు తెలియడం వల్లే ఇది జరిగింది. దాంతో రెండోసారి టి.బి నుంచి విజయవంతంగా బయటపడింది దివ్య సోజల్. ఈ దశలో ఎవరైనా సులభమైన పని ఉండే వార్డుల్లో పని చేయడానికి మారిపోతారు. కాని దివ్య మారలేదు. డ్యూటీని కొనసాగించింది.

టి.బి రోగులలో స్థయిర్యానికి

'నేను ఒకటి నిశ్చయించుకున్నాను. టి.బి రోగుల్లో ధైర్యం నింపాలి. వాళ్లు నన్ను చూసి ధైర్యం తెచ్చుకోవాలి. మూడుసార్లు టి.బి వచ్చినా నేను బయటపడగలిగాను. అందువల్ల ఆ వ్యాధి వచ్చినవారు కుంగిపోవాల్సిన పని లేదు. సరైన మందులు సరిగ్గా తీసుకోవాలి. అంతే కాదు నర్సులు కాని సామాన్య ప్రజలు కాని మంచి తిండి తిని సమయానికి తిని రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి. అప్పుడు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం తగ్గుతుంది. ఇప్పుడు నేను ఆ చైతన్యం కోసం కార్యక్రమాలు చేస్తున్నాను. ప్రచారం చేస్తున్నాను' అంటుంది దివ్య.

ఆహారం సరిగా తినక

ఐసీయూలో ఉద్యోగం అంటే నైట్ డ్యూటీస్ ఉంటాయి. దివ్య సరిగా ఆహారం తినేది కాదు డ్యూటీలో. నిజానికి తినడానికి టైమ్ కూడా ఉండేది కాదు. అది ఆమె రోగ నిరోధక శక్తిని దెబ్బ తీసింది. అప్పటికి దివ్య పెళ్లి చేసుకుంది. జీవితం ఒక మార్గాన పడింది అనుకుంది. కాని 2019లో విదేశాలలో ఉద్యోగానికి అప్లై చేసేందుకు చేయించుకున్న రొటీన్ పరీక్షల్లో మూడోసారి టీబీ బయట పడింది. విషాదం ఏమంటే ఈసారి వచ్చింది డ్రగ్ రెసిస్టెంట్ అంటే మందులకు లొంగని వేరియెంట్. 'ఈ వార్త విన్నప్పుడు చాలా కుంగిపోయాను' అంది దివ్య. 'నేను కేరళలోని మా ఊరికి వచ్చి ట్రీట్‌మెంట్ కొనసాగించాను. లెక్కలేనన్ని మాత్రలు మింగాల్సి వచ్చేది. ఇంజెక్షన్లు వేసుకోవాల్సి వచ్చేది. బరువు తగ్గాను. నాసియా ఉండేది. నా తల్లిదండ్రులు నన్ను జాగ్రత్తగా చూసుకుని కాపాడుకున్నారు' అంటుంది దివ్య.

ఇంత జరిగినా ఆమె ఉద్యోగం మానేసిందా? ఐసీయూను వదిలిపెట్టిందా? ఢిల్లీ ఎయిమ్స్‌కు వెళ్లి చూడండి. ప్రాణాపాయంలో ఉన్న రోగులను అమ్మలా చూసుకుంటూ ఉంటుంది. ఇటువంటి మనిషిని నర్సు అని ఎలా అనగలం? దేవత అని తప్ప.

ట్రైనింగ్

స్టిక్ యోగా

కుటుంబంలో అందరి బాగు కోసం తపన పడే అమ్మ ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు ఎవరు?!
ఈ విషయం గురించి ఆలోచించిన వరికుప్పల సంధ్య 'అమ్మ-ఆరోగ్యం' పేరుతో మహిళలకు యోగాసనాలు నేర్పిస్తోంది. మంచి ఆహారపు అలవాట్లను చెబుతూ 'అమ్మ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం మొత్తం బాగుంటుంది అనే విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా చేస్తోంది.



అనారోగ్యాలు దూరం

మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగా మంచి పరిష్కారం. అమ్మాయిల్లో రుతుక్రమం, ప్రసవం తరువాత వచ్చే సమస్యల నుంచి యోగా ద్వారా బయటపడవచ్చు. అలాగే, వయసు పైబడినవారు యోగసాధన చేస్తే శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండి, కీళ్ల నొప్పుల సమస్య దరిచేరదు. యోగాతో పాటు మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

- వరికుప్పల సంధ్య, యోగా ట్రైనర్

తెలంగాణలోని మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామవాసి అయిన వరికుప్పల సంధ్య నల్లగొండ పట్టణంలో 'అమ్మ – ఆరోగ్యం' పేరుతో మహిళలకు యోగా నేర్పిస్తోంది. కర్ర సపోర్ట్‌తో యోగా నేర్పించడం సంధ్య ప్రత్యేకత. ఇదే విషయాన్ని సంధ్య దగ్గర ప్రస్తావించినప్పుడు ఆమె పంచుకున్న విషయాలు ఇవి..

''అమ్మ, అమ్మమ్మలు ఆసనాలు వేసే సమయంలో వారి శరీరంలో కొద్దిగా వణుకు వస్తుంది. నిల్చోవడంలోనూ, ఆసనం ముద్రలోనూ ఎక్కువ సేపు బ్యాలెన్స్ చేయలేరు. అందుకే, కర్ర సపోర్ట్‌తో ఆసనాలు నేర్పిస్తున్నాను. 19 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలు దాదాపు 200 మంది వరకు ప్రతి రోజూ ఇక్కడ యోగసాధన చేస్తున్నారు.

బరువు తగ్గడానికి

మూడేళ్ల క్రితం మాట.. నేను 72 కిలోల బరువు ఉండేదాన్ని. దీంతో పాటు థైరాయిడ్, షుగర్, మైగ్రేన్, కీళ్లనొప్పులు ఉండేవి.



డిప్రెషన్ లాంటిది బాధించేది. 'ఏమీ చేయలేనా?' అనే నిరాసక్తత ఆవరించేది. అలాంటిది ఓ రోజు షాపింగ్‌లో ఉన్నప్పుడు ఒక చిన్న యోగా పుస్తకం కంటపడింది. దీంతో గురువు లేకుండానే యోగాసనాలు సాధన చేశాను. నాపైన నేనే ప్రయోగాలు చేయడం మొదలుపెట్టాను. యోగా, ఆహార నియమాలతో మెల్లగా పద్దెనిమిది కేజీల బరువు తగ్గించుకోగలిగాను. దీంతో నాలో కొత్త ఉత్సాహం మొదలైంది. యోగా స్టాటిస్టిక్స్ బోర్డు (వైసీబీ) నిర్వహించే పరీక్షలను ఆన్‌లైన్‌లో రాసి 'యోగా టీచర్ అండ్ ఎవాల్యుయేటర్' సర్టిఫికెట్ పొందాను.

కాలనీలో మొదలుపెట్టి...

కరోనా సమయంలో మేడపైన యోగాసనాలు వేస్తుండగా ఇరుగుపొరుగు మహిళలు చూసి తమకూ ఆసనాలు నేర్పించాలని కోరారు. అలా.. ఒకరిద్దరితో మొదలై మా కాలనీలో పదిహేను మంది రోజూ వచ్చి యోగసాధన చేసేవారు. వారిలో కొందరు బరువు తగ్గడం, ఆరోగ్యం మెరుగవడంతో మరింత మంది శిక్షణ కోసం రావడం మొదలుపెట్టారు. వారందరికీ ఉచితంగానే శిక్షణ ఇస్తూ వచ్చాను.

నాలుగు బ్యాచ్‌లు

శిక్షణ కోసం వచ్చేవారి సంఖ్యను బట్టి బ్యాచ్‌లుగా చేశాను. రోజూ ఉదయం 4 గంటల నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు యోగా కోసం టైం కేటాయించాను. ఇప్పుడు మొత్తం నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నాను. ప్రతి బ్యాచ్‌కు 40 మందికి పైనే ఉంటారు. అరవై ఏళ్ళ పైబడిన వారు కూడా యోగ సాధన చేస్తున్నవారిలో ఉన్నారు. విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నాను. ఒకరి ద్వారా మరొకరికి తెలిసి సాధన చేసేవారి సంఖ్య పెరుగుతోంది.

బ్యాలెన్స్ కోసం కర్ర

యోగాసనాలు వేస్తున్నప్పుడు, కొందరు పెద్దవాళ్లు నిలుచుని స్టాండింగ్ ఆసనాలు వేస్తున్నప్పుడు వణుకురావడం, బ్యాలెన్స్ కోల్పోయి పడిపోవడం గమనించాను. దీంతో వెదురు కట్టెను బ్యాలెన్స్ కోసం ఎంచుకున్నాను. నటరాజాసనం, పక్షి ఆసనం, వృక్షాసనం, అర్ధచక్రాసనం, త్రికోణాసనం, పవనముక్తాసనం, ధనురాసనం, హనుమాసనం, భద్రాసనం.. వంటి ఆసనాలు వేసేటప్పుడు బాడీ స్టిఫ్‌గా ఉండేందుకు పొడవాటి కర్రలు సహాయపడతాయి. కర్ర సాయంతో ఆసనం ముద్రలో కొంతసేపు అలాగే ఉండవచ్చు. దీంతో స్టిక్‌యోగా ఇక్కడకు వచ్చే మహిళలకు బాగా నచ్చింది' అని వివరించారు ఈ యోగా ట్రైనర్.

– బొడ్డు జనార్దన్‌రెడ్డి, సాక్షి, నల్లగొండ
ఫొటోలు : కంది భజరంగ్ ప్రసాద్

● గెలుపు దారి

ఆట గెలిచింది!

విజయానికి వయసుతో పనిలేదు.
ఇష్టంతో కూడిన కష్టంతోనే అసలైన పని.
నలభై ప్లస్ వయసులో కుమారుడి దగ్గర వీడియో గేమ్స్ ఆడడం నేర్చుకున్న జమ్మూకు చెందిన రీతూ స్లాతియా యూత్‌తో పోటీ పడుతూ ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకుంది...



రీతూ స్లాతియా

రీతూ స్లాతియకు పెద్ద చదువులు చదువుకొని ఉద్యోగం చేయాలనే కల ఉండేది. అయితే పదవ తరగతి పూర్తికాగానే చదువు మాన్పించారు తల్లిదండ్రులు.

'కాలేజీ అక్కడెక్కడో ఉంది. అమ్మాయిని ఒంటరిగా అంతదూరం ఎలా పంపగలం!' అనేవాళ్లు.

కొన్ని సంవత్సరాల తరువాత రీతూకు పెళ్లి అయింది. ఇంటి పనుల్లో పూర్తిగా మునిగిపోయింది.

'ఏమీ చేయలేకపోతున్నానే' అని తనలో అసంతృప్తి ఉండేది.

'ఏం చేయగలను. నేను చదివిన చదువుకు ఉద్యోగం ఎక్కడ వస్తుంది!' అని తనకు తాను సర్ది చెప్పుకునేది.

అయితే రీతూ కొడుకు తరచు మొబైల్‌లో వీడియో గేమ్స్ ఆడుతూ కనిపించేవాడు. ఆ సమయంలో అతడు వేరే ప్రపంచంలో ఉన్నట్లుగా అనిపించేది.

కొడుకు ఆనందాన్ని చూసి తనకు కూడా ఆడాలనిపించింది.

'అడిగితే ఏం అనుకుంటాడో...' అనే సందేహంతో చాలారోజులు అడగలేకపోయింది.

ఒకరోజు మాత్రం 'నేను కూడా ఆడతాను' అని కొడుకుని అడిగింది. చాలా సంతోషంగా ఫీలైన అబ్బాయి 'ఇలా ఆడాలమ్మా' అంటూ వీడియోగేమ్స్ ఆడడం నేర్పించాడు. ఇక అప్పటి నుంచి ఏ కాస్త తీరిక దొరికినా మొబైల్‌లో గేమ్స్ ఆడేది.

ఒక సంవత్సరం తరువాత...

లైవ్‌స్ట్రీమింగ్ గేమ్స్ గురించి తెలుసుకొని స్ట్రీమింగ్ అండ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'రూటర్'లోకి అడుగుపెట్టింది రీతూ. తక్కువ సమయంలోనే ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకొని మంచి ఆదాయాన్ని అర్జించడం ఆరంభించింది. ఆమెకు 'రూటర్'లో 3.5 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

పొద్దున పూజ చేసి, వంట పూర్తయిన తరువాత ఎనిమిదింటికల్లా కంప్యూటర్ ముందు కూర్చొని లైవ్ గేమ్‌ప్లేలోకి వెళ్లిపోతుంది రీతూ.

బీజీఎంఐ(బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా)తో గేమ్స్‌తో ఆడడం మొదలుపెట్టిన రీతూ ఆ తరువాత ఫాలోవర్స్ బేస్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త కొత్త గేమ్స్‌ను ట్రై చేయడం నేర్చుకుంది.

'నేను వీడియో గేమ్స్‌ను ఆడుతున్న కొత్తలో, చిన్నపిల్లలా ఈ ఆటలు ఏమిటి! అనేవారు. ఇక స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చిన తరువాత నన్ను చూసి నవ్వని వారు లేరు. ఇలాంటి పరిస్థితుల్లోనూ నా కుటుంబ సభ్యులు నన్ను ఉత్సాహపరిచారు. వారి ప్రోత్సాహమే నేను ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది. ఒకప్పుడు నవ్విన వాళ్లే నాకు వచ్చిన పేరును చూసి అభినందిస్తున్నారు' అంటుంది 44 సంవత్సరాల రీతూ స్లాతియా.



కొత్త సంతకం

ఒకప్పుడు గేమింగ్‌లో మహిళలు తక్కువగా ఉండేవారు. అయితే ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ గేమర్స్‌లో 43 శాతం మంది మహిళలే ఉన్నారు. గేమింగ్ పట్ల మహిళలు ఆసక్తి చూపించడం ఒక కోణం అయితే, దానిని ఫుల్-టైమ్ కెరీర్‌గా ఎంచుకోవడం మరో కోణం. 'గేమింగ్ ల్యాండ్ స్కేప్' స్టడీ ప్రకారం గేమింగ్ వల్ల ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు రిలాక్సేషన్ వస్తుందని ఎక్కువ మంది మహిళలు నమ్ముతున్నారు.

మహిళా గేమర్స్ కోసం ప్రత్యేకమైన బ్యానర్స్, సెక్షన్‌లు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నాడు రూటర్ ఫౌండర్, సీఇవో పీయూష్ కుమార్. ఇతర దేశాలకు చెందిన ఫిమేల్ డెవలపర్స్ నుంచి స్ఫూర్తి పొంది మహిళా గేమర్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఎగ్జాయిటింగ్ గేమ్స్, కొత్త ఫార్మట్‌లను మన దేశానికి చెందిన గేమింగ్ కంపెనీలు క్రియేట్ చేస్తున్నాయి.

బ్యూటిప్స్

చర్మకాంతికి మేలైన ప్యాక్స్



- ఆలివ్ ఆయిల్, పెరుగు, తేనె ఈ మూడూ సమపాళ్లలో తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి 10–15 నిమిషాలు ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మం మృదువుగా అవుతుంది.
- అర టీ స్పూన్ సహజసిద్ధమైన గంధంపొడిలో రోజ్‌వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో శుభ్రపరచాలి. ఈ ఫేస్‌ప్యాక్ వారంలో రెండు సార్లు వేసుకున్నా ముఖంపై మురికి, మచ్చలు తగ్గి చర్మ కాంతి పెరుగుతుంది.
- సహజసిద్ధమైన బ్లీచింగ్‌గా పనిచేసే దోస లేదా కీరను గుజ్జుగా చేయాలి. ఈ గుజ్జు ముఖానికి, మెడకు, చేతులకు రాసి, మృదువుగా రబ్ చేయాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. జిడ్డు చర్మం గలవారు వారానికి ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే కాంతి పెరుగుతుంది.

ఇంటిప్స్



- వజ్రాలు లేదా ఇతర రాళ్ల ఆభరణాలను శుభ్రం చేయాలంటే, కొద్దిగా వాషింగ్ పౌడర్ కలిపి మరిగించిన నీటిలో పదిహేను నిమిషాలపాటు నానబెట్టాలి. తర్వాత వాటిని బయటకు తీసి శుభ్రమైన వెల్వెట్ క్లాత్‌తో తుడిచేస్తే జిగేల్మని మెరుస్తాయి.
- వాతావరణంలో మార్పుల వల్ల దంతపు వస్తువులు తెల్లదనం పోయి పసుపుగా మారుతుంటాయి. అలాంటప్పుడు వాటిని నిమ్మచెక్కతో రుద్దితే తిరిగి తెల్లగా మిలమిలలాడతాయి.
- ఫర్నీచర్‌కు పట్టిన మరకలు పోయి కొత్తవాటిలా మెరవాలంటే టేబుల్ స్పూన్ వెనిగర్‌లో అంతే మోతాదు ఆలివ్ ఆయిల్ కలిపి తుడిస్తే సరి!



- వెండి వస్తువులు తెల్లగా మెరవాలంటే బూడిదతో కాని బూడిదలో ఉప్పు కలిపి కానీ రుద్దాలి. వైట్ టూత్ పేస్ట్‌తో రుద్దినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముత్యాల ఆభరణాలను గాలి తగిలేవిధంగా జాగ్రత్త చేయాలి. ఎక్కువ రోజులు గాలి చొరని బీరువాలలో ఉంచితే రంగు మారతాయి. అందువల్ల వాటిని ధరించే ముందు మెత్తటి వస్త్రంతో మెరుగు పెట్టినట్లు సున్నితంగా తుడవాలి.

● చేయూత

ఆత్మబలమే ఆయుధమై



కోల్‌కతాలో జరిగిన వర్క్‌షాప్

కొండంత కష్టం వచ్చినప్పుడు కొండంత దిగులు కంటే... పిడికెడు ధైర్యం కావాలి! ఆ ధైర్యం ఇచ్చే శక్తి ఎంత గొప్పదంటే మనల్ని కొత్త మనుషులుగా మారుస్తుంది!!

పదిహేను సంవత్సరాల వయసులో మానవ అక్రమ రవాణా ముఠా నుంచి రక్షించబడింది కోల్‌కత్తాకు చెందిన పియూ మొండల్. ఆ తరువాత ఆమె ఒక పునరావాస కేంద్రంలో తలదాచుకుంది. అక్కడ తనలాంటి వాళ్లు ఎంతోమంది పరిచయం అయ్యారు. ఒకరి బాధలను ఒకరు పంచుకున్నారు.

'బాధితుల మనసు బాధితులకే తెలుస్తుంది' అనుకున్న పియూకు 'బాధితులందరూ కలిసి ఓ స్వచ్ఛంద సంస్థ ప్రారంభిస్తే ఎలా ఉంటుంది?' అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ఇండియన్ లీడర్‌షిప్ ఫోరమ్ అగేనెస్ట్ ట్రాఫికింగ్ (ఐఎల్‌ఎఫ్‌ఏటీ)గా ఆచరణ రూపం దాల్చింది.

పశ్చిమబెంగాల్‌లోని సుందర్‌బన్ జిల్లా కేంద్రంగా మొదలైన ఈ స్వచ్ఛందసంస్థ మానవ అక్రమ రవాణా బాధితుల్లో ఎంతో ధైర్యాన్ని నింపింది.

'మేమందరం కలిసి ప్రారంభించిన మా సంస్థ' అని పదిమందిలో గర్వంగా చెప్పుకునేలా చేసింది.

పదుల సంఖ్యలో మొదలైన 'ఐఎల్‌ఎఫ్‌ఏటీ' ఇప్పుడు 5,000 మంది సభ్యులు ఉన్న బలమైన సైన్యంగా మారింది.

'ఒక కుటుంబంలో అయిదారుగురు సభ్యులు ఉండవచ్చు. మా కుటుంబంలో మాత్రం వేలాది మంది ఉన్నారు' అని సభ్యులు గర్వంగా మురిసిపోతుంటారు.

కేవలం చెప్పుకోవడానికి పరిమితం కాకుండా ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు అండగా నిలుస్తుంటారు.

మన దేశంలో వివిధ రూపాల్లో మానవ అక్రమ రవాణా అనేది పెద్ద సమస్యగా ఉంది. బాధితులను రక్షించే నెపంతో వ్యభిచారకూపంలోకి దింపిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఎవరిని నమ్మాలన్నా భయంగా ఉండేది. ఈ నేపథ్యంలో 'ఐఎల్‌ఎఫ్‌ఏటీ' బాధితులకు పెద్ద అండగా నిలబడింది.

'సాధ్యం అవుతుందా అనే సందేహం వచ్చినప్పుడు ఎన్నో సందేహాలు చుట్టుముట్టాయి. సాధించాల్సిందే... తప్పదు అనుకున్నప్పుడు ఎంతో సంకల్పబలం వచ్చింది. ఆ బలమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది
- పియూ మొండల్

పరిస్థితి చేయిదాటిపోయిన తరువాత ఈ సంస్థను ఆశ్రయించేవారు కొందరైతే, ప్రమాదాన్ని ఊహించి సంస్థను ఆశ్రయించేవారు కొందరు.

సభ్యులు ఆర్థికంగా సొంతకాళ్ల మీద నిలబడేలా చేయడంలో 'ఐఎల్‌ఎఫ్‌ఏటీ' విజయం సాధించింది. స్త్రీ సాధికారతకు సంబంధించి గ్రామీణప్రాంతాల్లో ఎన్నో వర్క్‌షాప్‌లతో పాటు హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తోంది సంస్థ.

'సాధ్యం అవుతుందా అనే సందేహం వచ్చినప్పుడు ఎన్నో సందేహాలు చుట్టుముట్టాయి. సాధించాల్సిందే...తప్పదు అనుకున్నప్పుడు ఎంతో సంకల్పబలం వచ్చింది. ఆ బలమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది' అంటుంది ఐఎల్‌ఎఫ్‌ఏటీ అధ్యక్షురాలు పియూ మొండల్.

ఎవరెవరు ఎక్కువగా తాగాలి?

● ఎక్కువగా ఆకుకూరలు తినని వారు ● మలబద్ధకం ఎక్కువగా ఉన్నవారు
● రక్తపోటుతో బాధపడేవారు ● రక్తసరఫరా వ్యవస్థలో లోపాలు ఉన్నవారు
● కిడ్నీలో రాళ్లు ఉన్నవారు ● ఆర్థరైటిస్ వంటి వ్యాధులు ఉన్నవారు ● గర్భవతులు, పాలిచ్చే తల్లులు
● జీర్ణసమస్యలు ఉన్నవారు మిగతావారితో పోలిస్తే మరిన్ని నీళ్లు తాగాలి.



నీరు సరిగా తాగే తీరు



మనలో 60 శాతం నీరే ఉంటుంది. ఎందుకంటే, మన శరీరంలోని దాదాపు అన్ని జీవక్రియలూ నీళ్ల వల్లే జరుగుతాయి. అందుకే మనిషి మనుగడకు నీళ్లు చాలా అవసరం. వివిధ ప్రక్రియలలో భాగంగా మన కణాల్లోని నీరు బయటకు వెళ్లిపోవడం వల్ల చర్మం తన బిగుతును కోల్పోతుంది. అప్పుడు గిచ్చినట్లుగా చర్మాన్ని మెలిపెడితే, అది వెంటనే యథాతథ స్థితికి రాకుండా ముడుచుకుపోతుంది. ఇలా చేయడం ద్వారానే మనకు డీ హైడ్రేషన్ పరిస్థితి వచ్చిందా అన్న అంశాన్ని డాక్టర్లు తెలుసుకుంటారు. ఇలా జరిగినప్పుడు... మనం కోల్పోయిన స్రావాలను... నీళ్లు, ఖనిజ లవణాలతో భర్తీ చేయాల్సి ఉంటుంది. అలా భర్తీ



మీరు మంచినీళ్లు రోజుకు ఎన్ని సార్లు తాగుతారంటే.. దానికి లెక్క ఏముంది, దాహం వేసినప్పుడు తాగుతాం కదా అనుకుంటారు, అంటారు కూడా. ఎండలో కష్టం చేసే వారి సంగతి సరే, రోజు ఏసీ గదుల్లో ఉంటూ ఎంతమంది తగినన్ని నీళ్లు తాగుతున్నారు? కొందరయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. నీళ్లు తాగాలంటే బద్ధకంగా ఫీలయే వారు కొందరు. నిజానికి నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడొంతులు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందక పోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. నీళ్లను కూడా పద్ధతి ప్రకారం తాగడం ఎంతో ప్రయోజనకరం. అదెలాగో తెలుసుకుందాం.

చేయడం చాలా అవసరం. లేదంటే అది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు.

ఎప్పుడెప్పుడు తాగాలి?

ఉదయం నిద్ర లేవగానే ముందుగా నీళ్లు తాగాలి. శరీరంలో నిద్ర సమయంలో లోపించిన ద్రవాల భర్తీకి ఇది ఒక మంచి మార్గం. అంతే కాదు... ఇలా తాగడం వల్ల నిద్రించే సమయంలో మన శరీరంలో పేరుకుపోయిన మాలిన్యాలను కూడా తొలగిస్తాయి. వ్యాయామానికి ముందు, తర్వాత నీళ్లు తాగాలి. అయితే వెంటనే కాకుండా కాస్త వ్యవధి ఇచ్చి తాగాలి. డీహైడ్రేషన్‌కూ, శరీరంలో విషపదార్థాలకూ ఆస్కారం ఇచ్చే కూల్‌డ్రింక్స్‌ను వీలైనంతగా తగ్గించాలి.

నీళ్లు సరిగ్గా తాగకపోతే వచ్చే సమస్యలు ఏంటి?

మీరు కుర్చుని లేవలేక పోతున్నారా... కీళ్లు, కండరాలు నొప్పులతో అవస్థపడుతున్నారా... అయితే మీరు తక్కువ నీళ్లు తాగుతున్నారన్నమాట. ఎందుకంటే.. కీళ్లమధ్యలో ఉండే కార్టిలేజ్ 80 శాతం నీటితో నిర్మితమై ఉంటుంది. మీరు నీళ్లు తక్కువగా తాగినప్పుడు ఈ నొప్పుల వస్తాయి..

నీరు తక్కువగా తాగినప్పుడు తలనొప్పి వేధిస్తుంటుంది. ఆక్సిజన్ తక్కువగా అందడం, మెదడుకి రక్త సరఫరా తక్కువ కావడం వంటివి డీహైడ్రేషన్ ద్వారా కలుగుతాయి. దీంతో తలనొప్పి వస్తుంది.

అలసట, ఎనర్జిటిక్‌గా, యాక్టివ్‌గా లేకపోవటం అనేవి తక్కువ నీరుకు సంబంధించినదే... బ్లడ్ ప్రెజర్ తగ్గిపోతుంది. దీనివల్ల ఆక్సిజన్ సరిగా అందదు. ఇలాంటి లక్షణాలు మీలో కనిపించాయి అంటే.. మీరు శరీరానికి కావాల్సిన మోతాదులో నీళ్లు తాగడం లేదని అర్థం.

వేసవిలో ఇంకాస్త ఎక్కువగా...

మన జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి ఎప్పుడూ 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతే కావాలి కదా. అందుకే... చెమట పట్టేలా చేయమని స్వేద గ్రంథులను మెదడు ఆదేశిస్తుంది. చెమట పట్టగానే... బయటి నుంచి వీచే గాలి వల్ల మన చర్మంపైనున్న చెమట ఆవిరి అవుతుంటుంది. ఇలా ఆవిరి కావాలంటే చెమట నీటికి కొంత ఉష్ణోగ్రత అవసరం.

అప్పుడా చెమటనీరు మన దేహంలోని లేటెంట్‌హీట్ అనే ఉష్ణాన్ని తీసుకుని ఆవిరై పోతుంది. ఇలా మన దేహంలోంచి కొంత ఉష్ణోగ్రత తొలగగానే ఆ మేరకు ఒళ్లు చల్లబడుతుంది. ఇలా మనం ఎండలోకి వెళ్లగానే చల్లబరిచే ప్రక్రియ అదేపనిగా జరుగుతూ దేహ ఉష్ణోగ్రత స్థిరంగా ఉండేలా మెదడులోని మెకానిజమ్ తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. అంటే మన దేహంలోని ఉష్ణోగ్రత స్థిరంగా ఉండటానికి తగినన్ని నీళ్లు లేవనుకోండి. అప్పుడు చెమట పట్టడానికి అవసరమైన నీరు లేక దేహం చల్లబడే ప్రక్రియ జరగక చర్మం ఎర్రబారిపోతుంది. ఇదే వడదెబ్బ తగలడానికి ముందుగా కనిపించే తొలి లక్షణం. ఇలాంటి సమయాల్లో ఒంట్లోకి తగినన్ని ద్రవాలను భర్తీ చేయాలి. ఇందుకోసం నీళ్లు, ఖనిజ లవణాలను అందించాలి.

ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే తగినన్ని నీళ్లు తాగాలి.

ఇలా తాగడం మంచిది!

ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగకూడదు. గుక్క గుక్కగా తాగుతూ ఉండాలి. నీళ్లు మరీ చల్లగా గాని, మరీ వేడిగా గాని ఉండకూడదు. గది ఉష్ణోగ్రత వద్ద ఉండాలి. ఏదైనా తినడానికి అరగంట ముందు నీళ్లు తాగడం మంచిది. తినేటప్పుడు నీళ్లు తాగకూడదు. ఎందుకంటే నీళ్లతోపాటు గ్యాస్ కూడా లోపలికి వెళ్లి తగినంతగా తినలేరు. పైగా ఆ గ్యాస్ పైకి తన్నుతూ ఉండటం వల్ల తేన్పుల్లా వస్తుంటాయి. అందుకే ఆహారం సాఫీగా లోపలికి వెళ్లడానికి అరగ్లాసు నీళ్లు గుటక వేస్తే చాలు. ఆ తర్వాత మళ్లీ దాహం వేసినప్పుడే నీళ్లు తాగాలి.



దగ్గు, జలుబు సహజంగానే ఇలా తగ్గు

గత కొద్దిరోజులుగా వాతావరణంలో వస్తున్న రకరకాల మార్పుల వల్ల దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. చాలామంది మెడికల్ షాప్‌కు వెళ్లి వాళ్లు ఇచ్చిన మందులు తెచ్చుకుని వేసుకుంటూ ఉంటారు. అది చాలా ప్రమాదం. దానివల్ల రకరకాల దుష్ఫలితాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు వైద్యులు. దగ్గు, జలుబుకు సహజమైన చిట్కాలు పాటించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. అవేమిటో తెలుసుకుందాం.

అసలు దగ్గు, జలుబు రాకుండా ఉండాలంటే రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తిన్నట్లయితే తొందరగా ఈ అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బలవర్ధకమైన ఆహారం తీసుకొని శరీరాన్ని బలంగా ఉంచుకుంటే, అసలు ఇవి రాకుండానే ఉంటాయి. జలుబు, దగ్గు వంటి సమస్యల నివారణకు యాంటీబయాటిక్స్ ఉపయోగించటం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

సహజ చిట్కాలు... ● తులసి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని తాగితే జలుబు, దగ్గు నుండి ఉపశమనం లభిస్తుంది. రోజుకు రెండుసార్లు పసుపు, వేడి పాలను కలిపి తీసుకుంటే కూడా ఉపశమనం దొరుకుతుంది ● మిరియాల కషాయాన్ని తాగినా, లవంగాలు బుగ్గన పెట్టుకుని వాటి రసాన్ని మింగుతున్నా, వేడి వేడి మసాలా టీ తయారు చేసుకొని తాగినా మంచి ఫలితం ఉంటుంది ● చెంచాడు నిమ్మ రసాన్ని, రెండు స్పూన్ల తేనెను వేడినీళ్లలో కలుపుకొని తాగితే ఉపశమనం దొరుకుతుంది ● అల్లాన్ని దంచి కషాయం చేసుకుని తాగినా, అల్లం టీ చేసుకుని తాగినా కూడా రిలీఫ్ ఉంటుంది ● కొద్దిగా పసుపు, ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో పుక్కిట పట్టడం వల్ల గొంతుకు ఉపశమనం దొరుకుతుంది ● కొన్ని తులసి ఆకులు, చిన్న అల్లం ముక్క, కొన్ని వెల్లుల్లి ముక్కలు, టీ స్పూన్ వాము, మెంతులు, పసుపు, నాలుగైదు నల్ల మిరియాలు వేసి నీళ్లు పోసి బాగా మరిగించి కషాయం తయారు చేసుకుని తాగితే మరింత మంచి ఫలితం ఉంటుంది.

వేడినీళ్లకే ఓటేయండి... ● దగ్గు, జలుబుతో బాధపడేవారు శీతల పానీయాల జోలికి వెళ్లకుండా ఉండటం మంచిది. అదేవిధంగా ఫ్రిజ్‌లో నుంచి తీసిన చల్లటి నీళ్లను తాగడానికి బదులు ఎప్పుడు నీళ్లు తాగినా కాస్త వేడిగా ఉన్న నీటిని మాత్రమే తాగడం మంచిది.

ఈ పండ్లు మంచిది... పైనాపిల్, నిమ్మ, కివి వంటి పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కూడా జలుబు, దగ్గు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

● బీరకాయ

సాధారణంగా జ్వరం వచ్చి తగ్గినప్పుడు పథ్యం కూరలా బీరకాయ వండుతుంటారు. బీరకాయలో కొవ్వులు తక్కువగా, నీరు, పీచుపదార్థం ఎక్కువగా ఉండి, పోషకాలు అధికంగా ఉండడంతో పాటు తొందరగా జీర్ణం కావడమే అందుకు కారణం.

నిజానికి బీరకాయను పథ్యం కూరలా కాదు, ఆహారంలో తరచు భాగం చేసుకోవడం ఎంతో మంచిది. ఎందుకంటే, బీరపాదు మొత్తం ఔషధపూరితం అని వైద్యులు అంటున్నారు. సాధారణ, నేతి బీరకాయ- రెండు రకాల కాయల్లోనూ పీచు, విటమిన్-సి, జింక్, ఐరన్, రిబోఫ్లేవిన్, మెగ్నీషియం, థయమీన్... వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెల్యులోజ్ ఎక్కువగా ఉండటంతో ఇది మలబద్ధకాన్నీ మొలలవ్యాధినీ నివారిస్తుంది. ● బీరకాయల్లోని పెప్టైడ్‌లు, ఆల్కలాయిడ్‌లు రక్తంలోనూ మూత్రంలోనూ ఉండే చక్కెర నిల్వల శాతాన్ని తగ్గించేందుకూ తోడ్పడతాయి. మాంగనీసు జీర్ణక్రియా ఎంజైములు ఉత్పత్తిని పెంచడం ద్వారా చక్కెరవ్యాధినీ నియంత్రిస్తుంది. ● రక్తశుద్ధికీ కాలేయ ఆరోగ్యానికీ తోడ్పడుతుంది. దెబ్బ తిన్న కాలేయాన్నీ రక్షిస్తుంది. ● కామెర్లు వచ్చినవాళ్లు బీరకాయ రసం తాగడంవల్ల మంచి ఫలితం ఉంటుందనీ దీని వల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్లూ రావనీ రోగనిరోధకశక్తిని పెంపొందిస్తుందనీ తేలింది. ● అల్సర్లూ మంటలతో బాధపడేవాళ్లకి బీరకాయ మందులా పనిచేస్తుంది. ● బీరకాయలోని విటమిన్-ఎ కంటికండరాల బలహీనత కారణంగా తలెత్తే అంధత్వాన్ని నివారిస్తుందని జాతీయ అంధత్వ నివారణ సంస్థ పేర్కొంటోంది. ఇందులోని విటమిన్ బి5 చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందట. ● బీరకాయల్లోని విటమిన్ బి6 అనీమియాను నివారించగలదనీ తేలింది.

ఇన్ని ప్రయోజనాలున్న బీరకాయను పథ్యంలా కాకుండా తరచు తీసుకోవడమే మంచిది కదా మరి.



పథ్యంలా కాదు... ప్రధానంగా తీసుకోండి

● హెల్త్ టిప్స్



- ముల్లంగిని కూరగా చేసుకుని గానీ, దంచిన రసంగా గానీ తాగాలి. పల్లేరు సమూలంగా కషాయం చేసుకుని తాగితే మూత్ర సంచి సమస్యలు తగ్గుతాయి.
- ముద్దగా ఉన్న ఇంగువను నిమ్మరసంతో కలిపి నూరి కొద్దిగా వెచ్చచేసి దూదిని దానిలో ముంచి తడిపి పంటి నొప్పి వున్నచోట పెడితే పంటి నొప్పి తగ్గిపోతుంది.
- వంద గ్రాముల వాము శుభ్రం చేసి ఎర్రగా వేయించి, మెత్తగా పొడిచేసి డబ్బాలో నిల్వ ఉంచుకొని గ్యాస్ట్రబుల్ ఉన్నప్పుడు ఒక చెంచా పొడిని నీళ్లల్లోగాని, విడిగా గాని తీసుకుంటే ఎక్కువ తేన్పులు రాకుండా ఉంటుంది.
- బిళ్ళగన్నేరు ఆకుల్ని, జామ ఆకుల్ని సమతూకంలో తీసుకుని ముద్దచేసి ఈ ముద్దని ఐదు చెంచాల వంతున ఉదయం సాయంత్రం 3 రోజులు తీసుకుంటే అతిసార వ్యాధి తగ్గుతుంది.

సినిమా

అందుకే ఆ ధైర్యం చేశా! - కృష్ణవంశీ

''ప్రతి నటుడిలో విభిన్న కోణాలు ఉంటాయి. వాటిని ప్రేక్షకులకు సరికొత్తగా చూపించడం నాకు ఇష్టం. విలన్‌గా చేస్తున్న చలపతిరావు గారిని 'నిన్నే పెళ్లాడతా'లో మంచి తండ్రిగా చూపించాను. బ్రహ్మానందంగారిలోని మరో నటుణ్ణి 'క్షణం క్షణం'లో చూశాను. అందుకే 'రంగ మార్తాండ'లోని చక్రి పాత్రలో ఆయన్ని ఊహించుకునే ధైర్యం చేశా.. ఆయన పాత్ర అద్భుతంగా వచ్చింది'' అన్నారు డైరెక్టర్ కృష్ణవంశీ.



● కృష్ణవంశీ, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక, ఆదర్శ్, అనసూయ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'రంగమార్తాండ'. కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలైంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ– ''మరాఠీ చిత్రం 'నటసామ్రాట్' ప్రకాశ్‌రాజ్‌కి బాగా నచ్చింది. నన్నా సినిమా చూసి, స్క్రీన్‌ప్లేలో సాయం చేయమన్నాడు. నాలాంటి రాక్షసుడితోనే కంటతడిపెట్టించిన చిత్రమది. ఆ తర్వాత నాకు తోచిన మార్పులు ప్రకాశ్‌రాజ్‌కి చెబితే.. 'ఈ సినిమాకి నువ్వే దర్శకత్వం వహిస్తే బాగుంటుంది' అనడంతో ఓకే అన్నాను. మనుషులపై నాకు ఇంకా నమ్మకం పోలేదు. ఓ మంచి సినిమా తీస్తే ఆదరిస్తారనే నా నమ్మకాన్ని వారు 'రంగమార్తాండ' ద్వారా నిజం చేశారు. 1250కి పైగా సినిమాలు చేసిన బ్రహ్మానందంగారు ఒక్కో సీన్‌కి పదీ ఇరవై టేకులు చెప్పినా చేసేవారు. ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందంగారి నటన, ఇళయరాజాగారి సంగీతం సినిమాకి హైలైట్. శివాత్మిక, అనసూయ, రాహుల్, ఆదర్శ్ బెస్ట్ ఇచ్చారు. చిరంజీవిగారి వాయిస్ ఓవర్ ప్లస్సయింది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు బ్రహ్మానందం.

● చిరంజీవి, రష్మిక, నితిన్



నాకు మరింత స్పెషల్ - నితిన్

హిట్ మూవీ 'భీష్మ' (2020) తర్వాత హీరో నితిన్, హీరోయిన్ రష్మికా మందన్నా, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా ప్రారంభోత్సవంలో దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో చిరంజీవి క్లాప్ ఇచ్చారు. గోపీచంద్ మలినేని గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకులు హను రాఘవపూడి, బుచ్చి బాబు స్క్రిప్ట్‌ను అందించారు. ''చిరంజీవిగారు మా 'వీఎస్ఆర్ (వెంకీ, నితిన్, రష్మిక) ట్రయో'ను ఆశీర్వదించడంతో మా సినిమా నాకు మరింత స్పెషల్ అయ్యింది'' అని ట్వీట్ చేశారు నితిన్. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల.

యూత్‌ఫుల్ పార్టీ

● క్రిష్, అభిషేక్



క్రిష్ సిద్ధిపల్లి హీరోగా నటిస్తున్న 'రేవ్ పార్టీ' చిత్రం శుక్రవారం ఆరంభమైంది. బోనగాని ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై రాజు బోనగాని దర్శకత్వం వహిస్తున్నారు. రాజు బోనగాని మాట్లాడుతూ– ''రేవ్ పార్టీలో ఏం జరుగుతుంది? ఈ పార్టీల మూలంగా కొందరు యువత జీవితాల్లో ఎలాంటి మలుపులు చోటు చేసుకుంటాయి? అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కన్నడంలో చిత్రీకరించాక ఈ సినిమాను మిగతా భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దిలీప్ బండారి.


వేసవిలో మళ్ళీ పెళ్లి



● పవిత్ర, నరేశ్

వీకే నరేష్, పవిత్రా లోకేష్ ముఖ్య తారలుగా దర్శక–నిర్మాత ఎమ్ఎస్ రాజు తెరకెక్కిస్తున్న ద్విభాషా (తెలుగు, కన్నడం) చిత్రం 'మళ్ళీ పెళ్లి'. విజయకృష్ణా మూవీస్‌పై వీకే నరేష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విజయకృష్ణా మూవీస్ యాభైఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'మళ్ళీ పెళ్లి' సినిమాను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, సినిమాను ఈ వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.

బాలీవుడ్ దర్శకుడు ప్రదీప్ సర్కార్ ఇకలేరు



బాలీవుడ్ దర్శకుడు, ఆర్ట్ డైరెక్టర్ ప్రదీప్ సర్కార్ ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కోల్‌కతాలో 1955 ఏప్రిల్ 30న జన్మించారు ప్రదీప్ సర్కార్. సినిమాల్లోకి రాకముందు క్రియేటివ్ డైరెక్టర్, డైరెక్టర్‌గా పలు వాణిజ్య ప్రకటనలు, కొన్ని మ్యూజిక్ వీడియోలు చేశారాయన. సంజయ్ దత్ హీరోగా రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో వచ్చిన 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్' (తెలుగులో చిరంజీవి హీరోగా 'శంకర్‌దాదా ఎమ్‌బీబీఎస్‌గా' రీమేక్ అయింది)కు ఎడిటర్‌గా వర్క్ చేశారు ప్రదీప్ సర్కార్. ఆ తర్వాత 2005లో 'పరిణీత' (ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్, స్క్రీన్ డైరెక్టర్‌గా కూడా చేశారు)తో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చారు ప్రదీప్. విద్యాబాలన్, సైఫ్ అలీఖాన్, సంజయ్ దత్, రీమాసేన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. సూపర్ హిట్టయిన ఈ చిత్రానికిగాను 53వ జాతీయ అవార్డుల్లో 'ఇందిరాగాంధీ అవార్డు ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్' అవార్డును పొందారు. ఆ నెక్ట్స్ ఆయన 'లగా చునారీ మే దాగ్', 'మర్దానీ', 'హెలికాప్టర్ ఈలా' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. 'లగా చునారీ మే దాగ్' సినిమాకు రైటర్, ఆర్ట్ డైరెక్టర్‌గా చేశారు. అంతేకాదు..'అరేంజ్డ్ మ్యారేజ్', 'దురంగ' వంటి వెబ్ సిరీస్‌లకూ దర్శకత్వం వహించారు. ప్రదీప్ సర్కార్ మృతి పట్ల పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

నా అంతిమ లక్ష్యం అదే! - రచయిత శ్రీకాంత్ విస్సా

''రవితేజగారితో ఇది వరకే 'ఖిలాడి' సినిమాకు వర్క్ చేశాను. ఇప్పుడు ఆయన హీరోగా చేసిన ఈ 'రావణాసుర'తో పాటు 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాకూ వర్క్ చేస్తున్నాను. నేను చెప్పే కథలు రవితేజ గారికి నచ్చుతున్నాయి. అందుకే ఆయనతో వెంట వెంటనే అసోసియేట్ కావడం వీలవుతోంది'' అన్నారు రైటర్ శ్రీకాంత్ విస్సా.




రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్ర రచయిత శ్రీకాంత్ విస్సా మాట్లాడుతూ–''ప్రతి హీరోలో ఓ విలన్ ఉన్నట్లే ప్రతి విలన్‌లో ఓ హీరో ఉంటాడు. 'రావణాసుర' కాన్సెప్ట్ అదే. ఆ రావణాసురుడిలో ఎన్ని షేడ్స్ ఉన్నాయో.. రవితేజగారి పాత్రలోనూ అన్ని ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2', కల్యాణ్ రామ్ 'డెవిల్' చిత్రాలు చేస్తున్నాను. నా అంతిమ లక్ష్యం దర్శకత్వమే'' అన్నారు.

తెలుగు హీరో.. కన్నడ డైరెక్టర్

సినిమా రంగంలో ప్రతిభ ఉంటే చాలు.. భాషాపరమైన హద్దులు బద్దలవుతాయి. టాలెంట్ ఉంటే పిలిచి మరీ అవకాశాలు ఇస్తుంటారు ఆయా హీరోలు, నిర్మాతలు. ఇదే కోవలో తాజాగా ప్రశాంత్ నీల్, హర్ష, నార్తన్ వంటి కన్నడ దర్శకులు తెలుగు స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు.. తెలుగు హీరోలతో ఆ కన్నడ దర్శకులు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.



● రామ్‌చరణ్–నార్తన్



● ప్రభాస్–ప్రశాంత్



● గోపీచంద్–హర్ష

● కన్నడలో 'ఉగ్రం' (2014) సినిమాతో డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టారు ప్రశాంత్ నీల్. ఆ తర్వాత నాలుగేళ్లకు యశ్ హీరోగా 'కేజీఎఫ్' (మొదటి భాగం 2018) మూవీతో కన్నడ ఇండస్ట్రీని పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లారు. ఆ సినిమాకి సీక్వెల్‌గా వచ్చిన 'కేజీఎఫ్' (రెండవ భాగం 2022) చిత్రం కూడా సూపర్ హిట్ కావడంతో భారీ అవకాశాలు ప్రశాంత్ నీల్ డోర్‌ని టచ్ చేశాయి. అందులో భాగంగా పాన్ ఇండియా హీరోగా దూసుకెళుతున్న ప్రభాస్‌తో 'సలార్' మూవీ చేసే గోల్డెన్ చాన్స్ అందిపుచ్చుకున్నారు ప్రశాంత్. 'కేజీఎఫ్' నిర్మాత విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో స్టార్ హీరో ఎన్టీఆర్‌తో సినిమా చేసే చాన్స్ అందుకున్నారు ప్రశాంత్ నీల్. 'సలార్' షూటింగ్ పూర్తి కాగానే ఎన్టీఆర్ సినిమా ప్రీ ప్రొడక్షన్‌ని ఆరంభించనున్నారు ప్రశాంత్ నీల్. కొరటాల శివతో చేస్తున్న సినిమా పూర్తయ్యాక ప్రశాంత్ సినిమా షూటింగ్‌లో అడుగుపెట్టేలా ప్లాన్ చేస్తున్నారట ఎన్టీఆర్.

● కథా బలం, యాక్షన్ సినిమాలతో కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు డైరెక్టర్ ఎ. హర్ష. శివరాజ్‌కుమార్‌తో ఇటీవల ఆయన తెరకెక్కించిన 'వేద' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఆయన తెలుగులో హీరో గోపీచంద్‌తో ఓ సినిమా చేస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో 31వ చిత్రమిది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ ప్రొడక్షన్స్‌పై కేకే రాధా మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెలలోనే ప్రారంభమైంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది.

● రామ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో చేస్తున్న చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం తర్వాత 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు చరణ్. అదే విధంగా మరో సినిమాని కూడా లైన్‌లో పెట్టారట. 'ముఫ్తీ' (2017) సినిమాతో దర్శకుడిగా కన్నడలో ఘనవిజయం అందుకున్న నార్తన్‌తో రామ్‌చరణ్ సినిమా చేయనున్నారని టాక్. ఇక 'ముఫ్తీ' తర్వాత కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌తో నార్తన్ తీసిన 'భైరతి రణగల్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా చేస్తున్న సమయంలోనే రామ్‌చరణ్‌కు నార్తన్ ఓ కథ వినిపించగా, నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. శంకర్‌తో చేస్తున్న సినిమా తర్వాత బుచ్చిబాబు సినిమాని పూర్తి చేశాక నార్తన్ మూవీ చేస్తారట రామ్‌చరణ్.

ప్రశాంత్ నీల్, హర్ష, నార్తన్ మాత్రమే కాదు.. మరికొందరు కన్నడ దర్శకులు తెలుగు హీరోలతో సినిమాలు చేసేందుకు చర్చలు జరుపుతున్నారు.

వినోదం.. సందేశం

యువచంద్ర, శివ కుమార్, కౌటిల్య, సుదర్శన్ రెడ్డి హీరోలుగా ప్రియాంకా శర్మ , నేహా దేశ్ పాండే, హమీద హీరోయిన్లుగా నటించిన చిత్రం 'యమ డ్రామా'. టి. హర్ష చౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామ కృష్ణారావు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్ లోగోను ప్రముఖ నటి విజయశాంతి విడుదల చేసి మాట్లాడుతూ– ''నేటి ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని, యూత్‌ఫుల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లుగా దర్శక– నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రం సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''వినోదం, భావోద్వేగాలతో పాటు యువతకు ఓ మంచి సందేశం కూడా ఈ చిత్రంలో ఉంది. సాయికుమార్ యముడి పాత్రలో నటించడం ఈ సినిమాకు ఓ హైలైట్'' అన్నారు టి. హర్షచౌదరి.



● విజయశాంతి, హర్ష

మంచి ప్రేమ కథ

రిష్వి తిమ్మరాజు, విస్మయశ్రీ జంటగా నూతన దర్శకుడు రాజేష్ దొండపాటి తెరకెక్కించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని డైరెక్టర్ శ్రీవాస్ రిలీజ్ చేశారు. ''మా 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్' సినిమా ఓ మంచి ప్రేమ కథగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కామెడీ, రొమాన్స్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలు ఈ మూవీలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

● రిష్వి, విస్మయ



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			బులియన్ రూ.లలో – ముంబై	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽	నాస్‌డాక్	11,741	▽ 46	బంగారం (24 క్యారెట్)	
398	132	డోజోన్స్	32,075	▽ 29	59,653	△ 567
57,527	16,945	ఎఫ్‌టీఎస్ఈ 100	7,405	▽ 94	బంగారం (22 క్యారెట్)	
		డాక్స్	14,957	▽ 253	59,414	△ 567
		షాంఘై	3,266	▽ 21	వెండి (కిలో)	
		నికాయ్	27,385	▽ 34	69,756	△ 620

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను పెంపు

- ఎఫ్అండ్‌వో కాంట్రాక్టులకు వర్తింపు
- ఎంఎఫ్ పెట్టుబడులపైనా పన్ను దెబ్బ
- డెట్ ఫండ్స్ పెట్టుబడులపై ప్రభావం



న్యూఢిల్లీ: ప్రభుత్వం ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్‌వో) విభాగంలో సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను(ఎస్‌టీటీ) పెంచింది. దీంతోపాటు రుణ సెక్యూరిటీల(డెట్) మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనా స్వల్పకాలిక పన్నుకు తెరతీసింది. శుక్రవారం ఎస్‌టీటీసహా 64 సవరణలతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023 ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందింది. వెరసి పన్ను సవరణలతోకూడిన 2023 ఫైనాన్స్ బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. దీని ప్రకారం ఆప్షన్స్‌లో 0.05 శాతం నుంచి 0.0625 శాతానికి, ఫ్యూచర్ కాంట్రాక్టులలో 0.01 శాతం నుంచి 0.0125 శాతానికి ఎస్‌టీటీ పెరగనుంది. తద్వారా ప్రభుత్వ ఆదాయం బలపడటంతోపాటు.. ట్రేడింగ్ వ్యయాలు పెరగనుండటంతో మితిమీరిన లావాదేవీలకు చెక్ పడనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల భారీ సంఖ్యలో రిటైల్ ఇన్వెస్టర్లు ఈ విభాగంలో నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ చర్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. ఆప్షన్స్‌లో తొలుత 0.017 శాతం నుంచి 0.021 శాతానికి ఎస్‌టీటీ పెరగనున్నట్లు వెలువడిన వార్తలు టైపింగ్ పొరపాటుగా ఆర్థిక శాఖ వివరణ ఇవ్వడం గమనార్హం!

డెట్ ఎంఎఫ్‌లపైనా..

తాజా బిల్లు ప్రకారం డెట్ ఎంఎఫ్ ఆస్తులలో 35 శాతానికి మించి ఈక్విటీలలో ఇన్వెస్ట్ చేయవలసి ఉంటుంది. అంతకంటే తక్కువగా ఈక్విటీలకు మళ్లించే ఎంఎఫ్‌లు స్వల్పకాలిక పెట్టుబడి లాభాల(క్యాపిటల్ గెయిన్) పన్ను చెల్లించవలసి వస్తుంది. తాజా నిబంధనల ప్రకారం డెట్ ఎంఎఫ్‌లు చేపట్టే 35 శాతంలోపు ఈక్విటీ పెట్టుబడులపై శ్లాబులకు అనుగుణంగా పన్ను చెల్లించవలసి వస్తుంది. ప్రస్తుత సవరణలతో మార్కెట్ ఆధారిత డిబెంచర్, అధిక శాతం నిధులను రుణ సెక్యూరిటీలలో ఇన్వెస్ట్ చేసే ఎంఎఫ్ మధ్య సారూప్యతకు తెరలేవనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి ఎంఎఫ్‌లకు ప్రస్తుతం ఇండెక్సేషన్ లబ్ధితో కలిపి 20 శాతం దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్(ఎల్‌టీసీజీ) ట్యాక్స్ వర్తిస్తోంది.

ఆశ్చర్యకరం

ఎల్‌టీసీజీ సవరణలతోకూడిన 2023 ఫైనాన్స్ బిల్లు ఆశ్చర్యకరమని ఎంఎఫ్ పరిశ్రమ అసోసియేషన్(యాంఫీ) చైర్మన్, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ చీఫ్ ఎ.బాలసుబ్రమణ్యన్ పేర్కొన్నారు. తాజా మార్పులకు పరిశ్రమ సన్నద్ధం కావలసి ఉన్నట్లు తెలియజేశారు. కార్పొరేట్ బాండ్ల మార్కెట్ అభివృద్ధి ఎజెండాను బిల్లు దెబ్బతీసే వీలున్నట్లు పలువురు అసెట్ మేనేజర్లు అభిప్రాయపడ్డారు. పీఎస్‌యూ దిగ్గజాలు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లేదా నాబార్డ్ జారీ చేసే సెక్యూరిటీలకు డెట్ మ్యూచువల్ ఫండ్స్ అతిపెద్ద సబ్‌స్క్రయిబర్లన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సవరణలపై సమీక్షను చేపట్టవలసి ఉన్నట్లు యాంఫీ వైస్‌చైర్‌పర్సన్, ఎడిల్‌వీస్ ఏఎంసీ హెడ్ రాధికా గుప్తా పేర్కొన్నారు. దేశీయంగా ఫైనాన్షియలైజేషన్ ఇప్పుడిప్పుడే బలపడుతున్నదని, వైబ్రేంట్ కార్పొరేట్ బాండ్ల మార్కెట్‌కు పటిష్ట డెట్ ఫండ్ వ్యవస్థ అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. డెట్ ఎంఎఫ్‌లలో పెట్టుబడులకు దీర్ఘకాలిక నిధులు తగ్గిపోతే బాండ్ల జారీ సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవలసి వస్తుందని బాలసుబ్రమణ్యన్ వివరించారు. తాజా బిల్లు కారణంగా రిటైల్ ఇన్వెస్టర్లకు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయని మరికొంతమంది నిపుణులు అంచనా వేశారు. కాగా.. మార్కెట్లు అనిశ్చితిలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్‌టీటీ పెంపు సరికాదని పారిశ్రామిక సమాఖ్య పీహెచ్‌డీసీసీఐ పేర్కొంది. ఇది మార్కెట్ సెంటిమెంటు, లావాదేవీల పరిమాణంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ సాకేత్ దాల్మియా అభిప్రాయపడ్డారు. ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల విక్రయంపై ఎస్‌టీటీ పెంపుపై ఆర్థిక శాఖ స్పష్టతను ఇవ్వవలసి ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

అదనపు లావాదేవీ చార్జీలు రద్దు

ఏప్రిల్ 1 నుంచి ఎన్ఎస్ఈ అమలు

ఈక్విటీ నగదు, డెరివేటివ్స్ విభాగాలలో విధిస్తున్న అదనపు లావాదేవీల చార్జీలను ఏప్రిల్ 1 నుంచి రద్దు చేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా వెల్లడించింది. 2021 జనవరి 1 నుంచి 6 శాతం పెంపును అమలు చేస్తోంది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఎన్ఎస్ఈ తాజాగా తెలియజేసింది. ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ రక్షణ నిధి ట్రస్ట్(ఐపీఎఫ్‌టీ) మూలధనాన్ని(కార్పస్) పెంచేందుకు ఈ చార్జీలలో కొంత భాగాన్ని వినియోగిస్తోంది. రెండేళ్ల క్రితం బ్రోకర్ వైఫల్యాల కారణంగా మార్కెట్లలో సంకట పరిస్థితులు తలెత్తడంతో 6 శాతం చార్జీలను ఎన్ఎస్ఈ విధించింది.

ట్యాక్స్‌పేయర్లకు కొంత ఊరట..

న్యూఢిల్లీ: ఆదాయం రూ. 7 లక్షలకన్నా స్వల్పంగా ఎక్కువుండి, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునేవారికి కొంత ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 7 లక్షల పరిమితిని దాటిన మొత్తానికి మాత్రమే పన్ను విధించేలా ఆర్థిక బిల్లును సవరించింది. కేంద్ర ఆర్థిక శాఖ వివరణ ప్రకారం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త పన్ను విధానం ప్రకారం రూ. 7 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం ఉండదు. కానీ రూ. 7,00,100 ఉంటే మాత్రం రూ. 25,010 మేర పన్ను కట్టాల్సిరానుంది. అంటే రూ. 100 ఆదాయానికి రూ. 25,010 పన్ను భారం పడనుంది. ఈ నేపథ్యంలో పరిమితికన్నా ఆదాయం కాస్త ఎక్కువ ఉంటే, దానికి మించి పన్ను భారం ఉండరాదంటూ స్వల్ప ఊరటను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, ఎంత మేర అధిక ఆదాయానికి ఇది వర్తిస్తుందనేది ప్రభుత్వం నిర్దిష్టంగా వివరించలేదు. సుమారు రూ. 7,27,700 వరకు ఆదాయం ఉన్న వారికి దీనితో ప్రయోజనం ఉండగలదని నాంగియా ఆండర్సన్ పార్ట్‌నర్ సందీప్ ఝున్‌ఝున్‌వాలా తెలిపారు.



ఆకాశ ఎయిర్‌లో వెయ్యి కొలువులు

కంపెనీ సీఈవో వినయ్ దూబే వెల్లడి



న్యూఢిల్లీ: కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి సుమారు 1,000 మంది ఉద్యోగులను తీసుకోవాలని ఆకాశ ఎయిర్ భావిస్తోంది. తద్వారా మొత్తం సిబ్బంది సంఖ్యను 3,000కు పెంచుకోనుంది. దాదాపు ఏడు నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన ఆకాశ ఎయిర్ ఈ ఏడాది ఆఖరు నాటికి అంతర్జాతీయ రూట్లలోనూ సర్వీసులు మొదలుపెట్టాలని యోచిస్తోంది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో వినయ్ దూబే ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయ సేవలకు సంబంధించి అనువైన దేశాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి 'మూడు అంకెల స్థాయిలో' విమానాల కోసం ఆర్డరు ఇవ్వనున్నట్లు దూబే వివరించారు. ఆకాశ ఎయిర్ 72 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల కోసం ఆర్డరు ఇచ్చింది. ప్రస్తుతం కంపెనీ దగ్గర 19 విమానాలు ఉండగా .. వచ్చే ఆర్థిక సంవత్సరం మరో తొమ్మిది అందుబాటులోకి రానున్నాయి. ఏప్రిల్‌లో వచ్చే విమానంతో కలిపి ఎయిర్‌క్రాఫ్టుల సంఖ్య 20కి చేరుతుంది. తద్వారా విదేశాలకు సర్వీసులు ప్రారంభించేందుకు అర్హత లభిస్తుంది. తమకు ఇప్పుడు అదనపు విమానాలు లేకపోయినప్పటికీ ముందుగానే సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాల్సి వస్తుందని, వారికి శిక్షణనివ్వాల్సి ఉంటుందని దూబే తెలిపారు. ప్రస్తుతం తాము రోజుకు 110 ఫ్లయిట్స్ నడుపుతున్నామని.. ఈ వేసవి సీజన్ ఆఖరు నాటికి వీటిని 150కి పెంచుకుంటామని ఆయన చెప్పారు.

డాయిష్ బ్యాంక్ 14% డౌన్

ఫ్రాంక్‌ఫర్ట్: అంతర్జాతీయంగా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ షేర్లపైనా ప్రభావం పడింది. బ్యాంకు షేర్లు శుక్రవారం ఒక దశలో 14 శాతం క్షీణించాయి. ఆ తర్వాత కొంత కోలుకుని సుమారు 9 శాతం క్షీణతతో 8.52 యూరోల వద్ద ట్రేడయ్యాయి. బాండ్లను బీమా చేసేందుకయ్యే వ్యయాలు పెరిగిపోవడం డాయిష్ బ్యాంక్ పరిస్థితిపై ఆందోళనకు కారణమైనట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇటీవల స్విస్ బ్యాంక్ క్రెడిట్ సూసీ పతనానికి ముందు కూడా ఇలాంటి పరిణామమే చోటు చేసుకోవడం గమనార్హం. అయితే డాయిష్ బ్యాంక్ మరో క్రెడిట్ సూసీ కావచ్చన్న ఆందోళనలను జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ తోసిపుచ్చారు. బ్యాంక్ పటిష్టంగానే ఉందని స్పష్టం చేశారు.



సూచీలకు పన్ను పోటు

- సెన్సెక్స్ నష్టం 398 పాయింట్లు
- 17 వేల దిగువకు నిఫ్టీ

ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ కాంట్రాక్టులపై కేంద్రం సెక్యూరిటీ లావాదేవీల పన్ను 25 శాతం (0.05% నుంచి 0.0625 శాతానికి)పెంపుతో స్టాక్ సూచీలు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగంలో భయాలు దావానలంలా వ్యాప్తి చెందుతుండటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచింది. అలాగే డాలర్ రికవరీతో రూపాయి క్షీణత, విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 398 పాయింట్లు నష్టపోయి 57,527 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు క్షీణించి 17 వేల దిగువన 16,945 వద్ద నిలిచింది. ఉదయం సెషన్‌లో లాభాలతో కదలాడిన సూచీలు మిడ్ సెషన్ ముందు బలహీనపడ్డాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 57,423 – 58,066 పరిధిలో కదలాడింది. నిఫ్టీ 16,917–17,109 రేంజ్‌లో ట్రేడైంది. ఆ తర్వాత కొద్దిసేపు లాభనష్టాల మధ్య ట్రేడైన సూచీలు ఆఖర్లో అమ్మకాలు పోటెత్తడంతో వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంక్స్, మెటల్, మీడియా, రియల్టీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1720 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2556 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు క్షీణించి 82.40 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ రంగ సంక్షోభంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



ఏఎంసీ షేర్ల పతనం..

తాజా ఫైనాన్స్ బిల్లుతో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ)ల ఈక్విటీ పెట్టుబడులపై స్వల్పకాలిక పెట్టుబడి లాభాల పన్ను వర్తించనుండటంతో ఇన్వెస్టర్లు ఆందోళనలకు లోనయ్యారు. ప్రధానంగా యూటీఐ 4.7 శాతం, ఆదిత్య బిర్లా 4.4 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 4.2 శాతం చొప్పున పతనమయ్యాయి. ఈ బాటలో ఇతర ఏఎంసీలు శ్రీరామ్ 3.2 శాతం, నిప్పన్ లైఫ్ ఇండియా 1.3 శాతం చొప్పున క్షీణించాయి.



నేడు నీతూ, స్వీటీ 'పసిడి' పంచ్ పోరు

ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ఇద్దరు భారత బాక్సర్లు నీతూ (48 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) పసిడి పతకాల కోసం పోటీపడనున్నారు. నేటి ఫైనల్స్‌లో లుత్సయ్‌ఖాన్ (మంగోలియా)తో నీతూ... లీనా వాంగ్ (చైనా)తో స్వీటీ తలపడతారు. హరియాణాకు చెందిన 22 ఏళ్ల నీతూ 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం నెగ్గింది. 2017, 2018 ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకాలను సొంతం చేసుకుంది. సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీతూ తొలిసారి ఫైనల్‌కు చేరింది. హరియాణాకే చెందిన 30 ఏళ్ల స్వీటీ రెండోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2014లో రజత పతకం నెగ్గిన స్వీటీ ఈసారైనా తన పసిడి కలను సాకారం చేసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో నిఖత్ జరీన్ (50 కేజీలు), లవ్లీనా (75 కేజీలు) పోటీపడతారు.




రుద్రాంక్ష్‌కు కాంస్యం



భోపాల్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో వరుసగా మూడో రోజూ భారత్ ఖాతాలో పతకం చేరింది. శుక్రవారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో రుద్రాంక్ష్ 262.3 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో రుద్రాంక్ష్ 631 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో, భారత్‌కే చెందిన హృదయ్ హజారికా 630.4 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత పొందారు. ర్యాంకింగ్ రౌండ్‌లో హృదయ్ 208.7 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచాడు.

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



బాసెల్: స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 12–21, 21–17, 28–26తో ఫాంగ్ చియా లీ-ఫాంగ్ జెన్ లీ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్, డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 15–21, 21–12, 18–21తో పుత్రి కుసుమ వర్దిని (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది.

సలీమా టేటేకు 'ఆసియా హాకీ' అవార్డు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు మిడ్‌ఫీల్డర్ సలీమా టేటేకు ఆసియా హాకీ సమాఖ్య (ఏహెచ్‌ఎఫ్) అవార్డు లభించింది. 2022 సంవత్సరానికి జార్ఖండ్‌కు చెందిన 22 ఏళ్ల సలీమా టేటే 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకుంది. కొరియాలో జరిగిన ఏహెచ్‌ఎఫ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో సలీమాకు ఈ అవార్డు ప్రదానం చేశారు. 2016లో జాతీయ సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన సలీమా గత ఏడాది మస్కట్‌లో జరిగిన ఆసియా కప్ టోర్నీలో 'రైజింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కించుకుంది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులోనూ సభ్యురాలిగా ఉంది.

సివర్ జోరు... వాంగ్ హోరు

- డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ముంబై ఇండియన్స్
- ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీపై గెలుపు
- సివర్ మెరుపులు
- ఇసీ వాంగ్ 'హ్యాట్రిక్'
- ఆదివారం ఫైనల్లో ఢిల్లీతో ముంబై 'ఢీ'


సివర్


ఇసీ వాంగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఆరంభ అంచనాలను నిజం చేస్తూ ముంబై ఇండియన్స్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. లీగ్ దశ చివర్లో కాస్త తడబడినా... తమ స్థాయిని ప్రదర్శిస్తూ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం శుక్రవారం జరిగిన 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై 72 పరుగులతో ఏకపక్ష విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లో నాట్ సివర్ బ్రంట్ చెలరేగగా, బౌలింగ్ ఇసీ వాంగ్ లీగ్‌లో తొలి 'హ్యాట్రిక్'తో సత్తా చాటింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నాట్ సివర్ (38 బంతుల్లో 72 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు హాఫ్ సెంచరీ సాధించగా... అమేలియా కెర్ (19 బంతుల్లో 29; 5 ఫోర్లు) చివర్లో దూకుడుగా ఆడింది. అనంతరం యూపీ 17.4 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. కిరణ్ నవ్‌గిరే (27 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. కెప్టెన్ అలీసా హీలీ పుట్టిన రోజునాడు ఓటమిని ఎదుర్కొన్న యూపీ టోర్నీని మూడో స్థానంతో ముగించగా... ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై తలపడుతుంది.

సివర్ దూకుడు...

ముంబై ఇన్నింగ్స్ మొత్తంలో నాట్ సివర్ ఆట చుక్కానిలా నిలిచింది. వరుసగా నాలుగు కీలక భాగస్వామ్యాలతో ఆమె జట్టుకు భారీ స్కోరును అందించడంలో సఫలమైంది. తొలి బంతికే ఫోర్‌తో యస్తిక భాటియా (18 బంతుల్లో 21; 4 ఫోర్లు) ఆటను మొదలు పెట్టింది. ఆ తర్వాత కొన్ని చక్కటి షాట్లు ఆడిన తర్వాత యస్తికను అంజలి శర్వాణి వెనక్కి పంపించింది. ఆ తర్వాత హేలీ మాథ్యూస్ (26 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) జత కలసింది. హేలీ తనదైన శైలిలో ధాటిగా ఆడలేక విఫలం కాగా, ఎకెల్‌స్టోన్ చక్కటి బంతికి హర్మన్‌ప్రీత్ (14) అవుటైంది. అయితే మరో ఎండ్‌లో మాత్రం సివర్ తన జోరు కొనసాగించింది. పార్శవి ఓవర్లో వరుసగా 4, 6, 4 కొట్టిన ఆమె 26 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. చివరి 2 ఓవర్లలో ముంబై 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు రాబట్టడం విశేషం.

టపటపా...

కిరణ్ నవ్‌గిరే ఇన్నింగ్స్ మినహా యూపీ ఆటలో చెప్పుకోవడానికి ఏమీ లేకపోయింది. ఇషాక్ ఓవర్లో కిరణ్ 3 ఫోర్లు, 1 సిక్స్ బాదడమే హైలైట్. కీలక ప్లేయర్లు అలీసా హీలీ (11), తాలియా మెక్‌గ్రాత్ (7), గ్రేస్ హారిస్ (14) విఫలం కావడం జట్టును దెబ్బ తీసింది. 56/4తో కష్టాల్లో నిలిచి కోలుకునే ప్రయత్నం చేస్తున్న దశలో ఇసీ వాంగ్ ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో వరుస మూడు బంతుల్లో నవ్‌గిరే, సిమ్రన్ షేక్, సోఫీ ఎకెల్‌స్టోన్‌లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' సాధించింది. వాంగ్ దెబ్బకు యూపీ ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (సి) నవ్‌గిరే (బి) అంజలి 21; హీలీ మాథ్యూస్ (సి) నవ్‌గిరే (బి) పార్శవి 26; నాట్ సివర్ (నాటౌట్) 72; హర్మన్‌ప్రీత్ (బి) ఎకెల్‌స్టోన్ 14; అమేలియా కెర్ (సి) అంజలి (బి) ఎకెల్‌స్టోన్ 29; పూజ వస్త్రకర్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1–31, 2–69, 3–104, 4–164. **బౌలింగ్:** హారిస్ 3–0–20–0, అంజలి 3–0–17–1, రాజేశ్వరి 4–0–36–0, ఎకెల్‌స్టోన్ 4–0–39–2, దీప్తి శర్మ 4–0–39–0, పార్శవి చోప్రా 2–0–25–1.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) హర్మన్ (బి) వాంగ్ 11; శ్వేత (సి) మాథ్యూస్ (బి) ఇషాక్ 1; తాలియా (రనౌట్) 7; నవ్‌గిరే (సి) సివర్ (బి) వాంగ్ 43; హారిస్ (సి) వాంగ్ (బి) సివర్ 14; దీప్తి శర్మ (సి) కలిత (బి) మాథ్యూస్ 16; సిమ్రన్ (బి) వాంగ్ 0; ఎకెల్‌స్టోన్ (బి) వాంగ్ 0; అంజలి (బి) కలిత 5; రాజేశ్వరి (ఎల్బీ) (బి) ఇషాక్ 5; పార్శవి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (17.4 ఓవర్లలో ఆలౌట్) 110. వికెట్ల పతనం:** 1–8, 2–12, 3–21, 4–56, 5–84, 6–84, 7–84, 8–94, 9–104, 10–110. **బౌలింగ్:** నాట్ సివర్ 3–0–21–1, సైకా ఇషాక్ 2.4–1–24–2, వాంగ్ 4–0–15–4, అమేలియా 3–0–25–0, మాథ్యూస్ 3–0–21–1, అమన్‌జోత్ 1–0–2–0, కలిత 1–0–2–1.

రొనాల్డో రికార్డు...

అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పోర్చుగల్ కెప్టెన్ ఘనత



లిస్బన్: విఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో తన పేరిట మరో రికార్డును లిఖించుకున్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా 38 ఏళ్ల రొనాల్డో గుర్తింపు పొందాడు. యూరో-2024 క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా లిక్టెన్‌స్టయిన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డో బరిలోకి దిగాడు. పోర్చుగల్ తరఫున రొనాల్డో కెరీర్‌లో ఇది 197వ మ్యాచ్. తద్వారా 196 మ్యాచ్‌లతో కువైట్ ప్లేయర్ బదర్ అల్ ముతావా పేరిట ఉన్న రికార్డును రొనాల్డో బద్దలు కొట్టాడు. 2003 నుంచి పోర్చుగల్ జట్టుకు ఆడుతున్న రొనాల్డో వరుసగా ఐదు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా ఘనత వహించాడు. లిక్టెన్‌స్టయిన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 4–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. రొనాల్డో (51వ, 63వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేశాడు. దాంతో జాతీయ జట్టు తరఫున రొనాల్డో చేసిన గోల్స్ సంఖ్య 120కు చేరుకుంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు... అత్యధికంగా 10 హ్యాట్రిక్‌లు నమోదు చేసిన రికార్డు కూడా రొనాల్డో పేరిటే ఉన్నాయి.

1961 తర్వాత ఇటలీలో ఇంగ్లండ్ గెలుపు


హ్యారీ కేన్

యూరో-2024 క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా నేపుల్స్‌లో ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. 1961 తర్వాత ఇటలీ జట్టును వారి సొంతగడ్డపైనే ఇంగ్లండ్ ఓడించడం గమనార్హం. ఇంగ్లండ్ తరఫున రైస్ (13వ ని.లో), కెప్టెన్ హ్యారీ కేన్ (44వ ని.లో)... ఇటలీ తరఫున రెటుగుయ్ (56వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్ ద్వారా హ్యారీ కేన్ ఇంగ్లండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ గోల్స్ చేసిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. 53 గోల్స్‌తో వేన్ రూనీ పేరిట ఉన్న రికార్డును 54వ గోల్‌తో హ్యారీ కేన్ సవరించాడు.

మెస్సీ ఖాతాలో 800వ గోల్...

బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా 2–0తో పనామా జట్టును ఓడించింది. గత ఏడాది డిసెంబర్‌లో ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్ తర్వాత మెస్సీ ఆడిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో మెస్సీ 88వ నిమిషంలో గోల్ చేశాడు. దాంతో ప్రొఫెషనల్ కెరీర్‌లో 800 గోల్స్ సాధించిన రెండో ప్లేయర్‌గా మెస్సీ గుర్తింపు పొందాడు. 830 గోల్స్‌తో క్రిస్టియానో రొనాల్డో అగ్రస్థానంలో ఉన్నాడు.



నేటి నుంచి మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ

తొలి రౌండ్‌లో హంపితో హారిక 'ఢీ'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ 2022–2023లో భాగంగా మూడో టోర్నీ భారత్ వేదికగా నేడు మొదలుకానుంది. న్యూఢిల్లీలో ఏప్రిల్ 5 వరకు జరిగే ఈ టోర్నీలో 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లు జరుగుతాయి. భారత్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక పోటీపడుతున్నారు. శనివారం జరిగే తొలి రౌండ్ గేమ్‌లో వీరిద్దరు ముఖాముఖిగా తలపడతారు. ఫిబ్రవరిలో మ్యూనిక్‌లో జరిగిన రెండో టోర్నీలో హంపి రెండో స్థానంలో, హారిక నాలుగో స్థానంలో నిలిచారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.